
B. Venkataiah
Proprietor
Cell : 9700207214
శ్రీ శ్రీనివాస ప్రింటర్స్
SRI SRINIVASA PRINTERS
E-mail : srisrinivasaprinters3@gmail.com
H.No. 2-1-409/1, Opp. Sai Balaji Enterprises, Near Fever Hospital, Old Nallakunta, Hyderabad - 500 044. Telangana State.

# చాకిరేవు

తెలుగు దినపత్రిక

ప్రొ॥ బి.అలివేలు
7702882420
9666842057
9700207214
శ్రీ లక్ష్మి శ్రీనివాస మగ్గం వర్క్స్

1-9-129/23, రామాలయం వీధి, రాంనగర్, హైదరాబాద్ - 500 020.

కరీంనగర్, సంపుటి : 17, సంచిక : 136 మంగళవారం, మార్చి 24, 2026 ఎడిటర్ : బొమ్మపాల అలివేలు పేజీలు : 12 వెల : రూ 2

Circulated to Hyderabad, Rangareddy, Nalgonda, Khammam, Amaravathi, Vijayawada, Nellore

## బార్ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికైన ముఖీద్

హైదరాబాద్:మార్చి23 (చాకిరేవు) తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ప్రముఖ హైకోర్టు న్యాయవాది ఎం ఏ కె ముఖీద్ గారు గెలుపొందారు. ముఖీద్ గారు రెండోసారి తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఎం ఏ కె ముఖీద్ గారు 2017లో మొదటిసారి బార్ కౌన్సిల్ మెంబర్గా ఎన్నికైన తరువాత ఈసారి రెండోసారి గెలుపొందడం జరిగింది. హైకోర్టులో గత 35 సంవత్సరాలుగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ న్యాయవాద వృత్తిలో పేరు ప్రఖ్యాతి గడించారు. న్యాయవాది ఎం ఏ కె ముఖీద్ గారు నల్లగొండ జిల్లా అనుముల మండలం మారేపల్లి గ్రామానికి చెందినవారు. ఆయన మూడు దశాబ్దాలుగా హైదరాబాద్ లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ముఖీద్ విజయం పట్ల ఆయన జన్మస్థలం మారేపల్లితో పాటు అనుముల మండలం లోని ఆయన చిన్ననాటి స్నేహితులు, బంధువులు, మిత్రులు హర్షం వ్యక్తం






చేస్తున్నారు. అలాగే వివిధ జిల్లాల న్యాయవాదులు ముఖీద్ గారికి ఫోన్లు చేసి వ్యక్తిగతంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి హర్షం వ్యక్తం చేస్తున్నారు. మారేపల్లి గ్రామానికి చెందిన ముఖీద్ గారి చిన్ననాటి స్నేహితుడు హైదరాబాద్ జర్నలిస్టుల సంఘం జాయింట్ సెక్రటరీ, చాకిరేవు దినపత్రిక పబ్లిషర్ బొమ్మపాల వెంకటయ్య ముఖీద్ కు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల విద్యను ముఖీద్ మారేపల్లిలో చదివారని, తమకన్నా ఒక సంవత్సరం సీనియర్ అని, ముఖీద్ విద్యార్థి దశనుండి బాగా కష్టపడి చదివేవారని, ఆయన కుటుంబంలో అందరూ న్యాయవాదవృత్తిలో ఉన్నారని తెలిపారు. ముఖీద్ గారు భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని తమ గ్రామానికి ప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని వెంకటయ్య ఆకాంక్షించారు.

## 66వ సారి ఢిల్లీకి సీఎం

### - సింఘ్వీ ఇంట్లో పెండ్లికి హాజరు
### - అసెంబ్లీ జరుగుతుండగా రేవంత్ పర్యటనలపై విమర్శలు

హైదరాబాద్, మార్చి 23 (చాకిరేవు ప్రతినిధి): పెండ్లి వేడుకకు హాజరయ్యేందుకు సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ఢిల్లీ వెళ్లనున్నారు. రాజ్యసభ ఎంపీ, సీనియర్ లాయర్ అభిషేక్ మనుసింఘ్వీ ఇంట్లో జరిగే వివాహానికి ఆయన హాజరవుతారని



తెలిసింది. కాగా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లడం ఇది 66వ సారి. సీఎం ఢిల్లీ పర్యటనపై ప్రతిపక్షంతోపాటు సొంత పార్టీ నుంచి కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓవైపు అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా ఆయన ఢిల్లీ పర్యటనకు వెళ్లడం ఏమిటనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 17న కూడా సీఎం ఢిల్లీ వెళ్లి వచ్చారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి సమాధానం చెప్పాల్సి సీఎం సభకు చాలా ఆలస్యంగా వచ్చారు. సీఎం రాక కోసం ఎమ్మెల్యేలంతా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు కూడా ఓవైపు అసెంబ్లీలో కీలక ప్ర సంగం ఉన్న సమయంలో సీఎం ఢిల్లీ వెళ్లడం, అక్కడే ఒక రోజు ఉండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## వచ్చే రెండ్రోజులు పొడి వాతావరణం



హైదరాబాద్, మార్చి 23 (చాకిరేవు ప్రతినిధి) : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి, ఉత్తరాంధ్ర కోస్తా తీర ప్రాంతంలో ఉన్న ఉపరితల ఆవర్తనం కారణంగా మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలో పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. ఆ తర్వాత ఈనెల 26 నుంచి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉన్నదని వెల్లడించింది. ముఖ్యంగా ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్టు తెలిపింది. వచ్చే 48 గంటలు రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని వెల్లడించింది. కాగా, గడిచిన 24 గంటల్లో భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సంగారెడ్డి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురువగా, అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో 2.52 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు వివరించింది.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాల ప్రచార రథాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

నిర్మల్ మార్చి23 (చాకిరేవు జిల్లా ప్రతినిధి) గాలికుంటు వ్యాధి నివారణ టీకాలకు సంబంధించి జిల్లాలోని రైతులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటుచేసిన ప్రచార వాహనాన్ని



జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జెండా ఊపడం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులందరూ తమ పశు వులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించేలా ఈ ప్రచార రథం ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని వివరించారు. జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా, రైతులు విధిగా తమ పశువులకు టీకాలను వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, పశువైద్య అధికారి బాలిగ్ అహ్మద్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ఆసుపత్రులకు మూడు అంబులెన్స్‌లను అందించిన గ్రీన్‌సెల్ మొబిలిటీ

### - సీఎస్ఆర్ చొరవ కింద అత్యవసర ఆరోగ్య సంరక్షణ బలోపేతం

హైదరాబాద్, మార్చి 23, 2026 చాకిరేవు ప్రతినిధి : భారతదేశ ప్రముఖ ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్లాట్‌ఫామ్ అయిన గ్రీన్‌సెల్ మొబి లిటీ (GCM), సమాజ సంక్షేమం పట్ల తన నిబద్ధతను మరింత బలోపేతం చేస్తూ, ఎవర్‌సోర్స్ క్యాపిటల్ మద్ద తుతో తన స్పెషల్ పర్పస్ వెహికిల్స్ ద్వారా హైదరాబాద్‌లోని ప్రముఖ ఆరోగ్య సంరక్షణ సంస్థలకు మూడు అంబులెన్స్‌లను అందజేసింది. ఈ అంబులెన్స్‌లను రామ్‌దేవ్ రావు హాస్పిటల్, నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (NIMS), సర్ రోనాల్డ్ రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ & కమ్యూనికేషన్ డిసీజెస్ (ఫీవర్ హాస్పిటల్) లకు అందించారు. గ్రీన్‌సెల్ మొబిలిటీ హైదరాబాద్ డిపోలో ఇటీవల అంబులెన్స్‌ల అప్పగింత కార్యక్రమాలు జరిగాయి. వీటికి సైబరాబాద్‌లోని మాదాపూర్ అదనపు డిప్యూటీ కమిషనర్ (ట్రాఫిక్) శ్రీ జి. హనుమంతరావు గారు, గ్రీన్‌సెల్ మొబిలిటీ ప్రతినిధులు, సంబంధిత ఆసుపత్రుల అధికారులు నాయకత్వం వహించారు, ఇది హైదరాబాద్, పరిసర ప్రాంతాలలో అత్యవసర ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేయడం, క్లిష్టమైన రోగుల కదలికకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత ప్రయత్నాలను సూచిస్తుంది. అత్యవసర రవాణా లభ్యతను పెంచడం ద్వారా, ఈ చొరవ సకాలంలో వైద్య చికిత్సకు ప్రాప్యతను మెరుగుపరుస్తుంది. నగర ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలకు మద్దతు ఇస్తుంది. ప్రాణాలను రక్షించే పరిస్థితులలో కీలక మైన అత్యవసర ప్రతిస్పందనలో జాప్యాలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఈ చొరవ గురించి గ్రీన్‌సెల్ మొబిలిటీ ఎండీ, సీఈఓ శ్రీ దేవేంద్ర చావ్లా మాట్లాడుతూ, "గ్రీన్‌సెల్‌లో, మా బాధ్యత సుస్థిర రవాణాను అందించడం కంటే ఎక్కువగా ఉందని మేం విశ్వసిస్తున్నాం; ఇది మేం పని చేస్తున్న సమాజం శ్రేయస్సుకు విస్తరిస్తుంది. వైద్య అత్యవసర పరిస్థితిలో, ప్రతి క్షణం ముఖ్యమైంది. సకాలంలో రవా ణా అందుబాటులో ఉ ండటం ప్రాణాలను కాపాడుతుంది. ఈ చొరవ ద్వారా, అత్యవసర వైద్య సదుపాయాన్ని బలోపేతం చేయడంలో, రోగి సంరక్షణను మెరుగుపరచడంలో హైదరాబాద్‌లోని ప్రముఖ ఆరోగ్య సంరక్షణ సంస్థలకు మద్దతు ఇవ్వడం మాకు గర్వకారణం" అని అన్నారు. ఆయా ఆసుపత్రుల అధికారులు ఈ చొరవకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అంబులెన్స్‌లు వారి అత్యవసర స్పందన సామర్థ్యాలను గణనీయంగా బలోపేతం చేస్తాయని, రోగులకు సకాలంలో వైద్య సంరక్షణను పొందే




అవకాశాన్ని మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. గ్రీన్‌సెల్ మొబిలిటీ సీఎస్ఆర్ తాత్వికత సమాజానికి తిరిగి ఇవ్వడం పట్ల సంస్థ నిబద్ధతను నొక్కి చెబుతుంది. ఆర్థిక వృద్ధిని పర్యావరణ బాధ్యత, సామాజిక నిర్వహణతో కలపడం అనేది స్థితిస్థాపక సమాజం, దీర్ఘకాలిక విలువను నిర్మించడంలో సహాయపడుతుందని కంపెనీ విశ్వసిస్తుంది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా, గ్రీన్‌సెల్ మొబిలిటీ అవసరమైన సామాజిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, సమాజానికి కీలకమైన సేవలను పొందే అవకాశాన్ని మెరుగుపరచడానికి దోహదపడుతూనే ఉంది.

# చాకిరేవు

మంగళవారం, మార్చి 24, 2026


## అన్ని వివక్షలనూ తొలగించేలా వుండాలి

ఉన్నత విద్యా సంస్థల్లో వివక్షను అరికట్టేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యు.జి.సి) జనవరి 13న 'ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ ప్రోత్సాహక నియమావళి-2026? (హెచ్.ఇ.ఐ.ఎస్) మార్గదర్శకాలు విడుదల చేసింది. దీని ప్రధాన ఉద్దేశం మతం, జాతి, లింగం, జన్మస్థలం, వైకల్యం ఆధారంగా వివక్ష లేకుండా చూడటం. ముఖ్యంగా ఆర్థిక, సామాజిక బలహీన వర్గాల పట్ల వివక్షను, కుల ఆధారిత వివక్షను నిలువరించడం దీని లక్ష్యం. వివక్షకు వ్యతిరేకంగా సుదీర్ఘ కాలం జరిగిన పోరాటాలవల్ల ఈ మార్గదర్శకాలు వెలువడ్డాయి. అంతేగాని, ఇవేవీ బహుమతిగా వచ్చి పడినవి కాదు. ఈ మార్గదర్శకాలు పెద్ద చర్చకే దారితీశాయి. ఉన్నత వర్గాలవారు తీవ్రంగా నష్టపోతారని కొందరు?' ఇప్పటికే 2012 మార్గదర్శకాల ద్వారా ఎస్‌సి, ఎస్‌టి సెల్స్ ఉన్నాయి. మరి ఈ నూతన నిబంధనలు ఎందుకని?' మరికొందరు వాదిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ సిటీ మేజిస్ట్రేట్ అధికారి అలంకార్ అగ్నిహోత్రి ఏకంగా తన పదవికే రాజీనామా చేశారు. పలు సవరణలు చేయాలని కొందరు కోరుతున్నారు. అసలు ఈ మార్గదర్శకాలు ఏం చెబుతున్నాయి? నిజంగా వీటి ద్వారా విద్యాసంస్థల్లో వివక్షను పోగొట్టగలమా? వీటి అమలు ఎలా ఉండబోతోంది? మరోవైపు సుప్రీంకోర్టులో ప్రజావ్యాజ్యం దాఖలైంది. వాదనలు విన్న కోర్టు స్టే విధించింది. దీనితో నూతన మార్గదర్శకాలలో ఎటువంటి మార్పులు జరుగుతాయనేది పెద్ద ప్రశ్నగానే మారిందిి. దేశంలో వివక్ష ఈ నాటిది కాదు. కులం పేరుతో, జాతి పేరుతో, లింగం పేరుతో వందల ఏళ్ళగా వివక్ష కొనసాగుతున్నది. వివక్ష కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటే నమ్మగలమా? కానీ ఇది అక్షర సత్యం. పుట్టుకనే ఒక "ఘోర ప్రమాదం"గా అభివర్ణించి వారిని ఆత్మహత్య చేసుకునే విధంగా పురికొల్పుతున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో రోహిత్ వేములపై ఇటువంటి దారుణమే జరిగింది. ముంబై లోని బివైఎల్ నాయర్ హాస్పిటల్‌లో పి.జి వైద్య విద్యార్థిని పాయల్ తాడ్వి గిరిజన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అవడంతో తోటి డాక్టర్ల వేధింపులు భరించలేక బలవన్మరణానికి పాల్పడ్డారు. దర్శన్ సోలంకి కూడా బలవన్మరణానికి పాల్పడ్డారు. సోలంకి 2023 ఐఐటి బాంబేలో మొదటి సంవత్సరం బి.టెక్ విద్యార్థి. తన కులం తెలిసిన తర్వాత తోటి విద్యార్థుల ప్రవర్తనలో మార్పు వచ్చిందని, వివక్ష ఎదురవుతోందని కుటుంబ సభ్యులతో వాపోయిన కొద్దిరోజులకే ఆత్మహత్య చేసుకున్నారనే అంశాలకు కోర్టు విస్తుపోయింది. నూతన ఆలోచనలకు కేంద్రాలుగా ఉండాల్సిన విద్యాసంస్థలు కుల వివక్ష కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం చేదు నిజం. ఇలాంటి కేసులపై కోర్టులు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా యుజిసి మార్గదర్శకాలు తయారు చేసింది. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2014 నుండి 2021 మధ్య కాలంలో ఐఐటిలు, ఐఐఎంలు వంటి ఉన్నత విద్యాసంస్థల్లో 122 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా, వారిలో ఎస్సీ, ఎస్టీ, ఒబిసి సామాజిక వర్గాలకు చెందినవారే ఉన్నారు. యుజిసి గణాంకాల ప్రకారం ఈ దశాబ్ద కాలంలో కుల వివక్ష ఫిర్యాదులు 118 శాతం పెరిగాయి.

విద్యార్థుల నమోదులో 14 శాతం ఎస్‌సి వర్గాల విద్యార్థులు ఉంటే, అధ్యాపక వృత్తి వచ్చేసరికి కేవలం 6 శాతానికి పడిపోతోందని అఖిల భారత ఉన్నత విద్యా సర్వే-2025 (ఎ.ఐ.ఎస్.హెచ్.ఇ) గణాంకాలు చెబుతున్నాయి. 2012 మార్గదర్శకాల ప్రకారం ఇప్పటికే అనేక కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ఎస్‌సి, ఎస్‌టి సెల్స్, యాంటీ ర్యాగింగ్ కమిటీలు, అంతర్గత ఫిర్యాదుల కమిటీలు, గ్రీవెన్స్ పోర్టళ్లు ఉన్నాయి. అయినప్పటికీ ఇన్ని వందల మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే వాటి అమలు అసంబద్ధంగా ఉండమే ఇందుకు ప్రధాన కారణం.

యూనివర్సిటీలు, కాలేజీల్లో వెనుకబడిన వర్గాల విద్యార్థులకు అండగా ఉండటమే ఈ నిబంధనల ప్రధాన ఉద్దేశమని ఇప్పటికే యుజిసి స్పష్టం చేసింది. అయితే దీని ప్రకారం దేశంలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో 'ఈక్వల్ ఆపర్చునిటీ సెంటర్' (ఇ.ఒ.సి) ఏర్పాటు చేయడం తప్పనిసరి. వివక్షపై ఫిర్యాదులకు 24 గంటల హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి. విచారణ గడువు లోపల ముగించాలి. దోషులుగా తేలితే శిక్షలు కఠినంగా అమలు చేయాలి.

అవసరమైతే సంస్థలకు గుర్తింపు రద్దు చేయాలి. లేదా నిధులను ఆపేయాలి. దీనిలో ముఖ్యమైనది ఈ సెంటర్లలో ఎస్సీ, ఎస్టీ, ఒబిసి, మహిళలు, వికలాంగులకు ప్రాతినిధ్యం ఉంటుంది. 2012 నాటి నిబంధనల మాదిరిగా కాకుండా?నూతన నిబంధనలను ప్రజాస్వామ్యబద్ధంగా అమలు చేయాలి. ఐఐటి, ఐఐఎం, ఎయిమ్స్ లాంటి ఉన్నత విద్యాసంస్థల్లో అమలు జరిగేలా అవసరమైన మార్పులు చేయాలి.

ఈక్విటీ ఆపర్చునిటీ సెల్స్ విభాగాలు వర్శిటీల వైస్ ఛాన్సలర్ల అధీనంలో కాకుండా?నిష్పాక్షిక ప్రతినిధులతో ఉండాల్సిన అవసరం ఉంది. విశ్వవిద్యాలయ పరిపాలనతో సంబంధం లేని ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి ప్రతినిధులు మెజారిటీగా ఉండే ఒక స్వతంత్ర చట్టబద్ధమైన కమిటీ ఉండాలి. విద్యార్థి ప్రతినిధులను 'మెరిట్' ఆధారంగా నామినేట్ చేయకుండా ఎన్నికల ద్వారా ఎన్నుకోవాలి. దోషుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. దేశ్‌పాండే కమిటీ సిఫార్సు చేసినట్లుగా ఆరోపణను నిరూపించాల్సిన బాధ్యతను సంస్థలపైనే ఉంచాలి. యుజిసి సలహా కమిటీకి మించి స్వయంగా విచారణ చేపట్టే అధికారాలు సుమోటో కలిగిన జాతీయ పర్యవేక్షణ కమిషన్ ఉండాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళు గడుస్తున్నా కులం పేరుతో వివక్ష కొనసాగుతుండం దారుణం. సంఘ్? పరివార్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మనువాద సిద్ధాంతాలను రుద్దుతూ సమాజాన్ని కులాల వారీగా విభజిస్తోంది. అంతటి వివక్షను రూపుమాపేందుకు మొదటి అడుగు వేస్తూనే దుర్వినియోగం అవుతాయనే సాకు చెప్పి మార్గదర్శకాలు రద్దు చేయాలని అనేక ఆందోళనలు చేయడం సిగ్గుచేటు. దీనికి స్వయంగా బిజెపి నాయకులు నిరసనకారులకు మద్దతు తెలియజేయడం వారి అసలు ఉద్దేశాన్ని తెలుపుతున్నది.

## మహిళా వైద్యుల సవాళ్లు

1849లో అమెరికాలో వైద్య పట్టా పొందిన తొలి మహిళ 'డాక్టర్: ఎలిజబెత్ బ్లాక్‌వెల్' జన్మదినాన్ని పురస్కరించుకుని 2016 నుండి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 03న "జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం (నేషనల్ వూమెన్ ఫిజీషియన్స్ డే)" జరుపుకుంటున్నాం. పవిత్రమైన వైద్య వృత్తి నుండి మహిళలను దూరంగా ఉంచిన అడ్డంకులను ఈ చారిత్రాత్మక సంఘటన బద్దలు కొట్టింది. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవ వేదిక వైద్య రంగంలో మహిళల అంకితభావం, పోరాట పటిమ, కరుణ హృదయాలను హైలైట్ చేస్తుంది, అదే సమయంలో కార్యాలయాల్లో లింగ సమానత్వ సాధన, పౌర సమాజ మద్దతు అవసరాన్ని పరిష్కరించడానికి దోహదపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఆసుపత్రులు, క్లినిక్‌లు, వైద్య పరిశోధనా రంగాల్లో అద్భుతమైన నైపుణ్యాలు, సహానుభూతి, రోగుల సంరక్షణ, వృత్తి నిబద్ధత కలిగి తమ జీవితాలను వైద్య రంగానికి అంకితం చేసిన మహిళా వైద్యులు ఎందరో మన ముందు ఉన్నారు.

జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం సందర్భంగా మహిళా వైద్యుల నిస్వార్థ సేవలను గుర్తించడం మాత్రమే కాకుండా, లింగ వేతన అంతరాలు, నాయకత్వ బాధ్యతలతో సహా కొనసాగుతున్న పలు అసమానతలను పరిష్కరించడానికి పిలుపునిస్తున్నది. ప్రస్తుతం దాదాపు 35 శాతం మంది వైద్యులు మహిళలు ఉన్నప్పటికీ, వైద్యపరంగా మరింత మెరుగైన లింగ సమానత్వాన్ని కోరుతున్నారు. ఈ రోజు మహిళా వైద్యులు అభివృద్ధి చెందడానికి, ఆవిష్కరణలు చేయడానికి, అడ్డంకులు లేకుండా నడిపించడానికి సమగ్ర వాతావరణాన్ని కూడా కల్పించాల్సి ఉంటుంది.

మహిళా ఫిజీషియన్లు రోగులను నయం చేయడమే కాకుండా, రేపటి తరం మహిళా వైద్యులకు స్ఫూర్తినిస్తున్నారు. పౌర సమాజ జీవితాలను మెరుగుపరచడం, రోగులను జాగ్రత్తగా చూసుకోవడం, ఆధునిక వైద్యం యొక్క సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవడం లాంటి అంశాల్లో వారి నిబద్ధతను అభినందించాలి. దాదాపు మూడింట ఒక వంతు మహిళా వైద్యులందరూ కార్యాలయంలో లైంగిక వేధింపులు, ఎక్కువ మంది లింగ పక్షపాతాన్ని ఎదుర్కొంటున్నారు. భారతదేశంలో 19వ శతాబ్దం చివరలో పాశ్చాత్య ఆధునిక వైద్యాన్ని మొదటగా అభ్యసించిన డాక్టర్: ఆనందీబాయి జోషి (1886), డాక్టర్: కాదంబినీ గంగూలీ (1886) వంటి మహిళామణులు ఇతర మహిళా వైద్యులకు మార్గదర్శకులుగా ఎదిగారు. ప్రస్తుతం ఓఃబా విద్యార్థులలో దాదాపు 50 శాతం మంది మహిళలు ఉండడం లింగ అంతర నివారణకు గొప్ప సంకేతం. ఎక్కువ మంది మహిళా వైద్యులు ప్రసూతి (60 శాతం), గైనకాలజీ (60 శాతం), పీడియాట్రిక్స్ (58 శాతం), జనరల్ ప్రాక్టీస్ (57 శాతం), పబ్లిక్ హెల్త్ (55 శాతం) రంగాలను ఎంచుకుంటున్నారు, కానీ ఇప్పుడు వారు సూపర్ స్పెషాలిటీల ద్వారా అన్ని రంగాల్లోకి ప్రవేశిస్తున్నారు. సంఖ్య పెరుగుతున్నప్పటికీ, భారతదేశంలోని మొత్తం వైద్యుల్లో 14.2 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. జాతీయ ఆరోగ్య సంస్థలలో నాయకత్వ పాత్రలలో 28 శాతం మాత్రమే మహిళా వైద్యులు నిర్వహిస్తున్నారు. డాక్టర్: ఆనందీబాయి జోషి (మొదటి భారతీయ మహిళా వైద్యులు), డాక్టర్: కేతన్యున్ అర్దేశిర్ దిన్షా (మొదటి మహిళా రేడియోథెరపిస్ట్), డాక్టర్: ఇందిరా హిందూజా (మొదటి టెస్ట్ ట్యూబ్ బేబీని ప్రసవించారు), డాక్టర్: మంజుల అనగాని (లాపరోస్కోపిక్ సర్జన్), డాక్టర్: గగన్‌దీప్ కాంగ్ (రాయల్ సొసైటీ మొదటి మహిళా ఫెలో) వంటి మేటి మహిళా వైద్యులు భారతదేశ వైద్య రంగానికి చారిత్రాత్మక కృషి చేశారు.

## జీహెచ్‌ఎంసీ విస్తరణతో..
# రెవెన్యూ చట్టాలపై ప్రభావం




ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న 27 అర్బన్ లోకల్ బాడీస్‌ని ఓఆర్‌ఆర్‌కు ఇవతల, అవతల ఉన్న వాటిని జీహెచ్‌ఎంసీలో కలుపుతూ, అసెంబ్లీ, గవర్నర్ ఆమోదంతో బిల్లు చట్టంగా మారింది. ఇందులో అత్యధిక విలువ గల భూములున్న 7 మున్సిపల్ కార్పొరేషన్స్ అయిన బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట్, బోడుప్పల్, పీర్జాదీగూడ, జవహర్‌నగర్, నిజాంపేట్.. 20 మున్సిపాలిటీలు అయిన ఆదిబట్ల, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయాంజాల్, మణికొండ, నార్సింగి, పెద్ద అంబర్ పేట్, తుక్కుగూడ, మేడ్చేల్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్ల పోచంపల్లి, తూకుంట, కొంపల్లి, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్‌లు ఉన్నాయి. వ్యవసాయ భూములను, వ్యవసాయేతర పనులకు వినియోగించాలంటే దానికి కన్వర్షన్ ట్యాక్స్ కట్టాలి.. గతంలో అయితే నాలా చట్టం 1963, భూమి వినియోగాన్ని బట్టి అంటే, రెసిడెన్షియల్, ఇండస్ట్రీస్, కమర్షియల్ ట్యాక్స్ ప్రతీ సంవత్సరం వసూల్ చేసేవారు.. దానికి బదులుగా వన్ టైం ట్యాక్స్‌గా నాలా చట్టం-2006 రూపొందించడం, దాని ప్రకారం, వ్యవసాయ భూములను ఇతర వ్యవసాయేతరానికి వినియోగించాలంటే దానిని కన్వర్షన్ చేసుకోవడం తప్పనిసరి. దానికి చట్టం వచ్చిన మొదట్లో బేసిక్ వ్యాల్యూకు 9 శాతం కన్వర్షన్ ట్యాక్స్ వసూల్ చేసేవారు.. అందుకు చట్ట ప్రకారం సంబంధిత రెవెన్యూ డివిజినల్ అధికారికి కన్వర్షన్ ఉత్తర్వులు జారీ చేసేవారు. తర్వాత 9 శాతం నుండి 3 శాతానికి కుదించడం జరిగింది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత జీవో నెం 147 తేదీ: 16/12/2020 నాడు చట్టంలో సెక్షన్ 4(1)కు కన్వర్షన్ ట్యాక్స్‌కు అమెండ్‌మెంట్ చేశారు.. దాని ప్రకారం, ఒకవేళ వ్యవసాయ భూములు జీహెచ్‌ఎంసీ పరిధిని దాటి ఉన్న భూములకు బేసిక్ వ్యాల్యూలో 3 శాతం ట్యాక్స్‌ని ఫిక్స్ చేయడం, మళ్లీ గత సంవత్సరం ఆగస్ట్ 2025లో పై ట్యాక్స్‌ని జీహెచ్‌ఎంసీ పరిధిలోని వాటికి 3 శాతం గాను, జీహెచ్‌ఎంసీ పరిధిని దాటి ఉన్న వాటికి 5-6 శాతం బేసిక్ వ్యాల్యూ ట్యాక్స్‌గా నిర్ణయించడం, అలాగే యాక్ట్ 19/2021 ద్వారా కన్వర్షన్ ఉత్తర్వులు జారీ చేసే అధికారం ఆర్‌డీఓల నుండి తాహసీల్దార్‌లకు బదలాయించడం ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా తాహసీల్దార్‌లు నిర్ణయించిన ఫీజుల ప్రకారం కన్వర్షన్ ప్రోగ్రెస్‌ను జారీ చేస్తున్నారు. అయితే ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ పరిధిని విస్తరించడం ద్వారా ఎంతో విలువైన, రియల్ ఎస్టేట్ బూమ్ కలిగిన 27 జబః (అర్బన్ లోకల్ బాడీ)ల వ్యవసాయ భూములను కన్వర్షన్ చేయాలంటే దాని ట్యాక్స్‌ని 5 శాతం నుండి 3 శాతంకు తగ్గించడం ద్వారా రాష్ట్ర ఖజానాపై ప్రభావం పడుతుంది. అంతేగాక ప్రస్తుతం ధరణి తర్వాత భూ భారతి చట్ట ప్రకారం జాయింట్ రిజిస్ట్రార్ లాగా తాహసీల్దార్‌లు ఉన్నారు. రిజిస్ట్రేషన్ చట్టం-1908 ప్రకారం, డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చెయ్యడంలో చట్ట ప్రకారం వసూలు చేయాల్సిన స్టాంప్ డ్యూటీలో పోర్టల్ అవకతవకలు జరిపే రాష్ట్ర ఖజానాకు కొన్ని వందల కోట్ల రూపాయలకు గండి కొట్టారని ఆరోపణలు వచ్చాయి.. దానిపై విచారణ జరుపుతారన్న సమయంలో ప్రస్తుతం తాహసీల్దార్‌లు అగ్రికల్చర్ నుండి నాన్ అగ్రికల్చర్ కన్వర్షన్‌తో కూడా సరైన ట్యాక్స్ వసూల్ చేశారా లేదా? అన్నది కూడా ఆడిట్ చేయవలసి ఉన్నది. ఎందుకంటే గత జీహెచ్‌ఎంసీ పరిధిలో వ్యవసాయ భూముల విస్తీర్ణం తక్కువ ప్రస్తుతం విలీనం అయిన 27 అర్బన్ లోకల్ బాడీలలో వ్యవసాయ భూముల విస్తీర్ణం ఎక్కువ కాకుండా అధిక ధరలు గల్లి ఉండి, రియల్ ఎస్టేట్ అనేది ప్రాంతాలలో ఎక్కువ ఉండటం, ఒక దిక్కు ట్యాక్స్ గతం తక్కువ కావడం దానిపై సరైన ఆడిట్ లేకపోవడం, తహసీల్దార్‌లు కూడా అసలు చట్ట ప్రకారం ట్యాక్స్ కట్టారా? లేదా అన్నది ఎంక్వైరీ చెయ్యకపోవడం లాంటి సంఘటనల వలన వాటిపై కూడా రాష్ట్ర ప్రభుత్వం తగు దృష్టి పెట్టవలసి ఉన్నది. ఇకపోతే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం సెక్షన్-3 (7) ప్రకారం నోటిఫైడ్ అయిన అర్బన్ ఏరియాతో వ్యవసాయేతర భూములకు 'భూ భారతి' చట్టం వర్తించదని స్పష్టంగా చెప్పింది.

# దేశ రక్షణ పరిశోధనలో ఆద్యుడు

సూరి భగవంతం (అక్టోబరు 14, 1909 - ఫిబ్రవరి 6, 1989) (వయసు 79) ప్రముఖ శాస్త్రవేత్త. దేశ రక్షణకు సంబంధించిన పరిశోధనల్లో ఆద్యుడు. ఆయన కృష్ణా జిల్లా ఆగిరిపల్లి గ్రామంలో అక్టోబరు 14, 1909 న జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం అనంతరం హైదరాబాదు నిజాం కళాశాలలో డిగ్రీ (బి.ఎస్సీ) చదువు పూర్తిచేసి, మద్రాసు యూనివర్సిటీ నుండి బి.ఎస్.సి (భౌతిక శాస్త్రము) డిగ్రీని ప్రథమ శ్రేణిలో ప్రథముడుగా అందు కున్నారు. ఈ సందర్భంగా అనేక పతకాలను అందుకున్న విద్యార్థిగా కలకత్తాలో సర్ సి.వి.రామన్ దగ్గర రీసెర్చ్ స్కాలర్ గా చేరారు. ఆయన తన మేథో సంపత్తితో, శాస్త్రీయ దృక్పథంతో, ఆలోచనా సరళితో, ప్రయోగ శీలతతో సి.వి.రామన్ అభిమానాన్ని చూరగొని ప్రియ శిష్యుడయ్యారు. అక్కడే మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఎం.ఎస్సీ. పట్టాను సంపాదించారు.ఆయన 1932లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో అధ్యాపకుడుగా చేరారు. 1938లో ప్రొఫెసర్ గా పదోన్నతి పొందారు.

బోధనా విధానంలో వీరిది చాలా సులభ శైలి. స్పష్టమైన వ్యక్తీకరణ, విశేషమైన ఆలోచన, కచ్చితమైన అనువర్తన, సమగ్రమైన దృష్టి, అద్భుతమైన ప్రతిభ లన్నీ కలగలిపి అయన బోధనా విధానాన్ని ఇతర శాఖల అధ్యాపకులు కూడా నేర్చుకునే వారని చెబుతారు. తన 28 వ యేటనే యింతటి ఉన్నత పదవిని అదిష్టించటం విశేషం. దీనికి కొద్ది కాలం ముందే యూనివర్సిటీ ఆయనకు డి.ఎన్‌సి డిగ్రీ ప్రదానం చేసింది. ఈయన 1948 వరకు ఈ పదవిలోనే ఉన్నారు. భగవంతం 1941లో కళాశాల ప్రిన్సిపాల్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో తన పరిపాలనా కౌశలం చూపి కళాశాలను విజయ వంతంగా నడిపారు. 1948-49 మధ్య లండన్ లోని భారత రాయబారి వి.కె. కృష్ణ మీనన్ కార్యాలయంలో వైజ్ఞానిక సలహాదారుగా పని చేశారు. చాలా ఐరోపా దేశాల్లో పర్యటించి వివిధ విజ్ఞాన విషయాల మీద ప్రసంగాలు చేశారు. 1949లో స్వదేశం తిరిగి వచ్చి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో భౌతిక శాఖాధిపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.పరిశోధన వైపు దృష్టి కేంద్రికరించి 12 మంది డాక్టరేట్ లను తయారు చేశారు. తరువాత 1952లో విశ్వవిద్యాలయ ఉప కులపతిగా పదవిని చేపట్టారు. 1957లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఓ) సారథిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రొఫెసర్ సూరి భగవంతం బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్‌గా ఉన్నారు. అక్కడ పని చేస్తుండగా కృష్ణ మీనన్ ఒత్తిడి మీద 1961లో రక్షణ శాఖ పరిశోధనా సంస్థకు అధిపతిగాను, తనకు వైజ్ఞానిక సలహాదారుగా చేరారు. ఆ సమయంలో ప్రొఫెసర్ భగవంతం రక్షణ అవసరాలను తీర్చడానికి అనువర్తిత పరిశోధన, అభివృద్ధి దిశలో డీఆర్డీఓ ను నైపుణ్యంగా నడిపించారు. సుమారు ఎనిమిది సంవత్సరాలు డిఆర్‌డిఓ హెడ్‌గా పనిచేశారు. అక్టోబర్ 1969 లో తన పదవి నుండి పదవీ విరమణ చేసే సమయానికి, సంస్థ అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. 1962 చైనా-భారత్ యుద్ధం తర్వాత వై. బి. చవాన్ రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఒ.) అధిపతిగా చేరి ఎంతో ప్రగతి సాధించారు.

భారత దేశమంతా ఇరవైకి పైగా ప్రయోగ శాలలను ప్రారంభించి యుద్ధ రంగానికి అవసరమైన క్షిపణులు, విమానాలు, ట్యాంకులు, రాడార్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మొదలైన అనేక విషయాలలో విజయం సాధించారు. 1969లో పదవీ విరమణ చేశారు. ఆయన 300 పైగా పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. ఇవి కాక గ్రూపు థియరీ, రామన్ ఎఫెక్ట్, క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్ అనే మూడు గ్రంథాలు రచించారు. 1961 జూలైలో కేంద్ర ప్రభుత్వ సర్వీస్ లో ప్రవేశించిన ప్రొఫెసర్ భగవంతం రక్షణ మంత్రికి సైంటిఫిక్ అడ్వయిజర్ గా నియమితు లైనప్పటికీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఓ) కు డైరక్టర్ జనరల్ గా కూడా వ్యవహరించారు. భూతలం మీద, సముద్ర జలాల మీద, గాలిలో దేశ పోరాట శక్తులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బలోపేతం చేయటానికి డి.ఆర్.డి.ఓని ఒక సమర్థవంతమైన పనిముట్టుగా రూపొందించారు. శక్తివంతమైన అయుధంగా మలిచారు. ఆర్.డి.ఓను పటిష్ఠ పరచడంలో ఈయన చేసిన కృషి అసమానం. ఆర్గనైజేషన్ బ్రహ్మాండమైన ఎదుగుదలను సాధించింది. అనేకానేక ల్యాబరేటరిలను, సుశిక్షితులను రూపొందించారు. రక్షణ శాఖ పరిశోధనలలో అనేక మంది శాస్త్రవేత్తలకు ప్రవేశం కల్పించి, వారి మేధస్సుకు పదును పెట్టారు. డి.ఆర్.డి.ఓకు నేతృత్వం వహించిన 9 సంవత్సరాల వ్యవధిలో మిస్సైల్స్, ఎయిర్ క్రాఫ్ట్స్, ఏరో ఇంజన్స్, కొంబాట్ వెహికల్స్ (ట్యాంకులు మొదలైనవి) ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ సిస్టమ్స్, హై ఎక్స్‌ప్లోజివ్స్, అండర్ వాటర్ వెపన్స్ మొదలగు వాటిని అభివృద్ధి చేయటానికి ల్యాబరేటరీలను స్థాపించారు. ఆధునిక యుద్ధ తంత్ర సాంకేతిక నైపుణ్య రంగంలో ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇప్పించారు. వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించారు. దేశ రక్షణ శాఖకు అద్వితీయమైన సేవలు అందిస్తూనే మరోపక్క అవాంఛనీయ పోకడలను గమనిస్తూనే ఉన్నారు. ఒకసారి నోబెల్ బహుమతి గ్రహీత, భారత మిత్రుడు ప్రొఫెసర్ పి.ఎం.ఎస్.బ్లాకెట్ ప్రధాని నెహ్రూకు ఒక సలహా యిచ్చారు. దేశ రక్షణ శాఖ అభివృద్ధి చెందడానికి దేశీయ ఉత్పత్తుల రూపకల్పనను మినహాయించి ప్రత్యామ్నాయంగా దిగుమతులు చేసుకోవలసినదని, రాడార్స్, మిస్సైల్స్, యుద్ధ ట్యాంకుల కోసం దిగుమతుల మీద ఆధారపడటం ఉత్తమమని సలహా యిచ్చారు. ఈ సలహాను పూర్తిగా నిర్లక్ష్య పరిచేలా చేసిన ప్రొఫెసర్ భగవంతం మన దేశం సర్వదా కృతజ్ఞతగా ఉండాలి. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు శాస్త్ర సలహాదారునిగా విశేష కృషి చేసి, జాతీయ భావాలకు పరిపుష్టి కల్పించి అఖండ పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. భౌతిక శాస్త్ర రంగంలో మూడు ప్రామాణిక గ్రంథాలను, అనేక పరిశోధనా పత్రాలను వెలువరించారు. రామన్ ఎఫెక్ట్ అంశం మీద వివిధ కోణాలలో అధ్యయనం చేశారు. పునః పరిశోధనలు జరిపారు. "మాలిక్యులర్ లాటిస్ వైబ్రేషన్" అంశం మీద గ్రూప్ థియరిటికల్ అప్లికేషన్స్, వాయువుల గూర్చి రామన్ ఎఫెక్ట్ కు సంబంధించిన పరిశోధనలు మీద సునిశిత కృషి జరిపారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ లలో ఫెలోషిప్ మీద పరిశోధనలు నిర్వహించారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోషియేషన్ వారి భౌతిక శాస్త్ర విభాగానికి అధ్యక్షులుగా (1946) వ్యవహరించారు. "1961 లో క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్" అనే బృహత్తర గ్రంథ రచన చేసి అంతర్జాతీయ ఖ్యాతిని పొందారు. కమిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ద డెవలపింగ్ కంట్రీస్ అధ్యక్షులుగా సి.వి.రామన్ పరిశోధించిన రామన్ ఎఫెక్టు అంశం మీద ప్రామాణిక పరిశోధనలు చేసిన అద్వితీయ శాస్త్రవేత్తగా కీర్తి గడించారు. రామన్ ఎఫెక్ట్, క్రిష్టల్ స్ట్రక్చర్ మొదలగు అంశాల మీద అవిశ్రాంత పరిశోధనలు జరిపి గ్రంథ రచనలు చేశారు. ఆయన 300 పైగా పరిశోధనా పత్రాలను వెలువరించారు. గ్రూప్ థీరీ, రామన్ ఎఫెక్టు అనే రెండు ఉత్తమ గ్రంథాలను కూడా చేశారు. ఇవి ప్రామాణిక గ్రంథాలుగా అంతర్జాతీయ ఖ్యాతిని పొంది, అనేక భాషలలోకి అనువదించటం జరిగింది. జాతీయ అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక సైంటిఫిక్, ప్రొఫెషనల్ సంస్థలు అనేకంలో ఆయన ఎలెక్టెడ్ ఫెలోగా ఉన్నారు. పలు యూనివర్సిటీలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. సి.వి.రామన్ అనుంగు శిష్యునిగా, దేశ రక్షణ శాఖను బలోపేతం చేసిన దేశభక్తునిగా పేరొందిన ప్రొఫెసర్ భగవంతం తన 80 వ యేట 1989, ఫిబ్రవరి 6 వ తేదీన మరణించారు.

వైయస్ఆర్ కాంగ్రెస్

## ఒక్కొక్కరూ దూరమవుతున్నారా?

ఒంగోలు, : కందుకూరు మాజీ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి వ్యవహారం వైసీపీలో హాట్ టాపిక్ గా మారింది. అసలు ఆయన పార్టీలో ఉన్నారా? లేదా? అన్న అనుమానం వైసీపీ నేతల్లో కలుగుతుంది. వైసీపీలో మాత్రం యాక్టివ్ గా లేరని మాత్రం ఖచ్చితంగా చెప్పాలి. ఒక రకంగా చూస్తే మానుగుంట మహీధర్ రెడ్డి రాజకీయాల నుంచి వైదొలగారా? లేక ఇతర పార్టీల వైపు చూస్తున్నారా? అన్న అనుమానం ఆ పార్టీ నేతలకు కూడా కలుగుతుంది. మానుగుంట మహీధర్ రెడ్డి కుటుంబానికి మంచి పట్టున్న నియోజకవర్గంలో వైసీపీ కార్యక్రమాలు సక్రమంగా జరగకపోవడం పై కూడా పార్టీ నాయకత్వానికి ఫిర్యాదులు అందినట్లు చెబుతున్నారు. అదే సమయంలో గత ఎన్నికల్లో మానుగుంట మహీధర్ రెడ్డికి టిక్కెట్ కూడా దక్కలేదు ప్రస్తుతం నెల్లూరు జిల్లా ఒకప్పుడు ప్రకాశం జిల్లాలో ఉన్న నియోజకవర్గం కందుకూరు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత 1983 నుంచి చూస్తే ఈ నియోకవర్గంలో టీడీపీ అంత సానుకూల పరిస్థితులు లేవు. 1983 నుంచి 2024 వరకు జరిగిన ఎనిమిది ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ 1994, 1999, 2024 ఎన్నికల్లో మాత్రమే విజయం సాధించింది. కందుకూరు నియోజకవర్గం మానుగుంట ఫ్యామిలీకి కంచుకోటే అని చెప్పాలి. మానుగుంట ఫ్యామిలీకి చెందిన మానుగుంట మహీధర్ రెడ్డి, ఆయన తండ్రి ఆదినారాయణ రెడ్డి ఇక్కడ నుంచి చెరో మూడు సార్లు మొత్తంగా ఆరు సార్లు విజయం సాధించారు. మానుగుంట మహీధర్ రెడ్డి తండ్రి మానుగుంట ఆదినారాయణ రెడ్డి 1972లో ఇండీపెండెంట్‌గా విజయం సాధించారు. 1983, 1985లో రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం ప్రభంజనం వీచినా కందుకూరులో మాత్రం ఆదినారాయణ రెడ్డి విజయం సాధించారు. గత ఎన్నికల్లో టిక్కెట్ దక్కకపోవడంతో... అయితే గత ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ కందుకూరు టిక్కెట్ ను మానుగుంట మహీధర్ రెడ్డికి కాదని బుర్రా మధుసూదన్‌యాదవ్‌కు ఇచ్చారు. ఆయననుకనిగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే గా ఉండగా అక్కడి నుంచి మార్చి కందుకూరు టిక్కెట్ ఇచ్చారు. దీంతో అప్పటి నుంచి మానుగుంట మహీధర్ రెడ్డి పార్టీ కార్యక్రమా లకు దూరంగా ఉంటున్నారు. ఎక్కువగా ఆధ్మాత్మిక కార్యక్రమాలకు పరిమితమవుతున్నారు. ఇటీవల తిరిగి జగన్ మానుగుంట మహీధర్ రెడ్డితో మాట్లాడేందుకు ప్రయత్నించినా సున్నితంగా తిరస్కరించారం టున్నారు. ఇటీవల జరిగిన కందుకూరు నియోజకవర్గంలో జరిగిన హత్య విషయంలోనూ మానుగుంట మహీధర్ రెడ్డి కనిపించకపోవడం కూడా ఈ ఊహాగానాలకు మరింత ప్రచారాన్ని పెంచింది. మొత్తం మీద ఒక కీలక నేత, పట్టున్న నేత మానుగుంట మహీధర్ రెడ్డి రాజకీయాల్లో ఉంటారా? లేదా? అన్న దానిపై స్పష్టత లేదు.

## అనర్థదాయకం..!

సామాన్యులకు ఎంతోకొంత ఊరటగానున్న ఆరోగ్యశ్రీ పథక సేవలను, రాష్ట్రంలో 10 కొత్త వైద్య కళాశాలలను పిపిపి పేరిట ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడం అనర్థదాయకం. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాలను కలిపి హైబ్రిడ్ మోడ్‌లో యూనివర్సల్ హెల్త్ పాలసీని రూపొందించాలని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో అది జనాన్ని వైద్య ఆరోగ్య సేవలకు దూరం చేయడమే అవుతుంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు బీమా కంపెనీ ద్వారా కుటుంబానికి ఏడాదికి రూ. 2.5 లక్షల వరకు, ఆపైన ఖర్చయితే ట్రస్టు ద్వారా రూ. 25 లక్షల వరకు కవరేజ్ ఉంటుందన్నది ప్రచారానికి బాగానేవుం టుంది. దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న కుటుంబాలకు ఏడాదికి రూ. 2 నుంచి 5లక్షల వరకు బీమా కవరేజ్‌ను అందిస్తామనీ ఇదంతా కలిపి యూనివర్సల్ హెల్త్ కవరేజి అని సర్కారు నమ్మబలుకుతోంది. రాష్ట్ర విభజన అనంతరం 2015–16ల్లో ఎపిఎల్ కుటుంబాలకూ హెల్త్ కవరేజి అని ప్రచారం చేసి ప్రీమియంలు కట్టించుకున్నారేకానీ ప్రజలకు లబ్ధి చేకూరిన దాఖలాల్లేవు. తాజా పథకం ద్వారా 3257 రకాల వైద్య సేవలు అందజేస్తారని, ప్రతి రోగికి ఒక క్యూఆర్ కోడ్ ఇచ్చి అమలు తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్న అమాత్యుల మాట నీటిమీద రాతగానే మిగిలిపోవచ్చు. రాష్ట్రంలో 10 కొత్త వైద్య కళాశాలలను పిపిపి పేరిట ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని నిర్ణయించగా తొలి దశలో ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పులివెందుల కళాశాలలో అమలు చేయనున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే వైద్య కళాశాలలు నైపుణ్యానికి, నాణ్యతకు, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తాయి. ప్రైవేటు యాజమాన్యాలు మెరిట్ పక్కనబెట్టి సంపన్నులకే సీట్లు ఇస్తాయి కనుక పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్యవిద్యకు దూరం అవుతారు. వ్యాపార దక్పథం ముందుకు వచ్చి పేదలకు వైద్యం అందుబాటులో లేకుండా పోతుంది. వైద్య ఆరోగ్య రంగం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండడం సరైనదని అనేక దేశాల్లో నిరూపితమైంది. యుకె, నెదర్‌ల్యాండ్స్ ఇంకొన్ని స్కాండినేవియన్ దేశాల్లో ఆదర్శవంతమైన ఆరోగ్య వ్యవస్థ నడుస్తోంది. ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే! ప్రభుత్వ వైద్యం బలపడి ఉచితంగా అందిస్తేనే అది సాధ్యమవుతుంది. ప్రైవేట్ ఇన్సూరెన్సు కంపెనీలు వ్యాపారం చేస్తాయే కానీ సేవ చేయవు. అనర్థదాయకమైన ఈ నిర్ణయాలను ఉపసంహరించుకొని ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ఆరోగ్య సేవలను కొనసాగించాలి. సెల్ఫ్‌ఫైనాన్స్ పేరుతో మెడికల్ కాలేజీల్లో ఉన్న రిజర్వేషన్ సీట్లలో సగం సీట్లను లక్షలకు అమ్ముకునే జిఓ 107, 108ని రద్దు చేయాలి. ఇదిలావుండగా రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో రాజ్యాంగాన్ని, సుప్రీం కోర్టు తీర్పులను సైతం ఉల్లంఘించి ప్రైవేటు పంప్డ్ స్టోరేజి హైడ్రో ప్రాజెక్టుకు అనుమతులిచ్చిన ప్రభుత్వం గురువారంనాటి క్యాబినెట్ సమావేశంలో వాటి సామర్థ్యం పెంచడం, నీటి కేటాయింపులను కూడా చేయడం దారుణం. జలవనరుల శాఖ మార్గదర్శకాలు, లభ్యతకు అనుగుణంగా కేటాయింపులకు ఆమోదం తెలిపామని చెబుతున్నా ఆచరణలో నదుల్లోని నీటిని విద్యుత్ ప్రాజెక్టులే పొందుతాయి కనుక దిగువనున్న ఆయకట్టు రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. కడప జిల్లా కొండాపురం మండలంలో చింత గ్రీన్ ఎనర్జీ కొప్పోలు పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుకు ఏకంగా గండికోట రిజర్వాయర్‌ను లోయర్ రిజర్వాయర్‌గా ఉపయోగిం చడానికి ఆమోదం తెలపడం ప్రమాదకరం. గత వైసిపి ప్రభుత్వ పెద్దలు లంచాలు బొక్కి ఒప్పందాలు చేశారని అమెరికాలో కేసులు వచ్చిన సెకి చేసిన సత్యసాయి జిల్లా ముత్తుకుంట గ్రామంలో రూ. 800 కోట్ల ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలపడం ద్వారా ఇప్పుడు కూడా గత పాలకుల విధానాలే కొనసాగు తున్నాయని చెప్పడమే అవుతుంది.

# పీడీఎస్ బియ్యం కనిపెట్టేలా మొబైల్ టెస్టింగ్ కిట్స్




కాకినాడ, : పీడీఎస్ బియ్యం మాఫియా అనగానే కాకినాడ పేరు ఠక్కున గుర్తుకు వస్తుంది.. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై అంతటిస్థాయి వివాదం కాకినాడ చుట్టూ ముసురుకుంది.. రాష్ట్రవ్యాప్తంగా అక్రమ పద్దతిలో సేకరించిన పేదల బియ్యాన్ని చివరకు కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు తరలించి అక్రమ సొమ్మును ఆర్జిస్తున్నారన్న ఆరోపణలపై ఎన్నికలకు ముందు నుంచి పెద్ద దుమారమే రేగింది.. ఈనేపథ్యంలోనే ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పీడీఎస్ బియ్యం మాఫియా అంతుచూస్తామని కూడా వాగ్దానాలు చేశారు... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెంటనే ఆదిశగా చర్యలు ప్రారంభించారు.. కూటమి ప్రభుత్వం వచ్చాక డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కళ్యాణ్ కాకినాడ పర్యటకు వచ్చి నేరుగా పోర్టుకు వెళ్లారు.. అక్కడ అక్రమంగా ఎగుమతి అవుతున్న పీడీఎస్ బియ్యం ను టన్నుల కొద్దీ గుర్తించి సీజ్ చేయించారు.. ఆతరువాత ఏపీ సివిల్ సప్లై మినిస్టర్ నాదెండ్ల మనోహర్ కూడా మరో రెండు సార్లు కాకినాడ పోర్టులో విస్తృతంగా తనిఖీలుచేసి టన్నుల కొద్దీ పీడీఎస్ బియ్యం సీజ్ చేయించారు.. కానీ చాలా వరకు అవి పీడీఎస్ బియ్యం అని నిరూపించలేని పరస్థితి తెలెత్తింది.. ఇదిలా ఉంటే కాకినాడ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెక్ పోస్టులకు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా ను అడ్డుకునేందుకు ప్రత్యేక విధివిధానాలు రూపొందించినప్పటికీ అవికూడా అనుకున్న స్థాయిలో ఫలితాలు ఇవ్వలేకపోయాయి..

కానీ యధారాజా తథా ప్రజా అన్న చందంగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా అనే నియంత్రణ కాలేని పరిస్థితి కనిపిస్తోంది..గత ప్రభుత్వం హయాంలో విచ్చలవిడిగా జరిగిన రేషన్ బియ్యం అక్రమ రవాణా కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా నియంత్రణ కాలేని పరిస్తితి కనిపిస్తోంది.. రేషన్ మాఫియాలో చాలా మంది పెద్దల హస్తం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి.. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో రేషన్ మాఫియా రెచ్చిపోతుందని, దీనికి అడ్డుకట్ట వేయాలంటే చాలా ఇబ్బందులు తప్పడం లేదని అధికారులు సైతం చేతులెత్తేసిన పరిస్తితి కనిపించింది.. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి రేషన్ మాఫియాని కట్టడి చేసేందుకు మంచి ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకున్నట్లయ్యింది.. రేషన్ బియ్యం పట్టుకున్నా, అవి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం అని అనుమానాలున్నా పీడీఎస్ బియ్యం అని రూఢీ చేయడానికి టెస్ట్ చేయడానికి ల్యాబ్ కి పంపి వారం రోజులు వెయిట్ చేయాల్సి వచ్చేది. తాజాగా ప్రభుత్వం ఒక మొబైల్ కిట్‌ను రూపకల్పన చేయించి పంపిణీకు సిద్ధం చేసింది. మొబైల్ కిట్ లో ఉండే కెమికల్ బాటిల్స్ రేషన్ బియ్యం లో వేసినప్పుడు పోషక విలువల కోసం రేషన్ బియ్యంలో కలుపుతున్న ఫోర్టిఫైడ్ రైస్ ఎరుపు రంగులోకి మారతాయి.

వెంటనే అది అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం అని అర్థం క్లియర్‌కట్‌గా అర్థం అవుతుంది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 700 కిట్లు, 33 మంది అదనపు సిబ్బందిని విశాఖపట్నం లో 3 చెక్ పోస్ట్ ల దగ్గర నియమించారు. అలాగే కాకినాడ లో కూడా సుమారు 700 కిట్లు అదనపు సిబ్బందిని నియమించినట్లు తెలుస్తోంది.. దీంతో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను చాలా సులభంగా గుర్తించి కట్టడి చేయడానికి వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. పీడీఎస్ బియ్యంలో పోషక విలువలు పెంచేవిధంగా ఫుడ్‌కార్పోరే షన్ ఆఫ్ ఇండియా రేషన్ బియ్యంలో ఫోర్టిఫైడ్ బియ్యం కలపడం ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు రక్తహీనత, పోషకాహార లోపం సమస్యలను తగ్గించేందుకు ఈ ప్రక్రియను ప్రారంభించింది. వీటివల్ల ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 లాంటిముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి..

ఈ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రతీ క్వింటాల్ సాధారణ బియ్యానికి ఒక కిలో ఫోర్టిఫైడ్ రైస్ కర్నల్స్ కలుపుతున్నారు. 100 కిలోల బియ్యం లోఅంటే ఒక శాతం వంతు ఫోర్టిఫైడ్ బియ్యం ఉంటుంది.. ఇప్పుడు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా విషయంలో పట్టించేందుకు ఈ ఫోర్టిఫైడ్ రైస్ ఉపయోగ పడుతున్నాయి..

# ప్రపంచానికే ఆదర్శం

సర్వమానవ సంక్షేమమే లక్ష్యంగా సాగిపోతున్న కేరళ జనాభా సవాళ్లను ఎదుర్కోవడంలో ప్రపంచానికే ఆదర్శంగా నిలవడం ముదావహం. దేశమంటే మట్టికాదోరు.. దేశమంటే మనుషులోరు అన్న మహాకవి గురజాడ మాటలను ఆచరణలో పెట్టేందుకు మార్క్సిస్టు యోధుడు ఇఎంఎస్ నంబూద్రిపాద్ మొదలు.. అచ్యుతానందన్, పినరయి విజయన్ వరకూ లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వాలు సాగించిన కృషి నేడు కేరళ మోడల్‌గా ప్రశంసలందుకుంటోంది. ప్రపంచంలోనే అత్యధిక జనాభాతో.. అందునా యువత అత్యధికంగా ఉండటం దేశ అభివృద్ధికి తోడ్పడేదే! ఈ అవకాశాన్ని మానవ సంక్షేమానికి, దేశ సౌభాగ్యానికి ఎలా వినియోగించవచ్చో కేరళ నిరూపిస్తోంది. అత్యధిక జనాభా కంటే విద్య, వైద్య నైపుణ్యాలున్న యువతే ఆస్తి అని చాటిచెప్పింది. ప్రపంచంలోనే అతి తక్కువ శిశు మరణాలు నమోదులో అత్యంత అభివృద్ధి చెందిన అమెరికాను అధిగమించడం కేరళ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. శాంపుల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్) నివేదిక ప్రకారం మనదేశంలో ప్రతి వెయ్యి శిశు జననాలకు శిశు మరణాల రేటు (ఐఎంఆర్)25గా ఉంది. ప్రపంచంలోనే అత్యాధునిక వైద్య సదుపాయాలున్న అమెరికాలో 5.6 శాతం శిశు మరణాలు నమోదవుతుంటే, కేరళలో ఐదు శాతమే నమోదవుతున్నాయి. నవజాత శిశువుల మరణాల రేటు (నియోనేటల్ మోర్టాలిటీ) దేశ సగటు 18 శాతం కాగా, కేరళలో 4 శాతం కంటే తక్కువ. రాష్ట్ర అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడుతూ, నిధుల విడుదలకు మోకాలడ్డుతున్న మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని సవాలు చేస్తూనే.. ఈ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లోని కార్పొరేట్, ప్రైవేటు వైద్యరంగం అందించే సేవలను అధిగమించడం హర్షనీయం. దేశంలోనే అత్యధికంగా 37 శాతం శిశు మరణాలు బిజెపి పాలిత మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో నమోదయ్యాయి. మోడీ ప్రభుత్వం అత్యధిక నిధులు కట్టబెడుతున్నా బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆరోగ్యం అథమంగానే ఉంటోంది. నీతి ఆయోగ్ నివేదికల ప్రకారమే 2019–20 నుంచి అన్ని ఆరోగ్య సూచీలలో కేరళ దేశంలో అగ్రస్థానంలో ఉంది. అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా లేదా అంతకంటే ఎక్కువగా ఉంది. కేరళ సగటు ఆయుర్దాయం 77 కాగా, ప్రపంచ సగటు 73.5. కేరళలో ప్రసవ సమయాలలో మరణాల రేటు లక్షకు 46 మాత్రమే. జాతీయ సగటు 97. 2018లో నిఫా వ్యాప్తిని 10 రోజుల్లోనే రాష్ట్రప్రభుత్వం నియంత్రించగలిగింది. కరోనాను నియంత్రించడంలో మోడీ ప్రభుత్వం మొదలు, బిజెపి పాలిత రాష్ట్రాలన్నీ చేతులెత్తేయగా, కేరళ ప్రభుత్వం, అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి శైలజ టీచర్ చేసిన అవిరళ కృషిని ఐక్యరాజ్యసమితి ప్రత్యేకంగా అభినందించింది. 2021, 2022లో సంతానోత్పత్తి రేటు (టిఎఫ్ఆర్) దేశంలో 2 శాతంగా ఉండగా, 2023లో 1.9 శాతానికి తగ్గింది. జననాలు, మరణాలు ఒకదానికి ఒకటి సమతుల్యం చేసుకుంటే జనాభా స్థిరత్వం ఏర్పడుతుంది. ప్రస్తుతం యువ జనాభా అత్యధికంగా ఉన్న దేశాల్లో మనదేశం ముందుంది. ఆరోగ్యకరమైన, చదువుకున్న, నైపుణ్యం కలిగిన జనాభా నుంచే డెమోగ్రాఫిక్ డివిడెండ్ (జనాభా లాభం) లభిస్తుందని, యువజనాభా ఉత్పాదక శక్తిగా ఆవిర్భవిస్తుందని కేరళ మోడల్ నిరూపించింది. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాలు భూపంపిణీ, అధునాతన విద్య, వైద్యరంగం, మానవాభివృద్ధి కోసం పడిన తపన నేడు సత్ఫలితాలనిస్తోంది. మహిళలు, పిల్లలపై కేంద్రీకరణ ప్రజల సామర్థ్యాన్ని విపరీతంగా పెంచింది. ఇటీవల డిజిటల్ లిటరసీని సైతం సాధించి దేశానికి, ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచింది. ప్రజల కోసం అధికారాన్ని వెచ్చిస్తే, స్థానిక సంస్థలకు అధికారాలిస్తే సాకారమయ్యే అద్భుతాలను ఆవిష్కృతం చేసి, దేశానికే రోల్ మోడల్‌గా ఆవిర్భవించింది. విద్య, వైద్యరంగంలో అద్భుతాలతో 16 శాతంగా పెరిగిన వృద్ధ జనాభా సంక్షేమం కోసం ఈ ఏడాది ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ కమిషన్, కేరళ రాష్ట్ర వృద్ధుల విధానం దేశానికి దిశానిర్దేశం చేసేవే. కేరళలాంటి రాష్ట్రాలకు అవసరమైన నిధులివ్వాల్సిన కేంద్రంగవర్నర్లు, జిఎస్‌టి నిధులను తొక్కిపెట్టడం తదితర రూపాల్లో అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడటం క్షమార్హం కాదు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు, మతాల మధ్య,కులాల మధ్య కుంపట్టు పెట్టడం,మణిపూర్ మాదిరిగా మంటలు రేపడం దేశ సర్వతోముఖాభివృద్ధికి ఆటంకం. కేరళ మోడల్‌ను అనుసరించే విధానాలను రూపొందించడం, తగిన వనరులను వినియోగించడం దేశ సర్వతోముఖాభివృద్ధికి అత్యవసరం.

# ఆందోళనకరం...



రాష్ట్రంలో ప్రతి ఏటా ఆత్మహత్యలు పెరుగుతుండటం తీవ్ర ఆందోళనకరం. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశ వ్యాప్తంగా జరుగుతున్న బలవన్మరణాల్లో ఐదుశాతం ఆంధ్రప్రదేశ్ నుండే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. 2014లో 6,101గా ఉన్న ఆత్మహత్యల సంఖ్య 2022 నాటికి 8,908కి పెరిగింది. 2014లో ప్రతి లక్షమంది జనాభాకు 12 ఆత్మహత్య రేటుగా ఉంటే 2022 లో అది 16.8కి పెరిగింది. విజయవాడలో ఒకే ఏడాదిలో 65 శాతం ఆత్యహత్యల పెరుగుదల నమోదు కాగా, విశాఖపట్నంలో 22 శాతం పెరుగుదల కనిపించింది. మరొక అధ్యయనం ప్రకారం ప్రతి ఏడాది రోడ్ ప్రమాదాలతో సమానంగా ఆత్మహత్యలు కూడా జరుగుతున్నాయి. సమైక్యరాష్ట్ర విభజన ముందునాటితో పోలిస్తే ఆ తరువాతే రాష్ట్రంలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. 1996–2013మధ్య రోజుకి 20 మంది ఆత్మహత్యలు చేసుకోగా, విభజన తరువాత 2014–2021 మధ్య రోజుకి 41 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. పాలకులు చెప్పే మాటలు ఎలా ఉన్నప్పటికీ రాష్ట్రం ఏ దిశలో సాగుతుందో చెప్పడానికి ఈ గణాంకాలు ఒక నిదర్శనం. అధికారికంగా కుటుంబ సమస్యలు, వ్యాధులు, అప్పుల బాధలను ఆత్మహత్యలకు కారణలుగా చెబుతున్నప్పటికీ అసలు కారణం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే అని చెప్పకతప్పదు. సరళీకరణ ఆర్థిక విధానాల్లో భాగంగా పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, కార్పొరేట్ అనుకూల విధానాలు ప్రజల మీద పెనుభారాన్ని మోపుతున్నాయి. దీంతో కుటుంబాలు తీవ్ర స్థాయిలో ఒత్తిడికి గురవుతున్నాయి. ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో దినసరి కూలీలు, రైతులు, నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో ఉన్నారు. 2022లో నమోదైన గణాంకాల ప్రకారమే మొత్తం ఆత్మహత్యల్లో మూడో వంతు ఆత్మహత్యలు రోజువారీ కూలీలవే. ఇది వారి ఆర్థిక అస్థిరత, సామాజిక భద్రతా లోపానికి నిదర్శనం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించడంలో ప్రభుత్వాల వైఫల్యం యువతపై ప్రభావం చూపుతోంది. అన్నదాతల పరిస్థితి కూడా ఇంతే! పంటలకు గిట్టుబాటుధర లేక, చేసిన అప్పులు తీర్చలేక రైతులు ప్రాణలు తీసుకుంటున్నారు. వివిధ నివేదికల ప్రకారం 2014లో రాష్ట్రంలో 233 మంది రైతులు ఆత్యహత్యలు చేసుకోగా, 2022 నాటికి ఆ సంఖ్య 524కు చేరింది. ఒకవైపు అప్పులు తీర్చలేక రైతులు ప్రాణాలు తీసుకుంటుంటే, జీవనోపాధి లేక దినకూలీలు ఆత్మహత్యల బాట పడుతున్నారు. విద్యార్థులది మరో విషాద గాథ. 2022 సంవత్సరంలో 575 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకోవడం విద్యా వ్యవస్థలోని క్రూరత్వానికి నిదర్శనం. కార్పొరేట్ విద్యాసంస్థలు ర్యాంకుల కోసం విద్యార్థులపై అమానుష ఒత్తిడి పెడుతున్నాయి. విద్యార్థులలో తీవ్రస్థాయిలో అలజడి చెలరేగినప్పుడు కంటితుడుపు మాటలు చెబుతున్న నేతలు ఆ తరువాత వాటిని విస్మరిస్తుండటం దీనికి కారణం. మత్తు పదార్థాలకు బానిసలైన వారు చేసుకుంటున్న ఆత్మహత్యలు కూడా భారీగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తుంది. ఇక 2022లో చోటుచేసుకున్న మొత్తం 8,908 ఆత్మహత్యల్లో 2,141 మహిళలవే! ఈ పరిస్థితి దేనికి నిదర్శనమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆత్మహత్యలు వ్యక్తిగత బలహీనతలు కావు. వాటిని ప్రభుత్వాల విధానాలు, సమాజ బలహీనతల ఫలితంగానే చూడాలి! ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాల పట్ల సానుభూతి చూపడం కన్నా ముందుగా ఆ పరిస్థితి రాకుండా చూడటం అవసరం. ప్రజల ప్రాణాలను కాపాడాలన్న చిత్తశుద్ధి నిజంగానే పాలకులకు ఉంటే ఆ దిశలో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. ముందుగా మానసిక, ఆరోగ్య వసతులను బలోపేతం చేయాలి. హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, వాటిపై విస్తృత ప్రచారం చేయాలి. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సష్టించాలి.రైతులకు రుణ విముక్తి, ఉపాధి హామీ పనులకు నిధుల పెంపు, కార్మికులకు భద్రత, విద్యార్థులకు ఒత్తిడి రహిత విద్య అందుబాటులోకి తేవాలి. నిజానికి ఇవన్నీ ప్రజల హక్కులే. వాటిని సాధించుకోవడం కోసం సమాజంలోని అందరూ కలిసి కదలాలి. ప్రభుత్వంపై ఒత్తిడితీసుకువచ్చి వాటిని సాధించాలి.

# ఘనంగా గోదావరి పుష్కరాల నిర్వహణ

## – జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి: గోదావరి పుష్కరాల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో గోదావరి పుష్కరాల ఏర్పాట్ల సన్నద్ధత పై అదనపు కలెక్టర్లు డి.వేణు, జే.అరుణశ్రీలతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష 2027 సంవత్సరంలో జరిగే గోదావరి పుష్కరాల ను పెద్దపల్లి జిల్లా పరిధిలో ఘనంగా చేసేందుకు పక్కా కార్యాచరణ తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు. మన జిల్లాలో గోదావరి నది పుణ్య స్నానాలు ఎక్కడ జరుగుతాయి, ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్నాన ఘాట్ ల సంఖ్య, నూతనంగా స్నాన ఘాట్ నిర్మాణ ప్రతిపాద నల తయారీ అంశాల పై కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. గతంలో పెద్దపెల్లి జిల్లాలో సుందిళ్ల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, సమ్మక్క సారలమ్మ జాతర గోదావరిఖని, మంథని గౌతమేశ్వర ఆలయం, సమ్మక్క సారలమ్మ జాతర గోలివాడ ,ప్రాంతాలలో స్నానాల ఘాట్ల తో పుష్కర స్నానాలు జరిగాయని కలెక్టర్ తెలిపారు. గోలివాడ స్నానాల ఘాట్ దెబ్బతిన్నందున నూతన ఘాట్ నిర్మాణం, గౌతమేశ్వర ఆలయం వద్ద ప్రస్తుతం ఉన్న స్నానాల ఘాట్ కు అదనంగా మరో ఘాట్ సురబండేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్మించడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని అన్నారు. గత



పుష్కరాల సమయంలో వచ్చిన భక్తుల సంఖ్య, పెరిగిన జనాభాకు అనుగుణంగాప్రస్తుత సంవత్సరం మన జిల్లాలో ఎంత మంది పుణ్యస్నానాలు ఆచరిస్తారో అంచనా వేస్తూ దానికి తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నరేందర్, గోదావరిఖని ఏసిపి రమేష్, పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య,దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, సంబంధి త అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చెదలకు చెక్,,!



వానలతోపాటే చెదపురుగులూ విజృంభిస్తాయి. తలుపులు, కిటికీలతోపాటు చెక్క ఫర్నిచర్‌పై దాడిచేస్తాయి. లక్షల్లోనే నష్టం కలిగిస్తాయి. కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తే.. చెదపురుగులకు ఇట్టే చెక్ పెట్టొచ్చు! వర్షాకాలంలో తలుపులు, కిటికీలను ఎప్పుడూ మూసి ఉంచుతారు. దాంతో ఇంట్లో తేమ పేరుకుపోయి.. చెదపురుగుల బెడద పెరుగుతుంది. వీటిని నివారించడానికి ఇంట్లోకి గాలి ప్రసరణ బాగుండేలా చూసుకోవాలి. చెక్క ఫర్నిచర్‌ను గోడలకు కొంచెం దూరంలో ఉంచాలి. ఒక స్ప్రే బాటిల్‌లో వెనిగర్ తీసుకొని.. దానికి నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమంతో చెదలు పట్టిన చోట స్ప్రే చేస్తే.. ఘాటు వాసనకు చెదపురుగులు చనిపోతాయి. చెదపురుగులను తరిమేయడంలో వేపనూనె అత్యంత ప్రభావం చూపుతుంది. తలుపులు, కిటికీలు, చెక్క ఫర్నిచర్‌పై వేపనూనెను అప్లయి చేయాలి. వేప నూనెలోని ఘాటైన వాసనకు చెదపురుగులు తోకముడుస్తాయి. దీనిలోని ఔషధ గుణాలు.. అవి మళ్లీ మీ ఇంటివైపు చూడకుండా చేస్తాయి.

అలోవెరా జెల్ కూడా చెదపురుగులను నాశనం చేస్తుంది. అవి ఎక్కువగా ఉండే ప్రాంతంలో అలోవెరా జెల్ రాస్తే.. ఊపిరాడక చనిపోతాయి. లవంగాల నూనెలో క్రిమినాశక లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. చెక్క ఉత్పత్తులపై లవంగాల నూనెను అప్లయి చేస్తే.. చెదపురుగులు పారిపోతాయి. ఒక లీటర్ నీటిలో కొద్దిగా పటిక కలిపి.. ఆనీటితో చెదలు పట్టినచోట పిచికారీ చేయాలి. లేదా పసుపు పొడిని చల్లినా.. చెదల బెడద తగ్గుతుంది. ఒక స్ప్రే బాటిల్‌లో నీరు తీసుకొని.. ఒక టీ స్పూన్ ఉప్పు కలపాలి. ఈ మిశ్రమాన్ని చెదపురుగులపై స్ప్రే చేస్తే.. చెదపురుగులు డీహైడ్రేషన్‌కు గురవుతాయి. కొద్దిరోజులకే చనిపోతాయి.

# హెచ్ ఐ వి / ఎయిడ్స్ పై అవగాహనే ఆయుధం

## ఎయిడ్స్ అంటు వ్యాధి కాదు అంటించుకునే వ్యాధి

## ఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

గోదావరిఖని :గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో హెచ్.ఐ.వి/ ఎయిడ్స్ వ్యాప్తిని నిరోధించడంలో భాగంగా కళాశాల ఎన్. ఎస్. ఎస్ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్ మరియు ఐ.సి.టీ. సి. సంయుక్తంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ అవగాహన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జై కిషన్ ఓఝా అధ్యక్షత వహించగా, ఐ. సి.టీ. సి. కౌన్సిలర్ శంకర్ రిసోర్స్ పర్సన్ గా విచ్చేసి హెచ్ ఐ వి / ఎయిడ్స్ మహమ్మారి బారిన పడకుండా నివారణోపాయాలు తెలియజేసి అవగాహన కల్పించారు. వీరు మాట్లాడుతూ – ముఖ్యంగా యువత మంచి జీవన శైలిని అలవరుచుకొని ఆరోగ్యవంతమైన జీవన విధానం పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. డిస్పోసబుల్ సిరంజిలు వాడడం ద్వారా, అపరిచితుల నుండి రక్తాన్ని స్వీకరించకపోవడం వలన అనగా రక్త మార్పిడి సమయంలో జాగ్రత్త వహించడం వలన, అనారక్షిత సంభోగ క్రియకు దూరంగా ఉండడం వలన, ఎయిడ్స్ సోకిన గర్భిణీ స్త్రీ కి జన్మించిన శిశువులకు హెచ్. ఐ. వి సోకకుండ ఎన్ వి పి ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా హెచ్. ఐ. వి / ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా నివారించవచ్చున్నారు. విద్యార్థులు దీని బారిన పడకుండా తమని తాము రక్షించుకోవచ్చని చెప్పారు. ఎయిడ్స్ అనేది అంటూ వ్యాధి కాదని అంటించుకునే వ్యాధని తెలుసుకొని బాధితుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని కోరారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారిని ప్రభుత్వం వారు నిర్వహించే ఐ.సి.టీ.సి.లకు సమాచారం అందించి హెచ్. ఐ.వి ఎయిడ్స్ పీడితుల ను కౌన్సెలింగ్ లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం వారు అందించే తగిన సూచనలు పొంది ఉచితంగా అందించే



మందులు క్రమం తప్పకుండా వాడుకోవాలన్నారు. యువత నిశ్శబ్దాన్ని ఛేదించి హెచ్. ఐ. వి ఎయిడ్స్ నివారణ గురించి చర్చించాలి అన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య జై కిషన్ ఓఝా మాట్లాడుతూ–విద్యార్థులు ఎన్. ఎస్. ఎస్ వాలంటీర్లు హెచ్. ఐ.వి/ ఎయిడ్స్ భూతాన్ని తరిమి కొట్టాలన్నారు. ఈ మహమ్మారికి మందు లేదని నివారణ ఒక్కటే మార్గమని అవగాహన కలిగి ఉండా లన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల సానుకూల దృక్పథం పెంపొంది ంచుకోవాలన్నారు. . రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ మరియు ఎన్. ఎస్. ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా డికిరణ్మయి సభకు ఆహ్వానం పలికి సదస్సును నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాప్తి నిరోధం పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సహించిన ప్రిన్సిపల్ ప్రొ జై కిషన్ ఓఝా కి, ఐ. సి. టీ. సి కౌన్సిలర్ శ్రీ శంకర్ కి కృతజ్ఞతలు తెలియజేసారు. ఎయిడ్స్ నివారణ పై అవగాహన కల్పించే కొన్ని నినాదాలనువిద్యార్థులతో పలికించారు. ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్ డా ఎం నరేష్ వాలంటీర్లకు సూచనలు, సలహాలు అందజేసి సభకు వందన సమర్పణ చేశారు. ఈ అవగాహన సదస్సులో వైస్ ప్రిన్సిపల్ మరియు ఎన్. ఎస్. ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ ఏ సాంబశివ రావు, ఎన్.ఎస్.ఎస్వాలంటీర్లు,హెల్త్ కేర్ మేనేజ్మెంట్విద్యార్థులు పాల్గొన్నారు.

# చంద్రగ్రహణం దెబ్బకు నలుగురు ప్రధానులు ఔట్!

నేపాల్‌లో సామాన్యుల ఆందోళనలు దేశం మొత్తాన్ని అల్లాడించాయి.యువతరం ఆవేశంముందు.. కాకలు తీరిన రాజకీయ నాయకుల ఎత్తులు చిత్తయ్యాయి. అయితే, కేవలం నేపాల్ మాత్రమే కాదు, ఫ్రాన్స్, జపాన్, థాయ్‌లాండ్ వంటి దేశాల్లోనూ ఇదే పరిస్థితి. అయితే, రెండు రోజుల వ్యవధిలోనే నాలుగు దేశాలకు చెందిన ప్రధాన మంత్రులు పదవీచ్యుతులయ్యారు. కానీ, దీనికి కారణం చంద్రగ్రహణం అంటూ సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్ట్ ప్రస్తుతం తెగ వైరల్ అవుతోంది.ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతోన్న రాజకీయ పరిణామాలు ఆసక్తి రేపుతున్నాయి. సోషల్ మీడియాపై నిషేధం విధిస్తూ నేపాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చివరకు ఆ దేశాన్ని కుదిపేస్తోంది. ఆ దేశ ప్రధాన మంత్రి కేపీ శర్మ ఓలీ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. మరోవైపు, ఫ్రాన్స్‌లోనూ 'బ్లాక్ ఎవ్విరిథింగ్' ఉద్యమం క్రమంగా ఉధృతమవుతోంది. ఆ దేశ ప్రధాని ఫ్రాంకోయిస్ బేరోపై విపక్షాలు తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మా నం నెగ్గడంతో ఆయన సోమవారం నాడుపదవి నుంచి తప్పుకు న్నారు. ఇక, థాయ్‌లాండ్, జపాన్ ప్రధానులు షిన్‌వత్రా, షిగేరు ఇషిబాలు కూడా రాజీనామాలు చేశారు. జపాన్ పార్లమెంట్ ఎన్నికల్లో అధికార కూటమి ఓటమి చవిచూసి బలం కోల్పోయింది. దీంతో ఇషిబా రాజీనామా చేయాలనే ఒత్తిడి సొంత పార్టీ నుంచే ఎదురవ వడంతో ఆయన తప్పుకున్నారు. రెండు రోజుల వ్యవధిలోనే నాలుగు దేశాల ప్రధానులు రాజీనామా చేయడంతో ఇదంతా ఆదివారం నాడు సంభవించిన చంద్రగ్రహణం ప్రభావం అని సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తున్నారు.ప్రముఖ వ్యాపారవేత్త హర్షగోయెంకా ఎక్స్ (ట్విట్టర్)లో పెట్టిన ఓ పోస్ట్ చర్చనీయాంశమైంది. 'చంద్రగ్రహణం ప్రభావంతో గత రెండు రోజుల్లోనే జపాన్, ఫ్రాన్స్, నేపాల్, థాయ్‌లాం డ్ ప్రధానులను జనం ఇంటికి సాగనంపారు.. అందరి చూపు త్వర లోనే ఏర్పడబోయే సూర్యగ్రహణం మీదే ఉంది.. తదుపరి రాజీనామా ఓ పెద్ద కాషాయ నేతదే కావచ్చు' అనిఅంటూ ట్వీట్ చేశారు. ఆయన చేసిన ట్వీట్ పరోక్షంగా ప్రధాని మోదీని టార్గెట్ చేసినట్టు ఉంది. ఈ ట్వీట్‌పై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. ఓ నెటిజన్ "ఆ వ్యక్తి మోదీ కావచ్చు" అని రిప్లయ్ ఇచ్చాడు.' అప్పటివరకు అందరూచేదు "ఆకుపచ్చ" రసాన్ని తాగి, తీపి నారింజ రసం అమృతాన్ని తాగాలనే ఆశతో సూర్యుడిని పూజిస్తారు.. తర్వాత జై శ్రీరామ్ అంటారు" అని ఓ నెటిజన్ కామెంట్ పెట్టారు.

# తమిళనాడులో రూ.1000 కోట్ల పైగా సైబర్ మోసాలు



ఢిల్లీ:తమిళనాడులో 2025 సంవత్సరంలో ఇప్పటివరకు రూ.1,100 కోట్ల నష్టం వాటిల్లిన సైబర్ మోసాలకు సంబంధించి లక్షకు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయని నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్సీఆర్పి) తెలిపింది. సైబర్ నేరస్థులు ఫిషింగ్ ఇమెయిల్‌లు, నకిలీ వెబ్‌సైట్‌లు లేదా హానికరమైన అటాచ్‌మెంట్‌లు వంటి మోసపూరిత వ్యూహాలను ఉపయోగించి ప్రజలను మోసం చేశారు. భారీ రాబడి వస్తుందని నమ్మబలికి నకిలీ ఆన్‌లైన్ లింక్‌లను క్లిక్ చేయించి భారీ స్కాములకు పాల్పడ్డారు. అందిన అనేక ఫిర్యాదులలో పెట్టుబడి స్కామ్‌లు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు ఉన్నాయి. 2024లో ఎన్సీఆర్పి పోర్టల్‌లో 1,27,041 ఫిర్యాదులు నమోదయ్యాయి. అందులో 13,287 పెట్టుబడి స్కామ్‌లు కాగా, 4,439 డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లుగా నివేదించబడ్డాయి. రూ. 1,673 కోట్లు నష్టపోయారని, అందులో రూ. 772 కోట్లు స్తంభింపజేసి, రూ. 84 కోట్లు బాధితులకు తిరిగి ఇచ్చామని సైబర్ క్రైమ్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సందీప్ మిట్టల్ తెలిపారు. ఈ సంవత్సరం జూలై వరకు రూ.1,010 కోట్ల నష్టం జరిగినట్లు నివేదించబడింది. అందులో రూ.314 కోట్లు స్తంభింపజేయబడ్డాయి. అవసరమైన కోర్టు ఆదేశాలు పొందిన తర్వాత రూ.62.4కోట్లు బాధితులకు తిరిగి ఇవ్వబడ్డాయి. తమిళనాడు సైబర్‌క్రైమ్ వింగ్ ప్రయత్నాల కారణంగా, మద్రాస్ హైకోర్టు అన్ని జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లకు సర్క్యులర్ జారీ చేసిందని, స్తంభింప చేసినడబ్బును బాధితులకు తిరిగి ఇవ్వడానికి ఎఫ్ఐఆర్ లు నమోదు చేయమని పట్టుబట్టవద్దని ఆదేశిస్తూ మిట్టల్ చెప్పారు.

# 'తిరిగి వెళ్లిపోండి'.. బ్రిటన్‌లో భారతీయుల భవిష్యత్తు ప్రశ్నార్థకం..!



యుకె : విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో, భారతీయులు వీసా దరఖాస్తుల ఆలస్యం, వీసా తిరస్కరణ, వీసా రద్దు, వీసా ఫార్మాలిటీల కోసం స్వదేశానికి తిరిగి వెళ్ళాల్సిన అవసరం వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా, అమెరికాలో నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాల కోసం థర్డ్ కంట్రీ వీసా ఆప్షన్ రద్దు కావడంతో, వీసా ఇంటర్వ్యూల కోసం భారతీయులు స్వదేశానికి తిరిగి వెళ్లాల్సి వస్తోంది,

ఇది వీసా ఆలస్యాలకు దారితీస్తోంది. విద్యార్థులు వీసాలు రద్దు అయినప్పుడు బహిష్కరణకు గురి కావడం లేదా చదువును కొనసాగించలేకపోవడం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

బ్రిటన్ లో తిరిగి వెళ్లనివారిపై ఉక్కుపాదం: బ్రిటన్‌లో నివసిస్తున్న వేలాది మంది భారతీయుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతోంది. వీసా గడువు ముగిసినప్పటికీ తమ దేశాలకు తిరిగి వెళ్లని వారిని వెనక్కి తీసుకునే విషయంలో సహకరించని దేశాలపై ఉక్కుపాదం మోపాలని యుకె ప్రభుత్వం నిర్ణయించింది. ఈ జాబితాలో భారత్, పాకిస్థాన్, నైజీరియాలు ఉండటంతో, ఆయా దేశాల పౌరులకు వీసాలు జారీ చేయడంలో కఠిన ఆంక్షలు విధించనున్నట్లు బ్రిటన్‌కు కాబోయే హోం సెక్రటరీ (లేబర్ పార్టీ షాడో హోం సెక్రటరీ) యెవెట్ కూపర్ ఉద్ఘాటించి గట్టిగా హెచ్చరించారు.

వీసా విధానమే బేరసారాల అస్త్రంగా: అక్రమ వలసదారులను నియంత్రించడంలో భాగంగా బ్రిటన్ ప్రభుత్వం 'రిటర్న్' ఒప్పందాలను (తిరిగి పంపించే ఒప్పందాలు) కఠినంగా అమలు చేయాలని భావిస్తోంది. ఈ ఒప్పందాల ప్రకారం వీసా గడువు ముగిసినా లేదా చట్టవిరుద్ధంగా దేశంలోకి ప్రవేశించిన తమ పౌరులను ఆయా దేశాలు తిరిగి వెనక్కి తీసుకోవాలి. అయితే, ఈ ప్రక్రియలో కొన్ని దేశాలు సహకరించడం లేదని బ్రిటన్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో వీసా విధానాన్ని ఒక 'బేరసారాల అస్త్రంగా' వాడుకోవాలని కొత్త ప్రభుత్వం ఆలోచిస్తోంది.

ఆలస్యం చేస్తే : ఒకవేళ భారత్ వంటి దేశాలు తమ పౌరులను వెనక్కి తీసుకోవడంలో ఆలస్యం చేస్తే ముందుగా వీసా దరఖాస్తు రుసుములను భారీగా పెంచాలని, వీసా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయాలని, చివరి అస్త్రంగా ఆ దేశ పౌరులకు తాత్కాలికంగా లేదా పూర్తిగా వీసాలను నిలిపివేయాలని బ్రిటన్ ఆలోచిస్తోంది.

అత్యధికులు భారతీయులే: బ్రిటన్ హోం ఆఫీస్ గణాంకాల ప్రకారం . వీసా గడువు ముగిసినా బ్రిటన్ దేశంలోనే ఉండిపోయినవారిలో భారతీయులే అత్యధిక సంఖ్యలో ఉన్నారు. 2020 నాటికే దాదాపు 20,706 మంది భారతీయులు ఈ జాబితాలో ఉన్నట్లు అంచనా. గత ఏడాది భారత్ సుమారు 7,400 మందిని వెనక్కి తీసుకున్నప్పటికీ, పాస్‌పోర్టులు లేనివారిని గుర్తించి, వారికి అత్యవసర ప్రయాణ పత్రాలు జారీ చేయడంలో భారత ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని యూకే అధికారులు ఆరోపిస్తున్నారు. బ్రిటన్ ఏకపక్షంగా తీసుకునే ఈ నిర్ణయం భారత్ వంటి కీలక భాగస్వామ్య దేశంతో ద్వైపాక్షిక సంబంధాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన మైగ్రేషన్ అబ్జర్వేటరీ నిపుణుడు డాక్టర్ పీటర్ వాల్ష్ మాట్లాడుతూ " యూకే వీసా వ్యవస్థను అత్యధికంగా వినియోగించుకుంటున్న దేశాల్లో భారత్ ఒకటి. ఇలాంటి బెదిరింపు ధోరణిని భారత్ తేలిగ్గా తీసుకోదు. ఇది ఇరు దేశాల మధ్య వాణిజ్య, విద్యా సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది " అని అభిప్రాయపడ్డారు.

కఠిన చర్యలకు వెనుకాడబోం : బ్రిటన్ అయితేబ్రిటన్ మాత్రం ఈ సమస్యనుపరిష్కరించడానికిఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని, అవసరమైతే ఏ దేశానికైనా వీసాలను ఆయుధంగా ప్రయోగించడానికి సిద్ధమని యెవెట్ కూపర్ స్పష్టం చేశారు. దీంతో బ్రిటన్‌లో చదువు, ఉద్యోగాల కోసం వెళ్లాలను కుంటున్న లక్షలాది మంది భారతీయుల్లో ఆందోళన నెలకొంది.

# ఎంపీనే బురిడీ కొట్టించారు!

కాకినాడ: ఏపీలో సైబర్ నేరాలకుఅడ్డూ అదుపూ లేకుండా పోతోంది. అనునిత్యం ఎక్కడో ఒకచోట సైబర్ నేరం నమోదు అవుతూ వస్తోంది. సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు అందరూ సైబర్ నేరాల బాధితులే. పోలీసులు అనేక రూపాల్లో అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో చలనం లేదు. సైబర్ నేరాల బారిన పడుతూనే ఉన్నారు. మొన్నటికీ మొన్న ఏపీ మంత్రి అల్లుడు ఒకరు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డారు. లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నారు. ఇప్పుడు తాజాగా కాకినాడ జనసేన ఎంపి తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. ఏకంగా రూ.92.5 లక్షలు కొల్లగొట్టారు. వాట్సాప్ ప్రొఫైల్ పిక్చర్ మార్చి ఈ ఘటనకు పాల్పడ్డారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.పూర్వాశ్రమంలో తంగేళ్ల ఉదయ శ్రీనివాస్( టీ టైమ్ వ్యవస్థాపకుడు. మొన్నటి ఎన్నికల్లో కాకినాడ నుంచి జనసేన తరఫున పోటీ చేసి గెలిచారు. అయితే తాజాగా ఈ టైం సిఎఫ్ఓ శ్రీనివాసరావు గంగిశెట్టి కి ఓ సైబర్ మోసగాడు వాట్సాప్ లో కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్ ప్రొఫైల్ పిక్చర్ పెట్టుకుని మెసేజ్ చేశాడు. మొదట ఆగస్టు 22న శ్రీనివాసరావుకు మెసేజ్ పంపాడు. అది తన కొత్త నెంబర్ అని పరిచయం చేసుకున్నాడు. అయితే అది తన బాస్ ఉదయ శ్రీనివాస్ నెంబర్ అని శ్రీనివాస్ నమ్మాడు. ఈ క్రమంలో ఆ సైబర్ మోసగాడు ఎంపీ ఉదయ శ్రీనివాస్ పేరు చెప్పి అత్యవసరంగా డబ్బులు కావాలన్నాడు. కొన్ని వారాలపాటు శ్రీనివాసరావు తో వందర్లా బ్యాంక్ అకౌంట్లకు డబ్బులు పంపమని చెప్పాడు. శ్రీనివాసరావు కూడా తన యజమాని డబ్బులు పంపమని భావించి.. 11 సార్లు ఏకంగా రూ.92.5 లక్షలు అదేవిధంగా ట్రాన్స్ఫర్ చేశారు. అయితే సెప్టెంబర్ 8న ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాసులు సిఎఫ్ఓ శ్రీనివాసరావు కలుసుకోవడంతో అసలు విషయం బయటపడింది. అటువంటి రిక్వెస్ట్ తానేది ఫోన్లో చేయలేదని ఎంపీ చెప్పడంతో సైబర్ మోసానికి గురయ్యానని శ్రీనివాసరావు ఒక నిర్ణయానికి వచ్చారు.

వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాదులోని సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంపీ పేరుతో ఈ మోసం జరగడంతో పోలీసులు సీరియస్ గా తీసుకున్నారు. అయితే ఆలస్యంగా ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇప్పటివరకు ఏడు లక్షల రూపాయలను మాత్రమే ఫ్రీజ్ చేయగలిగారు. మిగిలిన డబ్బును వెనక్కి తీసుకురావడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ డబ్బులు ఎవరి బ్యాంకు ఖాతాల్లోకి వెళ్లాయో తెలుసుకునేందుకు బ్యాంక్ రికార్డులు, కాల్ డేటా రికార్డులు, ఐపీ అడ్రస్లను పరిశీలిస్తున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు. సాక్షాత్తు ఒక ఎంపీకి పరిస్థితి వచ్చిందంటే.. సామాన్యుడి దుస్థితి ఏంటన్న ప్రశ్న వినిపిస్తోంది.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కమాన్ పూర్: రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో గల కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు సెంటినరీ కాలని లోని జోన్-2 ఏరియాలో గల క్వార్టర్స్ లో ప్రతి ఇంటింటికీ వెళ్ళి పరిసరాల పరిశుభ్రత గురించి వారికి వివరించి, పరిసరాలలో అపరిశుభ్రంగా ఉండటం వలన ఈగలు, దోమల సంఖ్య పెరిగి వైరల్ ఫివర్స్ రావడం జరుగుతుందని, దీని వల్ల అందరూ అనారోగ్యం నకు గురికావడం జరుగుతుందని, అలా జరగకుండా ఉండాలంటే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వారికి వివరించడం జరిగింది. అదేవిధంగా నాగేపల్లి చౌరస్తాలో ప్రతి దుకాణం లోకి వెళ్లి దుకాణ యజమానికి మరియు వినియోగదారులకు ప్లాస్టిక్ వినియోగం వలన జరిగే అనర్థాలను వివరించి, ప్లాస్టిక్ వాడడం వలన మన దేశం లో రోజు రోజుకు చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. నాగేపల్లి చౌరస్తా లో వినియోగదారులందరికీ నృత్య రూపంలో మరియు పాటల రూపంలో అందరికీ అర్థమయ్యేలా ప్లాస్టిక్ వాడకం ను తగ్గించి, బట్ట సంచులను వాడాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ భూతం వేషధారణలో ఉన్న అబ్బాయి రిత్విక్ ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాడు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతి రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# సూపర్ గేమ్ ఛేంజర్గా రీజనల్ రింగ్ రోడ్



**హైదరాబాద్, మార్చి 21 :** హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం పనులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. 161.5 కిలోమీటర్ల మేర ఆరు వరుసల రహదారిపై ఏఐ కెమెరాలు, అడ్వాన్స్డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇవి నిబంధనల ఉల్లంఘనలను గుర్తించడమే కాకుండా, ప్రమాదాల సమయంలో తక్షణ వైద్య సహాయం అందేలా పోలీసు, రవాణా శాఖలను అప్రమత్తం చేస్తుంది.తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. సగం తెలంగాణ జిల్లాలను కవర్ చేస్తూ సూపర్ గేమ్ ఛేంజర్గా ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఉత్తర, దక్షిణ రెండు భాగాలుగా ఈ రహదారిని నిర్మిస్తుండగా.. ఇప్పటికే ఉత్తర భాగం పనులకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. కేంద్రం జాతీయ నంబర్‌ను కూడా కేటాయించి పనుల కోసం టెండర్లు ఆహ్వానించింది. ఇక ఉత్తర భాగం పనులపై కీలక అప్డేట్ వచ్చింది. ఏఐ టెక్నాలజీతో ఈ భాగం పనులు చేపట్టాలని సర్కార్ భావిస్తోంది.ఇప్పటికే ఖమ్మం-దేవరపల్లి మధ్య నిర్మించిన యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు ఏఐ ఆధారిత అధునాతన సాంకేతికతను ఉపయోగించారు. ఈ క్రమంలో తెలంగాణలో ప్రారంభించనున్న కొత్త ఎన్‌హెచ్‌ఏఐ రహదారులకు ఇదే తరహా టెక్నాలజీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రెడీ అవుతోంది. ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం పనుల్లో ఈ టెక్నాలజీ వినియోగించడంపై కేంద్రం ఫోకస్ సారించింది. సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తంగడ్‌పల్లి వరకు 161.5 కిలోమీటర్ల ఆరు వరుసలతో ఈ రహదారి నిర్మిస్తున్నారు. ఈ రహదారి వెంట ఏఐ ఆధారిత సాంకేతికతను వినియోగించడానికి ఎన్‌హెచ్‌ఏఐ తాజాగా ఏర్పాట్లు చేస్తోంది. దాంతో పాటుగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని 4నుంచి 6 వరుసలుగా మార్చడానికి ఇప్పటికే డీపీఆర్ సమర్పించారు. ఇందులో మొత్తం 232 కిలోమీటర్ల పొడవున సాంకేతికతను ఉపయోగించాలని డిసైడ్ అయ్యారు.ఇందులో భాగంగా అడ్వాన్స్డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా తెలంగాణ, ఏపీలోని పోలీసు, రవాణా శాఖలతో రోడ్డు భద్రతను అనుసంధానం చేస్తారు. హైదరాబాద్-నాగ్‌పుర్ మార్గంలోనూ కొత్త టెక్నాలజీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. తెలంగాణ పరిధిలో ఈ రహదారి మొత్తం 251 కిలోమీటర్ల మేర ఉండగా పూర్తిస్థాయిలో కొత్త సాంకేతిక పరిజ్ఞానం తీసుకురానున్నారు. ఈ ఏఐ టెక్నాలజీలో భాగంగా రహదారి వెంట అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేస్తారు. ట్రాఫిక్ రూల్స్‌కు విరుద్ధంగా మితిమీరిన వేగంతో వాహనాలు వెళ్తే ఈ కెమెరాలు పట్టేస్తాయి. వెంటనే ఆ వాహనదారుడి అడ్రస్‌కు ఆటోమెటిక్‌గా చలాన్లు వెళ్తాయి. దాంతో పాటు రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సత్వరమే అలర్ట్ కావటానికి వైద్య సహాయం అందించటానికి వీలు కలుగుతుంది.

# విజయ్ పార్టీకి వరుస కష్టాలు...

## ఖర్చుల భారంతో అభ్యర్థుల ఆందోళన

## పోటీకి దూరమవుతున్న నేతలు

**చెన్నై, మార్చి 21 :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం పార్టీలో అంతర్గత సంక్షోభం నెలకొన్నట్లు తెలుస్తోంది. భారీ ఆశలతో రాజకీయాల్లోకి వచ్చిన విజయ్‌కు పొత్తులు కుదరకపోవడం, ఎన్నికల ఖర్చుల భారం అభ్యర్థులపైనే పడటంతో టికెట్లు ఆశించిన నేతలు ఇప్పుడు పోటీకి వెనకాడుతున్నట్లు సమాచారం.పార్టీ పెట్టిన మొదట్లో విక్రవాండిలో జరిగిన భారీ బహిరంగ సభలో విజయ్ ఇతర పార్టీలకు పొత్తుల కోసం పిలుపునిచ్చారు. తొలుత ప్రధాన ప్రతిపక్షం అన్నాడిఎంకె తో చర్చలు జరిగినట్లు వార్తలు వచ్చాయి. అయితే, విజయ్ ఏకంగా 100 సీట్లు కావాలని, రెండున్నర ఏళ్లు ముఖ్యమంత్రి పదవిని పంచుకోవాలని డిమాండ్ చేయడంతో అన్నాడిఎంకె వెనక్కి తగ్గి బీజేపీ వైపు మొగ్గు చూపింది. అటు విదుతలై చిరుతైగళ్ కమ్యూనిస్టులు, కాంగ్రెస్ వంటి పార్టీలు కూడా డిఎంకె కూటమిని వీడకపోవడంతో విజయ్ చివరకు ఒంటరిగానే బరిలోకి దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది.తొలుత పార్టీ టికెట్ల కోసం 10 వేల మందికి పైగా ఉత్సాహంగా అప్లికేషన్లు తీసుకున్నప్పటికీ, దరఖాస్తులను తిరిగి సమర్పించిన వారి సంఖ్య చాలా తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం పార్టీ అధిష్టానం విధించిన కఠిన నిబంధనలేనని సమాచారం. సీటు ఖరారు కావాలంటే పార్టీకి రూ. 1 కోటి చెల్లించాలని అధిష్టానం ఆదేశించినట్లు చెబుతున్నారు. ప్రచారానికి అదనంగా మరో రూ. 2 కోట్లు అభ్యర్థులే సమకూర్చుకోవాలని స్పష్టం చేయడంతో ఆశావహులు షాక్‌కు గురవుతున్నారు.మొదటి విడత ఇంటర్వ్యూలలో సుమారు 300 మంది ఉత్సాహం చూపినప్పటికీ, క్షేత్రస్థాయి పరిస్థితులను చూసి చాలామంది వెనకడుగు వేస్తున్నారు. పొత్తులు ఉంటే ఎంతో కొంత నిధులు సమకూరేవి, కానీ ఒంటరిగా అంత భారీ మొత్తం వెచ్చించి ఓడిపోతే పరిస్థితి ఏంటి? అని పార్టీ నేతలు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. దీంతో అభ్యర్థులను వెతుక్కోవాల్సిన పరిస్థితి విజయ్‌కు ఏర్పడిందిఎన్నికలకు కేవలం నెల రోజులు మాత్రమే సమయం ఉన్న తరుణంలో, నేతలను ఎలా ఒప్పించాలి? అభ్యర్థుల ఎంపికను ఎలా పూర్తి చేయాలి? అనే అంశంపై విజయ్ మల్లగుల్లాలు పడుతున్నారు. సొంతంగా నిధులు సమకూర్చలేని పక్షంలో, ధనిక వర్గాలకు లేదా బలమైన స్థానిక నేతలకు మాత్రమే టికెట్లు కేటాయించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాబోయే రోజుల్లో అభ్యర్థుల ప్రకటనపై విజయ్ తీసుకునే నిర్ణయం ఆ పార్టీ భవిష్యత్తును నిర్ణయించనుంది.

# రద్దు యోచనలేదు

## క్లారిటీ ఇచ్చిన విద్యాకమిషన్



**హైదరాబాద్, మార్చి 21 :** తెలంగాణ విద్యావ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకోబోతున్నాయనే వార్తలు గత కొద్ది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా 2026-27 విద్యా సంవత్సరం నుండి పదో తరగతి బోర్డు పరీక్షలు రద్దు కానున్నాయన్న ప్రచారంపై విద్యాశాఖ కమిషన్ తాజాగా కీలక వివరణ ఇచ్చింది. పదో తరగతి పరీక్షల రద్దుపై వస్తున్న వార్తలను తెలంగాణ విద్యాశాఖ కమిషన్ ఓఎస్డీ డాక్టర్ జీనత్ ఖండించారు. తాము ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పదో తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేయాలని ఎక్కడా సిఫార్సు చేయలేదని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం విడివిడిగా ఉన్న ఎస్ఎస్‌సీ బోర్డును, ఇంటర్మీడియట్ బోర్డును విలీనం చేయాలని ప్రతిపాదించారు. కేవలం 11వ తరగతి పబ్లిక్ పరీక్షలను మాత్రమే రద్దు చేయాలని సూచించినట్లు ఆమె తెలిపారు. తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయవద్దని, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందకుండా కచ్చితమైన సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ఆమె విజ్ఞప్తి చేశారుమరోవైపు సీఎం రేవంత్ రెడ్డి విద్యావ్యవస్థలో సమూల మార్పుల అవసరాన్ని నొక్కి చెప్పారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా +2 విధానాన్ని రాష్ట్రంలోనూ బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో విద్యా సంస్కరణలపై ఏర్పాటు చేసిన కమిటీ అధ్యయనం కొనసాగుతోందని, కమిషన్ ఇచ్చేది తుది నివేదిక కాదని ఆయన స్పష్టం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తెలంగాణ విద్యా రంగాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని సీఎం తెలిపారు.మార్చి 20న అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సంక్షేమ, అభివృద్ధి బడ్జెట్‌గా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఇదే క్రమంలో విపక్షాలపై ఆయన ఘాటైన విమర్శలు చేశారు. బడ్జెట్‌ను నిరసిస్తూ చెవిలో పూలు పెట్టుకుని అసెంబ్లీ నుండి బయటకు వచ్చిన బీఆర్ఎస్ నేతల తీరును ఆయన ఎద్దేవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్ వ్యవహారశైలిపై, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై సీఎం తనదైన శైలిలో సెటైర్లు వేశారు.ప్రస్తుతానికి పదో తరగతి బోర్డు పరీక్షల రద్దుపై అధికారికంగా ఎటువంటి జీవో వెలువడలేదు. విద్యాశాఖ కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోనుంది. విద్యార్థులు తమ విద్యా ప్రణాళికను యథావిధిగా కొనసాగించాల్సి ఉంటుంది.

# జూన్ నాటికి గ్రీన్ ఫీల్డ్ హైవే రెడీ

**నల్గొండ, మార్చి 21 :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లను అనుసంధానిస్తూ ఖమ్మం-దేవరపల్లి మధ్య నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే జూన్ నాటికి అందుబాటులోకి రానుంది. 162 కిలోమీటర్ల పొడవైన ఈ హైటెక్ రహదారి పనులు 90 శాతం పూర్తయ్యాయి. ఆధునిక సాంకేతికతతో రూపొందుతున్న ఈ ఎక్స్‌ప్రెస్ వే ద్వారా హైదరాబాద్ - విశాఖ మధ్య ప్రయాణ సమయం, దూరం గణనీయంగా తగ్గి రవాణా, వాణిజ్య రంగాలు బలోపేతం కానున్నాయి.తెలంగాణ-ఏపీ మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవే అందుబాటులోకి రానుంది. ఖమ్మం నుంచి ఏపీలోని దేవరపల్లి వరకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే కారిడార్ రెండు తెలుగు రాష్ట్రాల రవాణా ముఖచిత్రాన్ని మార్చబోతోంది. సుమారు 4,451.87 కోట్ల అంచనా వ్యయంతో, 162.4 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న ఈ హైటెక్ రహదారి పనులు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. తెలంగాణలో మొట్టమొదటి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేగా రికార్డు సృష్టించనున్న ఈ రహదారి.. ఈ ఏడాది జూన్ నాటికి వాహనదారులకు అందుబాటులోకి వచ్చే ఛాన్స్ ఉంది.కేంద్ర ప్రభుత్వం భారత్ మాల పరియోజన పథకంలో భాగంగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఈ గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రాజెక్టును పర్యవేక్షిస్తోంది. 2017లో ప్రతిపాదనలు సిద్ధం కాగా.. 2018లో కేంద్ర ప్రభుత్వం దీనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రహదారి అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులకు దూరం, ప్రయాణ సమయం భారీగా తగ్గనుంది. ప్రస్తుతం సూర్యాపేట, విజయవాడ మీదుగా విశాఖకు వెళ్లాలంటే 676 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంది. కానీ, ఈ కొత్త కారిడార్ ద్వారా 80 కి.మీ ఆదా కావటమే కాకుండా ట్రాఫిక్ సమస్యలు లేకుండా వేగంగా గమ్యాన్ని చేరుకోవచ్చు.ప్రస్తుతానికి గ్రీన్ ఫీల్డ్ హైవే కారిడార్ యాక్సెస్ కంట్రోల్ కలిగిన నాలుగు లైన్ల రహదారి. అయితే భవిష్యత్తు అవసరాల దృష్ట్యా దీనిని ఆరు లైన్లుగా విస్తరించుకునేలా డిజైన్ చేశారు. ఈ రహదారికి బారికేడింగ్ ఉండటం వల్ల ఇతర వాహనాలు మధ్యలో వచ్చే అవకాశం ఉండదు. ప్రతి 18 కిలోమీటర్లకు ఒక ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, ప్రతి 5 కిలోమీటర్లకు అత్యవసర మీడియన్ ఓపెనింగ్స్ ఏర్పాటు చేశారు. వాహనదారులు సాయం కోసం 1033 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చు. మొత్తం మార్గంలో 10 ప్రధాన వంతెనలు, 295 కల్వర్టులు, 98 అండర్ పాసులు నిర్మిస్తున్నారు. ఏఐ సాంకేతికతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రతినిత్యం నిఘా ఉంచుతారు.ఈ గ్రీన్ ఫీల్డ్ రహదారి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఖమ్మం జిల్లా ఆర్థికంగా అభివృద్ధి చెందనుంది. ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు వద్ద ఈ హైవేకు ఎగ్జిట్ ఇచ్చారు. దీనివల్ల స్థానిక రైతులకు, వ్యాపారులకు తమ ఉత్పత్తులను వేగంగా మార్కెట్లకు తరలించే ఛాన్సుంది. హైవే పొడవునా గిడ్డంగులు, లాజిస్టిక్ హబ్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు కావడానికి అవకాశం ఉంది. ఇప్పటికే 116 కిలోమీటర్ల మేర పనులు పూర్తి కాగా.. మిగిలిన 10-20 శాతం ఫినిషింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.సోలార్ వెలుగులతో, హైటెక్ హంగులతో సిద్ధమవుతున్న ఈ కారిడార్ ఆంధ్ర-తెలంగాణ మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడమే కాకుండా.. సామాన్య వాహనదారులకు, ప్రయాణికులకు సుఖవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు రెడీ అవుతోంది.

# కన్నీరు పెడుతున్న మంజీరమ్మ



**మెదక్, మార్చి 21 :** సంగారెడ్డి జిల్లాలో మంజీరమ్మ కన్నీరు పెడుతోంది .ఒకప్పుడు జీవకళతో ఉట్టిపడిన నది, ఇప్పుడు పారిశ్రామిక వ్యర్థాలతో విషతుల్యంగా మారింది. ముఖ్యంగా నక్కవాగు ద్వారా వస్తున్న రసాయన జలాలు మంజీర నదిని మృత్యుకూపంగా మారుస్తున్నాయి. హత్నూర మండలం పల్వనూరు, ఫసల్వాడి, గౌడిచర్ల పరిసరాల్లో వేల సంఖ్యలో చేపలు మృత్యువాత పడటం కలకలం రేపుతోంది. వేల సంఖ్యలో చేపల మృతితో మత్స్యకారులు లబోదిబోమంటున్నారు.సంగారెడ్డి జిల్లా మత్స్యకారుల బతుకు చిత్రం ఛిన్నాభిన్నమవుతోంది. నక్కవాగు రూపంలో వస్తున్న పారిశ్రామిక వ్యర్థాలు మంజీర నదిని కలుషితం చేస్తున్నాయి. పారిశ్రామిక వాడల నుండి వెలువడే రసాయన జలాలను నేరుగా వాగులోకి వదలడంతో, ఆ విషతుల్యమైన నీరు మంజీరలో కలిసి మత్స్య సంపదను హరించివేస్తోంది. నేడు చేపల వేటకు వెళ్లిన పల్వనూరు, ఫసల్వాడి, గౌడిచర్ల గ్రామస్థులకు నదిలో కుప్పలు తెప్పలుగా పడి ఉన్న మృత చేపలు దర్శనమిచ్చాయి..గతంలోనూ ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయి. చేపలు చనిపోయిన ప్రతిసారీ అధికారులు వస్తారు, నమూనాలు సేకరిస్తారు. కానీ యాక్షన్ మాత్రం శూన్యమని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నక్కవాగు పరిసర గ్రామాల ప్రజలు ఈ నీటిని తాగలేక, వాడలేక నానా అవస్థలు పడుతున్నారు. కంపెనీల యాజమాన్యాలు లాభాల కోసం చూస్తూ, వ్యర్థాలను శుద్ధి చేయకుండానే నదిలోకి వదులుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీస్తున్న ఈ కాలుష్య కోరల నుండి మంజీరను కాపాడేవారే లేరా అని ప్రశ్నిస్తున్నారు.

# కోర్టులపైనే గులాబీ ఆశలు





**హైదరాబాద్, మార్చి 21 :** ఎట్టకేలకు..ఊహించని ట్విస్ట్ ఇచ్చారు స్పీకర్ గడ్డం ప్రసాద్. ఫిరాయింపు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి కూడా క్లీన్ చిట్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. పది మంది ఎమ్మెల్యేల ఎపిసోడ్‌లో మొదటి నుంచి దానం నాగేందర్, కడియం శ్రీహరి కేసులు మాత్రం సమ్‌థింగ్ స్పెషల్ అనే టాక్ ఉండేది. ఎందుకంటే దానం నాగేందర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లడమే కాదు..కాంగ్రెస్ బీఫామ్ మీద లోక్‌సభ ఎంపీగా కంటెస్ట్ చేశారు.ఇక తన కూతురు కడియం కావ్య కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా దాఖలు చేసిన నామినేషన్ పత్రంపై కడియం శ్రీహరి సంతకం చేసినట్లు అలిగేషన్స్ ఉన్నాయి. పైగా తన కూతురు గెలుపు కోసం కడియం ప్రచారం చేసినట్లు కూడా బీఆర్ఎస్ వీడియో ప్రూఫ్‌లు సబ్మిట్ చేసింది. ఈ కీలక ఆధారాలు ఉన్నాయని భావించి..ఈ ఇద్దరిపై స్పీకర్ వేటు వేస్తారని బలమైన ఒపీనియన్ కొనసాగింది. కడియంను సేవ్ చేసినా దానం నాగేందర్‌పై మాత్రం వేటు వేయడమో? రాజీనామానో? పక్కా అన్న టాక్ నడిచింది. ఇదేది జరగలేదు. ఎవరూ ఊహించనట్లు..కాంగ్రెస్ పెద్దలు కోరుకున్నట్లుగా స్పీకర్ తీర్పు ఇచ్చారని బీఆర్ఎస్ లీడర్లు మండిపడుతున్నారుపలుసార్లు కోర్టు స్పీకర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడం..సభాపతి కూడా విచారణకు సమయం కోరడంతో..వేటు వేస్తారని బీఆర్ఎస్ కూడా బలంగా నమ్మింది. ఒకానొక టైమ్‌లో ఖైరతాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ బై ఎలక్షన్స్‌కు కారు పార్టీ రెడీ అవుతున్నట్లు కూడా ప్రచారం జరిగింది. కానీ ఫిరాయింపు ఎపిసోడ్‌లో కథ మళ్లీ మొదటికి వచ్చినట్లు అయింది. నెక్స్ట్ బీఆర్ఎస్ స్టెప్ ఏంటన్నదే కీలకంగా మారింది. మొత్తం పది మంది ఎమ్మెల్యేలపై వేటు కోసం మళ్లీ సుప్రీంకోర్టు మెట్లెక్కనుందా? లేక కడియం, దానం విషయంలో మాత్రమే సీరియస్‌గా ఉందా? అసలు బీఆర్ఎస్ ఆలోచన ఏంటన్నది ఆసక్తికరంగా మారిందిఅయితే ఇప్పటికే సుప్రీంకోర్టులో తాము వేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే..స్పీకర్ క్లీన్ చిట్ ఇస్తూ నిర్ణయం తీసుకోవడంతో..గులాబీ పార్టీ సరికొత్త వ్యూహాలను తెరలేపుతోందన్న చర్చ జరుగుతోంది. మరోసారి అత్యున్నత న్యాయస్థానం మెట్లెక్కేందుకు ప్రిపేర్ అవుతోందట. కచ్చితంగా దానం, కడియం శ్రీహరిపై వేటు పడుతుందని..దానం నాగేందర్ కాంగ్రెస్ బీఫామ్ మీద పోటీ చేసినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని చెబుతున్నారు బీఆర్ఎస్ లీడర్లు. గతంలో కోర్టులు అనర్హత వేటు వేసిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. న్యాయ స్థానాల ద్వారా..స్పీకర్ నిర్ణయం తప్పని ప్రూవ్ చేస్తామన్న ధీమాలో ఉన్నారు. జ్యుడీషియల్ రివ్యూ ద్వారా జంపింగ్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడేలా పోరాడి తీరుతామంటున్నారు గులాబీ నేతలు.అయితే స్పీకర్ నిర్ణయం తీసుకునే వరకు సుప్రీంకోర్టు ప్రెజర్ పెట్టగలిగింది. ఎట్టకేలకు సభాపతి ఓ డెసిషన్ తీసుకున్నారు. కానీ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పని చెప్పే అధికారం కోర్టులకు ఉందా అన్నదే పెద్ద ప్రశ్న. లెజిస్లేటివ్ అడ్మినిస్ట్రేషన్‌లో..స్పీకర్, ఛైర్మన్ నిర్ణయమే ఫైనల్ అన్నట్లుగా ఉంటుంది. అలాంటిది ఇప్పుడు తెలంగాణ స్పీకర్ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుబడుతుందా? బీఆర్ఎస్ సబ్‌మిట్ చేసిన ప్రూఫ్స్ ఆధారంగా..వేటు వేస్తుందా? అనేది డిస్కషన్ పాయింట్‌గా మారింది.బీఆర్ఎస్ లీడర్లు మాత్రం పలు కేసుల్లో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులను గుర్తు చేస్తున్నారు. కాస్త సమయం పట్టినా జంపింగ్ ఎమ్మెల్యేలపై వేటు పడటం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. స్పీకర్ డెసిషన్‌ను తప్పుబడుతూ సుప్రీంకోర్టు వేటు వేస్తే మాత్రం దేశంలోనే సెన్సేషనల్ తీర్పు అయ్యే అవకాశం ఉంది. ఫిరాయింపు ఎమ్మెల్యేల ఎపిసోడ్‌లో దేశం మొత్తానికి తెలంగాణ ఎపిసోడ్ ఓ బెంచ్ మార్క్‌గా నిలవనుంది. కానీ సుప్రీంకోర్టు ఎలా రెస్పాండ్ కాబోతుందనేదే ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది. మరి అత్యున్నత న్యాయస్థానంలో బీఆర్ఎస్‌కు ఆశించిన తీర్పు వస్తుందా? రాదా? అనేది చూడాలి.

# కోటి రూపాయల అటెండన్స్ వివాదం

**హైదరాబాద్, మార్చి 21 :** సాధారణంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' ఆప్షన్ ఉంటుందని మనందరికీ తెలుసు. కానీ ఒక రాష్ట్రానికి ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉంటూ సభ గడప తొక్కకుండానే "అటెండెన్స్ అక్కర్లేని అసాధారణ ఉద్యోగి" గా కొత్త రికార్డు సృష్టించారు మన గులాబీ బాస్. 'రాజ్యం పోయినా రాచరికం పోలేదు' అన్న సామెతను నిజం చేస్తూ గజ్వేల్ ఫామ్ హౌస్ నుంచే ప్రజాస్వామ్యాన్ని శాసిస్తున్న తీరుపై ఇప్పుడు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు.సామాన్యుడు ఒక్క రోజు ఆఫీస్ మానేస్తే జీతంలో కోత పడుతుంది. కానీ మన ప్రతిపక్ష నేత గారికి మాత్రం ఇప్పటి వరకు అక్షరాలా రూ. 1.06 కోట్ల జీతభత్యాలు ప్రభుత్వం చెల్లించింది. సభకు వచ్చి ప్రజా సమస్యలపై గళం ఎత్తాల్సిన బాధ్యతను పక్కన పెట్టి, కేవలం అకౌంట్‌లో పడే మెసేజ్‌లకే పరిమితమైన ఈ 'రాజకీయం' చూసి సామాన్యులు నోరెళ్లబెడుతున్నారు. "కోటి రూపాయల జీతం తీసుకుంటూ కోలుకోలేని నిద్రలో ఉండటం" అంటే ఇదేనేమోనని చర్చించుకుంటున్నారు.శివప్రతాప్ శుక్లా అసెంబ్లీలో 'తెలంగాణ రైజింగ్ 2047' అంటూ భవిష్యత్ ప్రణాళికలు వివరిస్తుంటే.. ప్రధాన ప్రతిపక్షం మాత్రం "మేము రాము.. మాకు ఆ విజన్ డాక్యుమెంట్లు పట్టవు" అన్నట్లుగా వ్యవహరించింది. దీనిపై రేవంత్ సెటైర్ వేశారు. ఏఐ (ఎఐ) సునామీ రాబోతోందని గవర్నర్ చెబితే, ప్రతిపక్షం మాత్రం ఇంకా పాత రికార్డులే వేస్తోంది. కనీసం విజన్ డాక్యుమెంట్ చదివారా? అంటే.. "మాకు అధికారం పోయిన దుఃఖం చదవడానికే టైమ్ సరిపోవడం లేదు" అన్నట్లుగా ఉందని ఎద్దేవాచేశాడు.నాలుగు కోట్ల మంది ప్రజలు తమ గొంతుక వినిపిస్తారని అసెంబ్లీ వైపు చూస్తుంటే, ప్రతిపక్ష నాయకుడు మాత్రం గవర్నర్‌కు కనీసం శుభాకాంక్షలు చెప్పడానికి కూడా రాలేదు. సభకు రాకుండా జీతం తీసుకోవడం అనేది ఒక "మాయని మచ్చ" అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అంటే విధులకు హాజరు కాకుండా జీతం తీసుకునే ఈ కొత్త ట్రెండ్‌పై ఇప్పుడు స్పెషల్ క్లాస్ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అసెంబ్లీకి రాకుండా జీతం తీసుకోవడం అనేది 'కళ' అయితే.. అందులో కేసీఆర్ గారు 'ఆస్కార్' రేంజ్ పర్ఫార్మెన్స్ ఇస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెవులు కొరుక్కుంటున్నారు. మరి ఈ 'కోటి రూపాయల అటెండెన్స్' వివాదం ఎటు దారితీస్తుందో చూడాలి

# దేశంలో డిజిటల్ పేమెంట్స్ హవా.. 99.7 శాతం ఆన్‌లైన్ చెల్లింపులే




**డిజిటల్ ఇండియా**

**గత ఏడాది లావాదేవీల వివరాలను వెల్లడించిన ఆర్బీఐ**

**ఈ ఏడాది ప్రథమార్ధంలోనూ కొనసాగిన**


ముంబై,: గత ఏడాది దేశంలో జరిగిన పేమెంట్ లావాదేవీల వివరాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. 2024లో జరిగిన చెల్లింపుల్లో 99.7 శాతం లావాదేవీలు నెఫ్ట్, ఐఎంపీఎస్, ఆర్టీజీఎస్, నాచ్, డెబిట్–క్రెడిట్ కార్డులు, యూపీఐ, ఇతర ప్రీ–పెయిడ్ పేమెంట్ సాధనాల వంటి డిజిటల్ పేమెంట్ వేదికల ద్వారానే జరిగినట్టు తెలియజేసింది. మొత్తం లావాదేవీల విలువలో వీటన్నిటి వాటా 97.5 శాతంగా ఉన్నట్టు సెంట్రల్ బ్యాంక్ వివరించింది. చెక్కుల రూపంలో జరిగిన చెల్లింపుల విలువ 2.3 శాతంగా ఉన్నట్టు పేర్కొన్నది. దీంతో నగదు లావాదేవీల విలువ కేవలం 0.2 శాతానికే పరిమితమైనట్టు తేలింది.

ఈ ఏడాదిలోనూ..: అర్ధ వార్షిక పేమెంట్ సిస్టమ్ రిపోర్ట్–జూన్ 2025 పేరిట ఆర్బీఐ విడుదల చేసిన తాజా నివేదికలో ఈ ఏడాది ప్రథమార్ధం (జనవరి–జూన్)లోనూ డిజిటల్ పేమెంట్స్‌దే హవా కొనసాగినట్టు రుజువైంది. ఇక వీటిలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వాటానే 85 శాతం (10,637 కోట్లు)గా ఉండటం గమనార్హం. అయితే మొత్తం లావాదేవీల విలువలో వీటి వాటా 9శాతమే (రూ.143.3 లక్షల కోట్లు). గత ఏడాది ఇవి వరుసగా 17,221 కోట్లు, రూ.246.8 లక్షల కోట్లుగా ఉన్నాయి. 2019లో రూ.18.4 లక్షల కోట్ల విలువైన 1,079 కోట్ల లావాదేవీలు జరిగాయి. కాగా, రియల్ టైమ్ గ్రాస్ సెటిల్మెంట్ (ఆర్టీజీఎస్) సిస్టమ్ ద్వారా జరిగిన చెల్లింపుల విలువ అత్యధికంగా 69 (రూ.1,079.2 లక్షల కోట్లు) శాతంగా ఉన్నది. అయినప్పటికీ లావాదేవీల సంఖ్య 0.1 శాతం (16.1 కోట్లు)మాత్రమే. దీంతో భారీ లావాదేవీలకు ఆర్టీజీఎస్ నే అంతా ఎంచుకుంటున్నట్టు స్పష్టమవుతున్నది. చిన్న పేమెంట్స్ అన్నీ యూపీఐ ద్వారానే ఎక్కువగా జరుగుతుండటంతో సంఖ్యాప రంగా లావాదేవీల్లో ఇవే ఎక్కువగా కనిపిస్తున్నాయని ఆర్బీఐ వర్గాలు చెప్తున్నాయి. ఇదిలావుంటే నిరుడు లావాదేవీల్లో ఆర్టీజీఎస్‌వి 29.5 కోట్లుగా ఉన్నాయి. వీటివిలువ రూ.1,938.2 లక్షల కోట్లు. 2019లో ఇవి వరుసగా 14.8 కోట్లు, రూ.1,388.7 లక్షల కోట్లుగా ఉన్నాయి. నెఫ్ట్‌కు పెరిగిన ఆదరణ: 2019 నుంచి 2024 వరకు గమనిస్తే.. నెఫ్ట్ లావాదేవీలు సంఖ్యాపరంగా మూడింతలకుపైగా ఎగబాకాయి. 262.2 కోట్ల నుంచి 926.8 కోట్లకు చేరాయి. విలువ కూడా రూ.232.9 లక్షల కోట్ల నుంచి రూ.432.8 లక్షల కోట్లకు పెరిగింది. ఈ ఏడాది జనవరి–జూన్‌లో రూ.237 లక్షల కోట్ల విలువైన 490.5 కోట్ల లావాదేవీలు జరిగాయి. క్రెడిట్ కార్డు లావాదేవీలు నిరుడు 447.2 కోట్లుగా ఉన్నాయి. విలువ రూ.20.4 లక్షల కోట్లు. 2019లో ఇవి వరుసగా 208.7 కోట్లు, రూ.7.1 లక్షల కోట్లే. ఈ ఏడాది ప్రథమార్ధంలో రూ.11.1 లక్షల కోట్ల విలువైన 266.3 కోట్ల లావాదేవీలు జరిగాయి. గత ఏడాది చెక్కుల ద్వారా జరిగిన లావాదేవీల విలువ రూ.2,830 లక్షల కోట్లు. 20,849 కోట్ల లావాదేవీలు జరిగాయి. 2019లో రూ.1,775 లక్షల కోట్లుగా, 3,248 కోట్ల లావాదేవీలుగా ఉన్నాయి. 2025 జనవరి–జూన్‌లో చెక్కుల రూపంలో జరిగిన 12,549 కోట్ల లావాదేవీల విలువ రూ.1,572 లక్షల కోట్లు. 2019 పేమెంట్స్‌లో 96.7 శాతం లావాదేవీలు డిజిటల్ పేమెంట్సే. చెల్లింపుల విలువలో 95.5 శాతంగా ఉన్నాయి. 2024లో ఇవి వరుసగా 99.7 శాతంగా, 97.5 శాతంగా ఉన్నాయి. 2025 జనవరి–జూన్‌లో నమోదైన లావాదేవీల్లో 99.8% డిజిటల్ పేమెంట్సే. విలువలో వీటి వాటా 97.7 శాతం. 2019 నుంచి తగ్గుముఖం పడుతున్న డెబిట్ కార్డుల ద్వారా జరిగే లావాదే వీలు. బ్యాంకులు, ఏటీఎంలలో నగదు ఉపసంహరణలకు మాత్రమే వినియోగం. పెరుగుతున్న క్రెడిట్ కార్డు లావాదేవీలు. ఆన్‌లైన్‌లో విశేషంగా వాడుతున్న వినియోగదారులు. క్రెడిట్ కార్డు లావాదేవీల్లో కొనసాగుతున్న ప్రైవేట్ రంగ బ్యాంకుల హవా. కో–బ్రాండెడ్ ఆఫర్లతో కస్టమర్లను ఆకట్టుకుంటున్న సంస్థలు. ఈ ఏడాది జూన్ నాటికి 10 లక్షల కార్డులను జారీ చేసిన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు. అందరికీ యూటీఐ తప్పనిసరి: వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఫారిన్ కరెన్సీ డెరివేటివ్‌లు, రూపీ వడ్డీరేటు కోసం ఓవర్–ది–కౌంటర్ (ఓటీసీ) మార్కెట్లలో అన్ని లావాదేవీలకు యూనిక్ ట్రాన్సాక్షన్ ఐడెంటిఫైయర్ (యూటీఐ)ను తప్పనిసరి చేయాలని ఆర్బీఐ ప్రతిపాదించింది. ఈ మేరకు గురువారం 'యూటీఐ ఫర్ ఓటీసీ డెరివేటివ్ ట్రాన్సాక్షన్స్ ఇన్ ఇండియా'పై ఓ డ్రాఫ్ట్ సర్క్యులర్‌ను విడుదల చేసింది. ఓటీసీ డెరివేటివ్‌లు ఫైనాన్షియల్ డెరివేటివ్ కాంట్రాక్టులు. రెగ్యులేటెడ్ ఎక్స్ఛేంజీల్లో కాకుండా రెండు పార్టీల మధ్య నేరుగా ట్రేడ్ అవుతాయి. మరోవైపు నూతన సాంకేతిక పరిష్కారాల కోసం ఆర్బీఐ ఓ గ్లోబల్ హ్యాకథాన్‌ను ప్రారంభించింది.

# పైకప్పుపైనా క్యాలీఫ్లవర్



ఇంటి పెరటిలో గానీ, టెర్రస్ పైనగానీ, అపార్ట్‌మెంట్ బాల్కనీల్లో గానీ పెంచుకోవడానికి క్యాలీఫ్లవర్ అనువుగా ఉంటుంది. అనేక పోషకాలతో నిండిన ఈ కాయగూరను ఏడాదంతా తినొచ్చు. విటమిన్ సి, కెతోపాటు పొటాషియం, మాంగనీస్, ప్రొటీన్‌లు అధికంగా లభించే క్యాలీఫ్లవర్.. శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. హృదయ సంబంధిత వ్యాధులు, వివిధ రకాల క్యాన్సర్ల ప్రభావాన్నీ తగ్గిస్తుంది. ఇలాంటి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు అందించే క్యాలీఫ్లవర్‌ను ఇంటివద్దే సులభంగా పెంచేయొచ్చు. సెప్టెంబర్ –అక్టోబర్ మధ్యలో విత్తనాలు వేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. కాబట్టి, మార్కెట్లో అందుబాటులో ఉన్న క్యాలీఫ్లవర్ విత్తనాలు, మొక్కలు తెచ్చి నాటుకుంటే సరిపోతుంది. మొక్కను నాటిన 55 నుంచి 60 రోజుల్లోనే క్యాలీఫ్లవర్ తయారవుతుంది. అయితే, క్యాలీఫ్లవర్ పెరిగేందుకు సేంద్రియ పదార్థం ఎక్కువగా ఉండే మట్టి అవసరం. 6.0 నుంచి7.0 మధ్య పీహెచ్ పరిధిలో ఈ మొక్క బాగా పెరుగుతుంది. క్యాలీఫ్లవర్ పువ్వు తెల్లగా, మచ్చలు లేకుండా ఉండాలంటే.. పెరుగుతున్న పువ్వులోకి సూర్యరశ్మి చేరకుండా జాగ్రత్త పడాలి. ఇందుకోసం పువ్వు చుట్టూ ఉండే ఆకులలో చివరి వరుస ఆకులను రబ్బరు బ్యాండ్‌తో కట్టాలి. పువ్వు సరైన పరిమాణంలో పెరిగిన తర్వాత కోసుకోవాలి.



# విశాఖలో కంటైనర్ మెగా పోర్టు

## – రాష్ట్రానికి నీతిఆయోగ్ సూచన

అమరావతి : విశాఖపట్నంలో కంటైనర్ మెగా పోర్టును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ సూచించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తో నీతిఅయోగ్ సిఇఓ సుబ్రహ్మణ్యం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఈ మేరకు సూచించిచారు. తూర్పుతీరంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందున్నట్లు ఆయన చెప్పారు. కేంద్రం అమలు చేస్తున్న పూర్వోదయ పథకం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించిన ఆయన అందులో భాగంగానే విశాఖ గ్రోత్ హబ్ పైనా చర్చించారు. ఈ పథకం ద్వారా తీర ప్రాంతంలో అనేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆస్కారం ఉందన్నారు. రాష్ట్రంలో అనేక ఓడరేవులు ఉన్నప్పటికీ వాటికి అదనంగా కంటైనర్ మెగా పోర్టును ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించారు. త్వరలో జరగనున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల సమావేశంలో సమగ్రాభివృద్ధిపై చర్చ ఉంటుందని సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఇందుకోసం వినూత్న పథకాలపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చేందుకు వీలుగా నివేదికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇదే సమయంలో విశాఖ, అమరావతి, తిరుపతి గ్రోత్ కారిడార్ల ఏర్పాటు, దానివల్ల కలిగే ప్రయోజనాల పైనా సమీక్షించారు. సిఎస్ విజయానంద్ మాట్లాడు తూ విశాఖ గ్రోత్ హబ్ పనుల వేగవంతానికి ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. కేంద్రం నుంచి అవసరమైన నిధులు వచ్చేలా నీతి ఆయోగ్ సిఫార్సు చేయాలని సుబ్రహ్మణ్యంను కోరారు. తూర్పు తీరంలో ఉన్న ఆంధ్రా, ఒడిషా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో అభివృద్ధికోసం పూర్వోదయ పథకాన్ని ఏర్పాటు చేశారు. సాంస్కృతిక వారసత్వం, సహజ వనరుల ను ఉపయోగించుకోవడంద్వారా మౌలిక వసతుల ను సృష్టించుకోవడం, ఉపాధి అవకాశాలను పెంచు కోవడం, స్థిరమైన ఆర్థికాభివృద్ధిని సాధించడం ఈ పథకం లక్ష్యాలు, మౌలికాభివృద్ధిలో భాగంగా రహదారులు, వంతెనల నిర్మాణం, విమానాశ్రయాలు, ఓడరేవులు,విద్యుత్ ప్లాంట్లు వంటివి ఏర్పాటుచేస్తారు.. ఈభేటీలో నీతి ఆయోగ్ అదనపు సిఇఓ పార్థసారధిరెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్కుమార్, విద్యాశాఖ కార్యదర్శి శశిధర్, ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్చంద్, ప్రణాళికశాఖ సంయుక్త కార్యదర్శి అనంత్ శంకర్, నైపదుణ్యాభివృద్ధి సంస్థ ఎండి గణేష్కుమార్ పాల్గొన్నారు.

# ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం

హైదరాబాద్, : హైదరాబాద్ శివారులోని పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి దూలపల్లి పారిశ్రామిక వాడలో గురువారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. క్రౌన్ పాలిమర్ పరిశ్రమలో షాట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అగ్ని మాపక సిబ్బంది ఘటన స్థలం చేరుకొని మంటలను10 గంటలు శ్రమించి 5 ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. సరియైన ఫైర్ సేఫ్టీ లేకపోవడమే? ఇంతటి పెద్ద అగ్ని ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.దట్టమైన పొగలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. 5 ఫైర్ ఇంజిన్లు, ఒక రోబో మిషన్, 2 అంతస్తులకు ఫైర్ అంటుకోవడంతో మంటలు ఆర్పేందుకు ఫైర్ సిబ్బందితో పాటు డిఆర్ఎఫ్ సిబ్బంది, పేట్ బషీరా బాద్ పోలీస్ స్టేషన్ సహకారంతో మంటలు ఆదుపులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. క్రౌన్ పాలిమర్ పరిశ్రమకు సరైన ఫైర్ సేఫ్టీ లేకపోవడమే ఈ అగ్ని ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన బిల్డింగ్ స్టీల్ ప్లేస్ త్రీ ఫ్లోర్స్ ఉండడం పైప్ లైన్‌తో ఉండాల్సిన ఫైర్ సేఫ్టీ నామమాత్రపు అనుమతులతో ఈ పరిశ్రమ నడుస్తున్నట్టు సమాచారం. జీడిమెట్ల పారిశ్రామిక వాడ మరియు దూలపల్లి పారిశ్రామికవాడలో అనేక కంపెనీలలో కంపెనీకి తగ్గట్టుగా సరియైన ఫైర్ సేఫ్టీ లేకపోవడం ఇలాంటి భారీ అగ్ని ప్రమాదాలకు దారితీస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేస్తారని ఫైర్ అధికారులపై ఫైర్ అవుతున్నారు. తర్వాత వెళ్లిపోతారని పట్టించుకోరని అంటున్నారు. కొన్ని కంపెనీలకు ఫైర్ ఎన్ఓసీలు లేకుండా కూడా నడిపిస్తున్నారు. అగ్నిప్రమాదాలకు సంబంధించిన ఘటనలు అనేకంగా జరిగిన అటు అధికారులు కావచ్చు ఇటుకంపెనీ యాజమాన్యాలుకావచ్చు తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకోకపోవడమే ఈ అగ్ని ప్రమాదాలకు కారణమని స్థానికులు తెలిపారు. ఒక కంపెనీ ప్రారంభిస్తున్నారు అని అంటే కంపెనీకి సంబంధించిన ఎన్వోసీలు ప్రతి డిపార్ట్మెంట్ నుంచి ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్స్పెక్టర్ వచ్చి పరిశీలించాలి. ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు సరిగ్గా చేయకపోవడమే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం అ?తున్నాయని స్థానికులు తెలిపారు.

# సిగ్గుల మొగ్గ కావొద్దంటే!?



ఇంటికి కొత్తగా వచ్చిన బంధువులతో కొందరు పిల్లలు సరిగ్గా కలవలేరు. సిగ్గు పడుతూ.. బిడియంతో ముడుచుకు పోతారు. ఇంటి కొచ్చిన అతిథుల విషయంలోనే కాదు.. క్లాస్‌లో తోటి విద్యార్థులతోనూ సరిగ్గా కలవలేరు.దాంతో, వారి ఫ్రెండ్స్ లిస్ట్‌లో కొద్దిమందే ఉంటారు. అయితే, ఇలాంటి సమస్యను బాల్యంలోనే గుర్తించి.. వారిలో మార్పు తీసుకురావాలని నిపుణులు సూచిస్తున్నారు. లేకుంటే, పెద్దయ్యాక అంతర్ముఖులుగా తయారయ్యే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నా రు. అంతేకాదు..ఈ అలవాటుదీర్ఘకాలం లోవారిలో నమ్మకం, సామాజి క సంబంధాలపై ప్రభావం చూపుతుందనీ చెబుతున్నారు. పిల్లల్లో సిగ్గూ, బిడియం తగ్గాలంటే.. కొన్ని సలహాలు, సూచనలు పాటించా లని సూచిస్తున్నారు. పిల్లలు ఎక్కువగా సిగ్గు పడుతున్నారం టే.. ఇందుకు జన్యుపరమైన కారణాలు, గత అనుభవాలు, వ్యక్తిత్వ లక్షణా లు కారణం కావచ్చు. కాబట్టి, ముందుగా మీ పిల్లల సమస్య ఏమిటో గుర్తించండి. వేర్వేరు పరిస్థితుల్లో వారి ప్రవర్తనను గమనించండి. జన్యుపరమైన కారణాలైతే.. వైద్య నిపుణులను సంప్రదించాలి. ఇక గత అనుభవాలు, వ్యక్తిత్వ లక్షణాలతో సిగ్గుపడుతుంటే.. వారికి తగిన సూచనలు ఇవ్వండి. ఎట్టిపరిస్థితుల్లోనూ పిల్లవాడిపై 'సిగ్గరి' అనే ముద్రను వేయకండి. ఇది వారి మానసిక అభివృద్ధిని అడ్డుకుంటుంది. వారిలో నమ్మకాన్ని తగ్గిస్తుంది. పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచండి. తమపై తమకు నమ్మకం ఉన్న పిల్లలు.. సిగ్గుపడే అవకాశం తక్కువగా ఉంటుంది. మీ పిల్లల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించి.. దాన్ని ప్రోత్స హించండి. ఆటలు, చిత్రకళ, గానం.. ఇలా వారికి ఆసక్తి, సామర్థ్యం ఉన్న రంగంలో పిల్లలకు మద్దతుగా నిలవండి. తాను ప్రతిభావంతుడు, సమర్థుడినని తెలుసుకున్న పిల్లలు.. సామాజికంగా మరింత ధైర్యంగా వ్యవహరిస్తారు. పిల్లల చుట్టూ ఉండే వాతావరణం ఎప్పుడూ వారికి సురక్షితంగా అనిపించాలి. అప్పుడే, వారు ఇతరులతో కనెక్ట్ కావడానికి ఆసక్తి చూపుతారు. వాతావరణం తమకు నచ్చినట్లుగా ఉంటే.. పిల్లల్లో ఆందోళన తగ్గుతుంది. వారిలో నమ్మకాన్నీ పెంచుతుంది.

దాంతో, బిడియం తగ్గుతుంది. పిల్లలు ఇతరులతో కలిసేలా, వారితో మాట్లాడేలా ప్రోత్సహించాలి. ఇతరులతో స్నేహంగా మెలిగినప్పుడు.. పిల్లల్లో సిగ్గు, బిడియం తగ్గుతుంది. వారిలో సామాజిక నైపుణ్యాలు, నమ్మకాన్ని పెంచడానికి సహాయపడుతుంది. ఇక పిల్లలకు తప్పకుండా నేర్పించాల్సిన మరో సామాజిక నైపుణ్యం.. ఇతరులను పలకరించడం. ఇందుకు వారి మిత్రులే అవ్వాల్సిన అవసరం లేదు.

మీ స్నేహితులు, బంధువులు ఎదురుపడినా.. విష్ చేసేలా పిల్లల్ని ప్రోత్సహించాలి. పిల్లలు స్వతంత్రంగా విజయాలు సాధించడం మంచిదే! అదే సమయంలో.. సామాజికంగానూ, బృందంగానూ విజయం సాధించేలా వారికి అవకాశాలను కల్పించండి. నలుగురితో కలిసి ఆడుకోవడాన్ని ప్రోత్సహించండి.

# అందానికి ఆలుగడ్డ!



శీతాకాలం మొదలైంది. చల్లని వాతావరణంలో చర్మం కళావిహీనమవుతుంది. చలి గాలులతో చర్మం నిర్జీవంగా మారి.. ముఖం పాలిపోయినట్లు కనిపిస్తుంది. దీని నుంచి తప్పించుకోవడానికి రకరకాల క్రీములు, లోషన్లు వాడాల్సిన అవసరం లేదు. కేవలం వంటింట్లో దొరికే ఆలుగడ్డలతో.. చలిబారి నుంచి అందాన్ని కాపాడుకోవచ్చు.చర్మాన్ని కాంతివంతం చేసే గుణాలు ఆలుగడ్డలో పుష్కలం. ముఖంపై మొటిమలు, మచ్చలను తొలగించడంలో ఇది సమర్థంగా పనిచేస్తుంది. బంగాళాదుంప నుండి రసాన్ని తీసి.. ముఖానికి బాగా పట్టించాలి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా రోజూ రెగ్యులర్‌గా చేస్తుంటే.. ముఖంపై మొటిమలు, మచ్చలు పోతాయి.ఆలుగడ్డల్లో ఉండే ఎంజైమ్‌లు, విటమిన్లు సూర్యరశ్మి వల్ల దెబ్బతిన్న చర్మాన్ని బాగుచేయడంలో ముందుంటాయి. ఇవి చర్మం లోపలి నుండి పోషణను అందిస్తాయి. వాపు, నొప్పి వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి. ఆలుగడ్డను సన్నగా, గుండ్రంగా కట్‌చేసి.. సమస్య ఉన్న ప్రాంతంలో అప్లయి చేయాలి. అరగంట తర్వాత చల్లటి నీటితో కడిగేస్తే సరి. ఆలుగడ్డలను మిక్సీలో వేసి మెత్తని పేస్టుగా చేసుకోవాలి. ఆ పేస్టుని ముఖానికి రాసుకుని అరగంట తర్వాత కడిగేస్తే.. చర్మం మృదువుగా మారుతుంది. చర్మంపై జిడ్డును తొలగిస్తుంది. ఆలుగడ్డల రసానికి నిమ్మరసం, తేనె కలిపినా మంచి ఫలితం కనిపిస్తుంది. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి, పావుగంట తర్వాత కడిగేస్తే.. ముఖ ఛాయ మెరుగుపడుతుంది.నిద్రలేమి, ఇతర సమస్యలతో కళ్ల చుట్టూ నల్లటి వలయాలు ఏర్పడతాయి. ఆలుగడ్డ రసంలో మెత్తని దూదిని ముంచి.. దానిని కళ్లపైన పెట్టి, పావుగంట అలాగే ఉంచాలి. లేకుంటే, ఆలుగడ్డను సన్నని ముక్కలు (చిప్స్ మాదిరి)గా కోసి.. వాటిని కళ్లపైన ఉంచాలి. ఈ చిట్కాను రెగ్యులర్‌గా ఫాలో అయితే, మంచి ఫలితం కనిపిస్తుంది. ఆలుగడ్డ నీటితో ముఖాన్ని కడుక్కుంటే.. ముడతలు తగ్గుముఖం పడతాయి. ముఖంపై తెల్లటి మచ్చలు తొలగించడంతోపాటు ఎండకు కమిలిపోయిన చర్మాన్ని మళ్లీ మామూలు స్థితికి తీసుకొస్తుంది.

# సబీనా సిస్టర్.. కంగ్రాట్యులేషన్స్!




ప్రతిభకి వయసు అడ్డంకి కాదని ఎంతోమంది నిరూపించారు. అయితే కేరళకి చెందిన సిస్టర్ సబీనా సాధించిన ఘనత మాత్రం అందుకు భిన్నమైనది. అక్టోబరు 22న కేరళ రాష్ట్ర 'మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్' నిర్వహించారు. అందులో 55 ప్లస్ కేటగిరీలో హర్డిల్స్ పోటీ నిర్వహించారు. ఆ పోటీలో 57 ఏళ్ల సబీనా కూడా ఉన్నారు. పోటీ ప్రారంభమైంది. కాళ్లకి చెప్పులు లేకుండా, సాంప్రదాయ దుస్తులు ధరించిన సిస్టర్ సబీనా ఎంతో వేగంగా హర్డిల్స్‌ని దాటుకుంటూ గమ్యాన్ని చేరారు. పోటీలో ప్రథమంగా నిలిచారు. బంగారు పతకం సాధించిన సబీనా ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పిఇటిగా త్వరలో రిటైర్ అవుతున్న ఆమె సాధించిన ఈ ప్రతిభ అటు విద్యార్థులని, ఇటు సాధారణ ప్రజలని కూడా ప్రభావితం చేస్తోంది.

కాసర్‌గడ్ జిల్లా ఎన్నప్ర గ్రామం సబీనా సొంత ఊరు. వయనాడ్ ద్వారకాలో అప్పర్ ప్రైమరీ స్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా 1993 నుండి విధులు నిర్వహిస్తున్నారు. బాల్యం నుండీ సబీనాకి ఆటలంటే ఆసక్తి. 9వ తరగతి నుండి క్రీడల్లో రాణించిన ఆమె, కాలేజీ స్థాయిలో పలు పోటీల్లో పాల్గొన్నారు. జాతీయస్థాయిలో హర్డిల్స్ ఆడిన అనుభవం ఆమెది. అయితే ఆ తరువాత బోధనపై దృష్టి పెట్టి క్రీడలని దూరంపెట్టారు. ఇది నా చివరి ఆట..: తాజాగా సాధించిన ఘనత గురించి సబీనా ఇలాచెబుతున్నారు 'ఇది నా చివరి ఆట. వచ్చేమార్చిలో నేను రిటైర్ అవుతున్నాను. రిటైర్ అయ్యేలోపు ఒక్కసారైనా పోటీలో పాల్గొనాలని అనుకున్నాను. అందుకే ఈ 'స్పోర్ట్స్ మీట్'కి వచ్చాను' అని అన్నారు. సబీనా పోటీలో గెలిచినప్పుడు 'సబీనా సిస్టర్ కంగ్రాట్యులేషన్స్' అంటూ ప్రేక్షకులు అభినందనలతో ఆమెని చుట్టుముట్టారు. సబీనా విజయం కేవలం పోటీలో పాల్గొనడం వరకే పరిమితం కాదు. వ్యక్తిలో దాగున్న సామర్థ్యాన్ని వెలికితీయడానికి వయసు, ఆచారాలు అడ్డంకి కాదని మరోసారి రుజువైంది.

# ఏపీలో ఆల్ ఇన్ వన్ యాప్

ఒంగోలు: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా బిల్లు చెల్లింపులు, కొత్త కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవడం సులభం కానుంది. అంతేకాకుండా.. ఇంట్లో ఉండే ఎలక్ట్రానిక్ ఉపకరణాలు ఎంత కరెంటు ఉపయోగిస్తున్నాయో ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ఏమైనా సందేహాలు ఉంటే అధికారులతో నేరుగా సంప్రదించే అవకాశం ఈ యాప్ ద్వారా కల్పించారు. కాగా ఇటీవల, విద్యుత్ సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ అధికారులను హెచ్చరించారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరికొత్త సాంకేతికతను ఉపయోగిస్తోంది. వినియోగదారుల సమస్యలను మరింత వేగంగా, సమర్థంగా పరిష్కరించడానికి ఏపీఎస్పీడీసీఎల్ యాప్‌లో ప్రత్యేక ఫీచర్లు అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌ను ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో.. ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిద్వారా వచ్చిన సమస్యలను విద్యుత్తు శాఖ అధికారులు పరిశీలిస్తారు. అనంతరం వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తారు యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు సులభంగా చెల్లించొచ్చు. బిల్‌పే అనే ఆప్షన్ ద్వారా సర్వీసు నంబరు, మొబైల్ నంబర్ ఎంటర్ చేస్తే.. వినియోగదారులు వాడిన యూనిట్లు.. చెల్లించాల్సిన నగదు.. బిల్ లెడ్జర్ వివరాలు ప్రత్యక్షమవు తాయి. అనంతరం పేమెంట్ చేయాల్సి ఉంటుంది. ఇక కొత్త విద్యుత్ కనెక్షన్ కోసం అప్లికేషన్ కూడా చేసుకోవచ్చు. అందుకోసం అన్ని వివరాలను యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తును అధికారులు పరిశీలించి కొత్త కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటారు. కాగా, ఇంట్లో ఏయే ఎలక్ట్రానిక్ పరికరాలు ఎంత విద్యుత్తు వినియోగిస్తున్నాయో.. ఈ యాప్‌లో ఉన్న ఎనర్జీ కాలిక్యులేటర్ ద్వారా తెలుసుకోవచ్చు. నెలవారీ విద్యుత్తు మీటరు రీడింగ్ వివరాలు ఎంటర్ చేస్తే.. ఆ సమాచారం కనిపిస్తుంది. అంతేకాకుండా, కరెంట్ ఆదా చేయడానికి కూడా ఈ యాప్‌లో సలహాలు, సూచనలు ఉంటాయి. విద్యుత్ అధికారుతో కూడా నేరుగా మాట్లాడి సమస్యలు తెలిపే వెసులుబాటు ఈ యాప్‌లో ఉంది. సూపర్ యాప్ ద్వారా కస్టమర్ సేవలు కూడా అందిస్తోంది ఏపీఎస్పీడీసీఎల్. వినియోగదారులు తమ సమస్యలనుఈ యాప్‌లో పొందుపరచొచ్చు. విద్యుత్తు శాఖ అంది స్తున్న సేవలపై ఫీడ్‌బ్యాక్ కూడా ఇవ్వొచ్చు. సంతృప్తి లేదా అసంతృప్తి తెలియజే యొచ్చు.




## ఖరీదైన ఖర్చు తగ్గింపు..

# ఉద్యోగుల తొలగింపునకు ఐటీ కంపెనీల భారీ ఖర్చు!

న్యూఢిల్లీ: ప్రపంచ ఐటీ దిగ్గజాలు తమ ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవడానికి లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. భారీ సెవెరెన్స్ ప్యాకేజీల నుంచి అవుట్ ప్లేస్‌మెంట్ సపోర్ట్ వరకు ఉద్యోగుల తొలగింపు చర్యలు కార్పొరేట్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన 'ఖర్చు తగ్గింపు' ప్రక్రియలుగా మారాయి. అయితే, ఈ చర్య వెనుక ఒక పద్ధతి ఉందని, దీనికి బ్రాండ్ రక్షణ, పెట్టుబడిదారుల విశ్వాసం వంటి ఆర్థికాంశాలు ముడిపడి ఉన్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. వారి అభిప్రాయం ప్రకారం కంపెనీలు దీర్ఘకాలికంగా ఖర్చులను కొనసాగించే బదులు, ప్రస్తుతం ఒకేసారి ఆర్థిక భారాన్ని స్వీకరించడానికి మొగ్గు చూపుతున్నాయి. 'ఎంబ్రేస్ కన్సల్టింగ్' వ్యవస్థాపకురాలు శ్రుతి స్వరూప్ ఈ వ్యూహాన్ని వివరించారు. సెవెరెన్స్ అనేది చిన్నదే అయినా, అది న్యాయపరమైన సమస్యలను నివారిస్తుంది, ఎంప్లాయర్ బ్రాండ్‌ను కాపాడుతుంది, ఉద్యోగుల బదిలీని వేగవంతం చేస్తుంది అని ఆమె తెలిపారు. అలాగే, ప్రస్తుత ఖర్చులను భరించడం ద్వారా భవిష్యత్తులో జీతాల భారం తగ్గి, సమర్థవంతమైన వ్యయ నిర్మాణాన్ని సాధించవచ్చు. ఇది కంపెనీలకు దీర్ఘకాలికంగా ప్రయోజనకరం. ఈ ఉదారతకు కారణం కేవలం దయ కాదు, రిస్క్ మేనేజ్‌మెంట్ అని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యంగా టెక్ రంగంలో ప్రతిష్ఠ చాలా కీలకం కాబట్టి, ప్రతికూల ప్రచారం, బ్రాండ్ డ్యామేజ్‌ను తగ్గించుకోవడానికి కంపెనీలు భారీ ఎగ్జిట్ ప్యాకేజీలను అందిస్తున్నాయి.

ఏఐ యుగంలో 'వ్యూహాత్మక పెట్టుబడి': తొలగింపుల తాజా వేగం కేవలం ఖర్చులను తగ్గించుకోవడం కోసం మాత్రమే కాదని, ఏఐ(కృత్రిమ మేధస్సు)ని లోతుగా అనుసంధానించడం ద్వారా శ్రామికశక్తిని క్రమబద్ధీకరించడం దీని వెనుక ముఖ్య ఉద్దేశం అని గ్రేట్‌లేక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విభవ్‌సింగ్ పేర్కొన్నారు. ఏఐ ద్వారా చేపట్టే పనుల నుంచి ఉద్యోగులను తొలగించి, ఇతర విభాగాల్లో పెట్టుబడి పెట్టడానికి ఈ సెవెరెన్స్ ప్యాకేజీలు పరివర్తన వ్యయంగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఇటువంటి బైఅవుట్లు మార్కెట్‌ను భయపెట్టకుండా, టాలెంట్ బేస్‌ను పునర్నిర్మించడానికి, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని నిలబెట్టడానికి సహాయపడతాయి.

భారత ఐటీలోనూ ఇదే ట్రెండ్: ఈ ధోరణి ఇప్పుడు భారతదేశంలోని ఐటీ సేవల రంగంలోనూ స్పష్టంగా కనిపిస్తోంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఇటీవలే ఏఐ ఆధారిత పునర్నిర్మాణంలో భాగంగా 20,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్టు నివేదించింది. దీనికి సెవెరెన్స్, సంబంధిత ఖర్చుల కోసం సుమారు రూ.1,135 కోట్ల తాత్కాలిక ఆర్థిక ప్రభావాన్ని అంచనా వేసింది. ఇందులో 3 నెలల నోటీస్ పే, 6 నెలల నుంచి 2 సంవత్సరాల జీతం వరకు సెవెరెన్స్ ప్యాకేజీలు ఉన్నాయి. యాక్సెంచర్ గత మూడేళ్లలో సెవెరెన్స్ కోసం 2 బిలియన్లకు పైగా ఖర్చు చేసింది. ఆటోమేషన్-హెవీ డెలివరీ మోడల్స్‌కు మారడంలో ఇది ఒక నిర్మాణపరమైన చర్యగా కంపెనీ అభివర్ణించింది. ఉద్యోగుల తొలగింపు సమయంలో
వారికి మర్యాదపూర్వకమైన, సరసమైన ప్యాకేజీలను అందించడం ద్వారా, కంపెనీలు కొత్త ఉద్యోగులను ఆకర్షించడానికి, క్లయింట్ నమ్మకాన్ని కాపాడుకోవడానికి అవసరమైన తమ ఎంప్లాయర్ బ్రాండింగ్‌ను రక్షించుకుంటాయి. ఈబిలియన్ డాలర్ల సెవెరెన్స్ బిల్లులు దయతో కూడిన చర్యలు కాదని, ఇవి వ్యూహాత్మక పెట్టుబడులు అని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# వర్క్ పర్మిట్ ఆటోమేటిక్ పొడిగింపు రద్దు చేసిన అమెరికా




వాషింగ్టన్:హెచ్1బి వీసా ఫీజును భారీగా పెంచిన కొన్ని వారా ల్లోనే.. అమెరికా విదేశీ వలసదారులపై మరో కఠినమైన నిర్ణయం తీసుకుంది. విదేశీయులకు అవసరమైన ఉపాధి అధికార పత్రాలు- వర్క్ పర్మిట్లు (ఇఎడి)ఆటోమేటిక్ పొడిగింపును రద్దు చేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఇదిపెద్ద సంఖ్యలో ఉన్న భారతీయ వలసదారులు మరియు కార్మికులపై తీవ్రంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. వలసలను అరికట్టే తాజా ప్రయత్నాలలో భాగంగా ..వారి ఉపాధి అధికారాలు లేదా వర్క్ పర్మిట్లు అనుమతుల చెల్లు బాటును పొడిగించే ముందు "ఏలియన్స్ (విదేశీయులు) సరిగా పరీక్షించడం మరియు తనిఖీ చేయడం" ప్రాధాన్యతగా తీసుకున్నట్లు యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీస్ (డిహెచ్ఎస్) బుధవారం ప్రకటన విడుదల చేసింది. తాజా నిబంధనల ప్రకారం.. 2025ఆ తర్వాత తమ ఇఎడిని పునరుద్ధరించడాని కి దాఖలు చేసే విదేశీయులకు ఇకపై ఆటోమేటిక్ పొడిగింపు లభించదని డిహెచ్ఎస్ ఆప్రకటనలో తెలిపింది. ఒక ఏలియన్ ఉద్యోగ అధికారం లేదా డాక్యుమెంటేషన్ పొడిగించబడే ముందు తగిన పరిశీలన మరియు స్క్రీనింగ్ పూర్తయిందని నిర్ధారించుకోవడం సాధారణ చర్య. అయితే అమెరికాలో పనిచేయడం అనేది ఒక హక్కుకాదు, ఒక అవకాశం అని ఏలియన్స్ గుర్తుంచుకోవాలని యుఎస్‌సిఐఎస్ డైరెక్టర్ జోసెఫ్ ఎడ్లో తెలిపారు. దీంతో అమెరికాలో పనిచేయడానికి ఉపాధి అనుమతి కోసం దరఖాస్తు చేసుకునే విదేశీయులను తరచుగా తనిఖీ చేయాల్సి వుంటుంది. ఈ నిర్ణయంతో హెచ్1బి,ఎల్, ఇ వీసాదారుల భాగస్వాములు, శరణార్థి లేదా శరణార్థి హోదా కలిగిన విదేశీయులపై తీవ్ర ప్రభావం పడనుంది. తాజా నిబంధనల ప్రకారం.. వర్క్‌పర్మిట్ల గడువు ముగియడానికి 180 రోజుల ముందే రెన్యువల్ కోసం దరఖాస్తులు సమర్పించాలని డిహెచ్ఎస్ విదేశీయు లకు సూచించింది.

ఆ తర్వాతనుంచి వర్క్ పర్మిట్లను పునరుద్ధరించేందుకు దరఖాస్తు చేసుకునే వలసదారులకు ఇకపై ఆటోమేటిక్ రెన్యువల్ ఉండదని తెలిపింది.అయి తే ఈ తేదీ కంటే ముందు వర్క్ పర్మిట్లను పొడిగించుకున్న వారిపై ఎలాంటి ప్రభావం ఉండదని డిహెచ్ఎస్ ప్రకటించింది. బైడెన్ ప్రభుత్వ హయాంలోపాత నిబంధనల ప్రకారం వర్క్ పర్మిట్లను పునరుద్ధరించ డానికి సకాలంలో ఫారమ్ 1-765ని దాఖలు చేసే విదేశీయులు 540 రోజుల ఆటోమేటిక్ పొడిగింపు ను పొందేవారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో అమెరికా అధ్యక్షుడు హెచ్1బి వీసాల ఫీజును పెంచుతూ ఒక ప్రకటనపై సంతకం చేసిన సంగతి తెలిసిందే.అమెరికా సెన్సస్ డేటా ప్రకారం.. అమెరికాలో సుమారు 4.8మిలియన్ల (48లక్షల మంది) భారతీయ అమెరికన్లు నివసిస్తున్నారు. ఇందులో 66శాతం మంది భారతీయ అమెరికన్లు వలసదారులు కాగా, 34 శాతం మంది అమెరికాలో జన్మించిన వారు.

# ఏపీలో కొత్త పొత్తులు

విజయవాడ, : ఏపీలో కమ్యూనిస్టులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో జత కడతారా? అందుకు జగన్మోహన్ రెడ్డి సిద్ధంగా ఉన్నారా? రెండువైపుల నుంచి చర్చలు మొదలయ్యాయా? రెండు వైపులా ఇది ఆవశ్యమా? పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఏపీలో కూటమి ప్రభుత్వం ఉంది. ఎన్డీఏలో తెలుగుదేశంతో పాటు జనసేన భాగస్వామ్య పక్షాలు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో బిజెపి ఉంది. వైసిపి ఒంటరి పోరాటం చేస్తోంది. జాతీయస్థాయిలో ఇండియా కూటమి లో కాంగ్రెస్ తో పాటు వామపక్షాలు ఉన్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో తటస్థ వైఖరి అనుసరిస్తోంది. కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకించి బిజెపి విషయంలో సానుకూలంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో ఒంటరి పోరాటం కంటే వామపక్షాలతో పొత్తు పెట్టుకోవడమే మేలన్న నిర్ణయానికి జగన్ వచ్చినట్లు ప్రచారం నడుస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా సిపిఎం జగన్ విషయంలో సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. సిపిఎం ప్రధాన కార్యదర్శిగా ఉన్న మధు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేత. ఆయన అసలు పేరు మధుసూదన్ రెడ్డి గా తెలుస్తోంది. జగన్మోహన్ రెడ్డికి బంధువు అవుతారని కూడా ప్రచారంలో ఉంది. జగన్మోహన్ రెడ్డి సీఎం గా ఉన్న సమయంలో మధు అనారోగ్యానికి గురైతే పరామర్శించారు. అటు తరువాత సిపిఎం అనుబంధ పత్రికకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున భారీగా ప్రకటనలు కూడా వచ్చాయి. దీంతో గత పదేళ్లుగా జగన్ విషయంలో సిపిఎం పెద్దగా సౌండ్ చేయలేదు. కానీ సిపిఐ మాత్రం గత ఐదేళ్లలో జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా గట్టిగానే స్టేట్మెంట్లు ఇచ్చిందిమారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో జగన్ పొత్తుల విషయంలో పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఒంటరి పోరాటం చేయడం సాహసమే. అందుకే వామపక్షాలతో పొత్తు పెట్టుకోవడం మేలన్న నిర్ణయానికి జగన్ వచ్చినట్లు తెలుస్తోంది. తాజాగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా కడప జిల్లాకు చెందిన ఈశ్వరయ్య ఎంపికయ్యారు. దీని వెనుక పొత్తు స్నేహం ఉన్నట్టు ప్రచారం సాగు తోంది. అయితే బిజెపికి జగన్ సానుకూలంగా ఉంటారు. ఇండియా కూటమికి వ్యతిరేకంగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకిస్తున్నారు. అలాగే చంద్రబాబు పట్ల వామపక్షాలకు ఆ స్థాయిలో వ్యతిరేకతలేదు. కానీ ఇప్పుడు ఏపీలో రాజకీయ ఉనికి చాటుకోక తప్పదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ కంటే ఏపీలో వైసీపీ బలంగా ఉంది. అందుకే ఆ పార్టీతో స్నేహం కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నాయి వామపక్షాలు.ఇప్పటివరకు ఒంటరి పోరాటం అన్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నినాదం. దమ్ముంటే ఒంటరిగా పోటీకి రండి అంటూ టిడిపి తో పాటు జనసేనకు సవాల్ విసురుతూ వస్తోంది వైసిపి. 2014, 2019 ఎన్నికల్లో ఇదే వామపక్షాలు ఉన్న జగన్ పట్టించు కోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వామపక్షాల ఉద్యమాన్ని అణచివేశారు జగన్. అడుగడుగునా వారిని అవమానించారు. అటువంటి వామపక్షాలు ఇప్పుడు జగన్తో జతకలుస్తాయి అన్నది అనుమానమే. అయితే ఇప్పుడు పొత్తు ఇరువర్గాలకు అనివార్యం. ఆపై కూటమి ప్రభుత్వం బలంగా ఉంది. అందుకే ఇప్పుడు ఆ రెండు పక్షాలు కలుస్తాయని ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# సొంత జిల్లాపై ఫుల్ ఫోకస్..!

తిరుపతి, : మ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు అంతర్గత సంక్షోభంలో కూరుకుపోయాయి. అధికారంలోకి వచ్చి నెలలు గడిచినా, స్థానిక నాయకత్వం కొరవడడం, ముఖ్యంగా ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించడం పార్టీ క్యాడర్‌ను కలవరానికి గురిచేస్తోంది. తంబళ్లపల్లి, తిరుపతి, సత్యవేడు, పుంగనూరు? ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ ఇన్‌ఛార్జ్‌ల పనితీరుపై క్యాడర్ తీవ్ర అసంతృప్తితో ఉందట. అధికారం ఉన్నా తమను తాము రక్షించుకోలేని స్థితిలో ఉన్నామంటూ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. ఈ నేపథ్యంలో జిల్లాలో పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు అధినేత చంద్రబాబు ఏ మేరకు కఠిన నిర్ణయాలు తీసుకుంటారనే దానిపైనే ఉమ్మడి చిత్తూరు భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఇన్‌ఛార్జ్‌ల నియామకం, పనితీరపై అసంతృప్తి:. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ క్షేత్రస్థాయిలో తీవ్రమైన నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ఇన్‌ఛార్జ్‌ల నియామకం, వారి పనితీరుపై పార్టీ క్యాడర్ తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నదట. నాలుగు కీలక నియోజకవర్గాల్లో పరిస్థితి 'చుక్కాని లేని నావ' వలె మారిందట. ఈ సంక్షోభానికి ప్రధాన కారణం, ఇతర పార్టీల నుంచి అరువు తెచ్చుకున్న నేతలకు కీలక పదవులు ఇవ్వడం, వారు లోకల్ నాయకులను విస్మరించి, తమ సొంత కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వడమేనని క్యాడర్ ఆరోపిస్తోంది. శంకర్ యాదవ్, దొరస్వామి నాయుడు ప్రయత్నాలు:. తంబళ్లపల్లి నియోజకవర్గంలో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. గత ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరి టికెట్ పొందిన జయచంద్రారెడ్డి ఇటీవలే నకిలీ మద్యం వ్యవహారంలో చిక్కుకోవడంతో పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. ఆయన పార్టీలో చేరిన సమయంలోనే స్థానిక క్యాడర్ తీవ్రంగా వ్యతిరేకించినా, కడప జిల్లాకు చెందిన కొందరు నేతల సహకారంతో టికెట్ సంపాదించారట. గత 16 నెలలుగా ఆయన పార్టీ శ్రేణులను అనేక ఇబ్బందులకు గురిచేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జ్ నియామకం కంటే, సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని స్థానిక క్యాడర్ పట్టుబడుతోందట. మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ కుమార్ రెడ్డి తిరిగి వస్తారని ప్రచారం జరుగుతున్నా, గతంలో ఆయన చంద్రబాబుపై చేసిన విమర్శల కారణంగా టీడీపీ కార్యకర్తలు అంతగా ఇంట్రెస్ట్ చూపట్లేదట. మరోవైపు, శంకర్ యాదవ్, తెలుగు యువత నాయకుడు కట్టా దొరస్వామి నాయుడు ఇన్‌ఛార్జ్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తుండగా, క్యాడర్ మాత్రం ద్విసభ్య కమిటీ ఏర్పాటు చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు వెళ్లాలని కోరుకుంటోందట. త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్:. తిరుపతి నియోజకవర్గంలో కూడా ఇదే విధమైన నాయకత్వ శూన్యత నెలకొని ఉందట. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఇన్‌ఛార్జిగా ఉన్నప్పటికీ, ఆమెకు సహకరించే నాయకత్వం లేకపోవడంతో ఆమె ప్రయత్నాలు ఫలించడం లేదు. చాలామంది నాయకులు ఇన్‌ఛార్జ్ పదవి కోసం ప్రయత్నించి, ఆశలు వదులుకుని సైలెంట్ అయ్యారు. ఇక్కడ జనసేన ఎమ్మెల్యే ఉండటం, అధిక సంఖ్యలో వైసీపీ నుంచి వచ్చిన కార్పొరేటర్లు జనసేన వైపు మొగ్గు చూపడం పార్టీని బలహీనపరుస్తోంది. దీనికి తోడు, నగర పాలక సంస్థలో అవినీతి, దందాలు పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు అల్లాడుతున్నారు, ఫలితంగా టీడీపీ క్యాడర్ తీవ్రమైన మానసిక క్షోభకు లోనవుతోందట. ఈ పరిస్థితుల దృష్ట్యా, క్యాడర్ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోందట. జె.బి. శ్రీనివాస్, మబ్బు నారాయణ రెడ్డి, దంపూరి భాస్కర్ యాదవ్ లతో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తే మూడు బలమైన సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం లభించి, పార్టీ బలోపేతం అవుతుందని వారి అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ ఇన్‌ఛార్జ్‌ల నియామకంలో కూడా బలహీనులను పెట్టారనే విమర్శలున్నాయి. సత్యవేడులో కన్వీనర్‌గా శ్రీపతి బాబు తొలగింపు: సత్యవేడులో పరిస్థితి మరింత విచిత్రంగా ఉంది. ఎన్నికల ముందు వైసీపీ నుంచి వచ్చి, అందరి వ్యతిరేకత మధ్య విజయం సాధించిన సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలం తర్వాత జరిగిన పరిణామాలతో ఇరుక్కుపోయారు. ముఖ్యంగా గ్రావెల్ మాఫియా చేసిన కుట్ర, ఓ మహిళా టీడీపీ నాయకురాలితో ఆయన వీడియో బయటకి రావడం వంటి వాటితో పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత శ్రీపతి బాబును కన్వీనర్‌గా నియమించినప్పటికీ, అధిష్టానం ఆయన్ను తొలగించి కాంట్రాక్టర్ శంకర్ రెడ్డిని ప్రోగ్రామ్ కన్వీనర్‌గా నియమించింది.. ఆయనే ఇన్‌ఛార్జిగా చెప్పుకుంటున్నారు. శంకర్ రెడ్డి పార్టీలో చేరిన వెంటనే తన సామాజిక వర్గాన్ని మొత్తం పార్టీలోకి చేర్చి, వారికి అన్ని వ్యవహారాలు అప్పగించడంతో స్థానిక టీడీపీ క్యాడర్ తీవ్ర స్థాయిలో అగ్రహం వ్యక్తం చేస్తోంది. తాజాగా, ఓ దేవాలయం ధర్మకర్తల నియామకంలో వివాదస్పద మాజీ టీటీడీ బోర్డు మెంబర్ శేఖర్ రెడ్డి అనుచరుడికి అవకాశం కల్పించడం, అనేక కేసులు ఉన్న వ్యక్తిని చైర్మన్‌గా నియమించడం మరింత వివాదాన్ని రేపింది. ఇక్కడ కూడా తంబళ్లపల్లి మాదిరిగానే భవిష్యత్తులో పార్టీకి నష్టం చేకూర్చవచ్చని క్యాడర్ ఆందోళన చెందుతోంది. కోల్డ్ స్టోరేజ్‌లో పార్లమెంటరీ అధ్యక్షుల నియామకం:. ప్రతిష్టాత్మకమైన పుంగనూరు నియోజకవర్గం లోనూ ఇదే సమస్య తలెత్తింది. ఇన్‌ఛార్జ్ అయిన చల్లా బాబు రెడ్డి చుట్టూ ఉన్న కోటరీతో స్థానిక కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో పార్టీ కోసం నష్టపోయిన, జైళ్లకు వెళ్లిన కార్యకర్తలను ఏమాత్రం పట్టించుకోకుండా, ఆయన కోటరీ తమను ఇబ్బంది పెడుతోందని, ముఖ్యంగా వైసీపీలో తమపై దాడులు చేసిన వారికి అండగా నిలుస్తోందని ఆరోపణలు వచ్చాయి. గతంలో రామకృష్ణ అనే టీడీపీ కార్యకర్త హత్యను కూడా దీనికి నిదర్శనంగా చూపుతున్నారు. అధికారం చేతికి వచ్చినా, కార్యకర్తలు తమ అధికార దర్పం చూపించుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని తెలుస్తోంది. పార్లమెంటరీ అధ్యక్షుల నియామకం కూడా కోల్డ్ స్టోరేజ్‌లో ఉండిపోయింది. మొత్తం మీద, ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి మంత్రి ప్రాతినిధ్యం లేకపోవడం, సీనియర్ నాయకులు పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడం వంటి పరిస్థితుల్లో, కొత్త ఇన్‌ఛార్జ్‌లు, అధ్యక్షుల నియామకం తర్వాత అయినా తమను పట్టించుకునే వారు ఉంటారని కార్యకర్తలు ఆశగా ఎదురుచూస్తున్నారు

# రేవంత్ వ్యూహాల ముందు... కేటీఆర్ ఆత్మరక్షణ



**హైదరాబాద్, మార్చి 21 :** తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చ, అధికార కాంగ్రెస్ , ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఒక రసవత్తర యుద్ధానికి వేదికైంది. అయితే, ఈ పోరులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో విరుచుకుపడుతూ బీఆర్ఎస్ శ్రేణులను ఆత్మరక్షణలో పడేశారు. ముఖ్యంగా కేటీఆర్ వంటి వారు ఉన్నప్పటికీ, రేవంత్ రెడ్డిని ధీటుగా ఎదుర్కోవడంలో బీఆర్ఎస్ విఫలమైంది. రేవంత్ రెడ్డి అటు రాజకీయ విమర్శలతో పాటు, ఇటు పాలనాపరమైన అంశాలను కూడా ప్రస్తావిస్తూ గులాబీ పార్టీని ఇరకాటంలో పెట్టారు. ఈ చర్చలో కేటీఆర్ ప్రసంగం అంతా పాత ఆరోపణల చుట్టూనే తిరిగింది. ఆరు గ్యారెంటీల అమలు, రుణమాఫీ వంటి అంశాలపై ఆయన చేసిన విమర్శలను మంత్రులు అప్పటికప్పుడు తిప్పికొట్టారు. ముగిసిన అధ్యాయం లాంటి అంశాలను మళ్ళీ మళ్ళీ ప్రస్తావించడం వల్ల ప్రజల్లోకి వెళ్లాల్సిన గట్టి సందేశం పలచబారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు, రేవంత్ రెడ్డి అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని లోపాలను ఎండగడుతూనే, తమ ప్రభుత్వం భవిష్యత్తులో చేయబోయే పనులపై తెలంగాణ రైజింగ్-2047 వంటి విజన్ డాక్యుమెంట్లను ప్రస్తావించి సభను తన వైపు తిప్పుకున్నారు. ముఖ్యంగా మూసీ పునరుజ్జీవనంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను రేవంత్ రెడ్డి అత్యంత చాకచక్యంగా తిప్పికొట్టారు. గతంలో కేసీఆర్, కేటీఆర్ మూసీ నదిపై చేసిన వ్యాఖ్యల తాలూకు వీడియోలను సభలో ప్రదర్శించి, వారి ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. అక్రమ కట్టడాలను బుల్డోజర్లతో కూల్చాలని అప్పుడు చెప్పింది మీరు కాదా అని రేవంత్ ప్రశ్నించినప్పుడు, బీఆర్ఎస్ సభ్యుల దగ్గర సరైన సమాధానం లేకపోయింది. కేటీఆర్ కేవలం సోషల్ మీడియా వేదికగా చేసే విమర్శలను సభలోనూ పునరావృతం చేయడం వల్ల, రేవంత్ వేసిన ప్రత్యూహాల ముందు అవి నిలబడలేకపోయాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేటీఆర్ ఎప్పటిలాగే తక్కువ అంచనా వేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని భావిస్తున్నారు. రేవంత్ రెడ్డి కేవలం వాక్చాతుర్యంతోనే కాకుండా, గణాంకాలు పాత రికార్డులతో సిద్ధమై రావడంతో బీఆర్ఎస్ శిబిరంలో గందరగోళం నెలకొంది. పైగా, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ సభకు హాజరు కాకపోవడాన్ని రేవంత్ తీవ్రంగా తప్పుబట్టారు. రూ. 1.06 కోట్ల జీతభత్యాలు తీసుకుంటూ సభకు రాకపోవడంపై ఆయన చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారాయి. రాజకీయంగా రేవంత్ రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి, మరోసారి గెలిచి చూపిస్తాం అని విసిరిన సవాల్ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. అసెంబ్లీలో చర్చా సమయం ఎక్కువ తీసుకున్నప్పటికీ, ప్రజలకు కనెక్ట్ అయ్యేలా మాట్లాడటంలో రేవంత్ రెడ్డి సక్సెస్ అయ్యారు. కానీ, బీఆర్ఎస్ తరపున మాట్లాడిన నాయకులు కేవలం పాత చింతకాయ పచ్చడి లాంటి విమర్శలకే పరిమితం కావడంతో, అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డిని కట్టడి చేసే అవకాశం చేజారిపోయింది. రాబోయే రోజుల్లో అయినా కేటీఆర్ తన వ్యూహాన్ని మార్చుకోకపోతే, అసెంబ్లీలో రేవంత్ రెడ్డిని ఢీకొట్టడం కష్టమేనని స్పష్టమవుతోంది.

# చక్రం తిప్పుతున్న కరీంనగర్ నేతలు

కరీంనగర్, మార్చి 21 : కరీంనగర్ అంటేనే ఉద్యమాల గడ్డ. నాడు భూస్వాములపై తిరుగుబాటు చేసినా.. తర్వాత రజాకార్లపై తిరగబడినా.. తొలితరం తెలంగాణ ఉద్యమమైనా? మలిదశ తెలంగాణ పోరాటమైనా.. జగిత్యాల జైత్రయాత్ర అయినా.. నక్సల్ ఉద్యమమైనా.. తర్వాత జరిగిన మావోయిస్టు ఉద్యమమైనా కరీనంగర్ వాసులు ఉండాల్సిందే. తాజాగా రాజకీయాల్లోనూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలు రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకుంటున్నారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. కేంద్రం, రాష్ట్ర స్థాయిలో జిల్లా నేతలకు కీలక పదవులు దక్కాయి.. దక్కుతున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలలో ఈ ప్రాంతం ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. కరీంనగర్ నుంచి బండి సంజయ్ కేంద్ర మంత్రిగా ఉన్నారు. కీలకమైన హోంశాఖ సహాయ మంత్రిగా మోదీ 3.0 క్యాబినెట్‌లో స్థానం దక్కించుకున్నారు. తెలంగాణలో పార్టీని బలోపేతం చేసినందుకు ఆయనకు దక్కిన గుర్తింపు, గౌరవంగా చెప్పొచ్చు. ఇక తెలంగాణలో 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత జిల్లాకు మూడు మంత్రి పదవులు దక్కాయి. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కీలకమైన ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్నారు. పొన్నం ప్రభాకర్ బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రిగా, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సాంక్షిక సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు. ఇక అధికాక కాంగ్రెస్‌కు చెందిన వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు విప్ పదవి దక్కింది. తన పదవికి తగినట్లుగా ఆయన కార్యదక్షత చూపుతున్నారు. తాజాగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను కూడా విప్ పదవులు వరించాయి. దీంతో అసెంబ్లీలో కరీంనగర్ శక్తి మరింత పెరిగింది. ఇక మానకొండూర్ ఎమ్మెల్యే కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. ఇక బీఆర్ఎస్‌లో కేటీఆర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బీజేపీలో కీలక నాయకుడిగా ఉన్నారు. ఈ పదవులు మూడు పార్టీల్లో కరీనంగర్ జిల్లా బలాన్ని నిరూపిస్తున్నాయి. కరీంనగర్ ప్రాంతం రాజకీయంగా చురుకైన మట్టి కలిగి ఉంది. స్థానిక నాయకులు పార్టీలకు అంకితమై, గ్రామీణ?పట్టణ ప్రజల మద్దతుతో ఎదిగారు. బండి సంజయ్‌కు యువతలో మంచి పట్టు ఉంది. కేటీఆర్ టెక్నాలజీలో యువ ఉద్యోగులను ఆకట్టుకుంటున్నారు. ఈ ట్రెండ్ రాష్ట్ర రాజకీయాలకు కొత్త ఊపు ఇస్తూ, జిల్లాను 'పవర్‌హౌస్'గా మార్చుతోంది. ప్పటికే రెండున్నరేళ్ల పాలన పూర్తి కావొస్తోంది. ఎన్నికలకు ఇంకో రెండున్నరేళ్లే ఉన్నట్లు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ఆశావహులు పదవుల కోసం కాంగ్రెస్ పెద్దలపై ప్రెజర్ పెడుతున్నారు. ప్రభుత్వ పెద్దలు కూడా క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న రెండు బెర్తులతో మిగిలిపోయిన నామినేటెడ్ పోస్టులు, విప్ పదవుల భర్తీపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలోనే బడ్జెట్ సెషన్ వేళ అసెంబ్లీ, శాసన మండలిలో విప్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

**అసెంబ్లీలో కొత్తగా ముగ్గురు విప్‌లకు అవకాశం కల్పించారు.**

**ఇద్దరు విప్‌లకు ప్రమోషన్..**

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో పాటు ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్‌ను విప్‌లుగా నియమించారు. శాసనమండలిలో విప్‌లు లేకపోవడంతో అద్దంకి, బల్మూర్ వెంకట్‌కు అవకాశం దక్కినప్పటికీ..శాసనసభలో మాత్రం ఆల్రెడీ ముగ్గురు విప్‌లు ఉండగా..ఆల్ ఆఫ్ సడెన్‌గా మరో ముగ్గురిని విప్‌లుగా నియమించడంపై సరికొత్త చర్చ జరుగుతోంది. గతంలో విప్‌లుగా నలుగురికి అవకాశం ఇచ్చారు. అందులో ఇద్దరు విప్‌లకు ప్రమోషన్ లభించింది. మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్‌కు అవకాశం దక్కగా..రామచంద్రు నాయక్‌కు డిప్యూటీ స్పీకర్‌గా అవకాశం కల్పించారు. కానీ ఇంకా రామచంద్రు నాయక్ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు తీసుకోలేదు. ప్రస్తుతం ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య విప్‌లుగా ఉండగా..కొత్తగా ముగ్గురికి అవకాశం ఇచ్చారుకొత్తగా ఒకేసారి ముగ్గురికి విప్‌లుగా అవకాశం ఇవ్వడం వెనుక..ప్రభుత్వ పెద్దల ఆలోచన మరొకటి ఉందనే టాక్ వినిపిస్తోంది. ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికే రెండున్నరేళ్లు పూర్తి కావస్తోంది. ఇక మిగిలింది మరో రెండున్నర ఏళ్లు మాత్రమే. ఇక ముందు రానున్న కాలం ప్రభుత్వానికి అత్యంత కీలకం అని చెప్పొచ్చు. అసెంబ్లీలో ప్రతిపక్షాలు వాయిస్ మరింత పెంచే అవకాశం ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై నిలదీసేందుకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ వ్యూహాలు రచిస్తోంది. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ ప్రభుత్వంపై ఒత్తిడి పెరగడం ఖాయం. దీంతో అసెంబ్లీ వేదికగా ప్రభుత్వంపై జరిగే దాడిని సమర్థవంతంగా తిప్పి కొట్టాలనే ఆలోచనతో విప్‌ల సంఖ్య పెంచారనే టాక్ వినిపిస్తుంది. ఇక విప్‌లుగా పనిచేస్తున్న వారికి కూడా ప్రమోషన్ లభించే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది. గతంలో ఇద్దరికి ప్రమోషన్ దక్కగా..మరో ఇద్దరు కూడా ప్రమోషన్ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య ఇద్దరు కూడా మంత్రివర్గంలో ఛాన్స్ కోసం ఆశలు పెట్టుకున్నారు. సామాజిక సమీకరణాలలో భాగంగా తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. మున్నూరు కాపు సామాజిక వర్గం నుంచి అవకాశం ఇవ్వాలని ఆది శ్రీనివాస్ చాలా కాలం నుంచి కోరుతున్నారు. తెలంగాణలో..ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో మున్నూరు కాపు బలమైన సామాజిక వర్గం కావడంతో..తమ వర్గానికి క్యాబినెట్ లో ప్రాతినిధ్యం కల్పించాలని..ఆ వర్గం నేతలు కూడా పార్టీ పెద్దలను డిమాండ్ చేస్తున్నారు. అలాగే బీర్ల అయిలయ్య కూడా యాదవ సామాజిక వర్గం నుంచి తనకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నారు.

# అజార్ త్యాగయ్యేనా మెడమీద వేళాడుతున్న కత్తి



**హైదరాబాద్, మార్చి 21 :** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం మాజీ క్రికెటర్, ప్రస్తుత మంత్రి మహ్మద్ అజారుద్దీన్ ఎమ్మెల్సీ నియామక అంశం హాట్ టాపిక్‌గా మారింది. మంత్రివర్గంలో సభ్యుడిగా ఉండి, ఏ సభలోనూ సభ్యత్వం లేని మహ్మద్ అజారుద్దీన్ రాజకీయ భవిష్యత్తు ఇప్పుడు ఒక క్లిష్ట దశకు చేరుకుంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆరు నెలలలోపు శాసనసభ శాసనమండలి సభ్యుడిగా ఎన్నిక కావాల్సి ఉంటుంది. అజారుద్దీన్ గడువు ఏప్రిల్ ఆఖరుతో ముగుస్తుండటంతో, ఆయన పదవిపై సందిగ్ధత నెలకొంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన అజారుద్దీన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఆయనను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ఈ ప్రక్రియ ప్రారంభం నుంచీ అనేక న్యాయపరమైన, రాజకీయపరమైన చిక్కులను ఎదుర్కొంటోంది. మొదట ప్రొఫెసర్ కోదండరాం, అమేర్ అలీఖాన్‌ల పేర్లను గవర్నర్ కోటా కింద సిఫార్సు చేయగా, గత ప్రభుత్వం నియమించిన అభ్యర్థుల తిరస్కరణపై సుప్రీంకోర్టులో కేసు దాఖలైంది. దీంతో ప్రభుత్వం తన ప్రతిపాదనలను మార్చాల్సి వచ్చింది. రెండోసారి కోదండరాంతో పాటు అజారుద్దీన్ పేరును ప్రభుత్వం సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉన్నందున గత గవర్నర్ ఈ ఫైల్‌పై నిర్ణయం తీసుకోలేదు. అయితే, ఫిబ్రవరి 3న సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేస్తూ, గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని, కోర్టు విచారణ దానికి అడ్డంకి కాదని స్పష్టం చేసింది. దీంతో అజారుద్దీన్ ఎమ్మెల్సీ నియామకం సుగమం అవుతుందని ప్రభుత్వం భావించినా, అప్పటి గవర్నర్ బదిలీ కావడంతో ఫైల్ మళ్లీ పెండింగ్‌లోకి వెళ్లింది. ప్రస్తుతం కొత్త గవర్నర్ ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. ఏప్రిల్ నెలాఖరు లోపు అజారుద్దీన్ ఎమ్మెల్సీగా ప్రమాణం చేయకపోతే, ఆయన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఇది ప్రభుత్వానికి నైతికంగా ఇబ్బందికరంగా మారుతుంది. ఒకవైపు అజారుద్దీన్ నియామకం పెండింగ్‌లో ఉండగానే, రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు ఉంటాయనే ప్రచారం జోరందుకుంది. ముఖ్యంగా లంబాడా వర్గం నుంచి ఒకరికి మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చినప్పటికీ అమలు కాకపోవడంతో, బాధితులు హైకోర్టును ఆశ్రయించవచ్చని న్యాయస్థానమే సూచించింది. దీంతో ఈ వ్యవహారం మళ్లీ న్యాయపోరాటంగా మారే అవకాశం ఉంది. ఒకవేళ గడువులోగా గవర్నర్ ఆమోద ముద్ర వేయకపోతే, అజారుద్దీన్ తన మంత్రి పదవిని కోల్పోవడమే కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశం ఉంది. బడ్జెట్ సమావేశాల అనంతరం లేదా ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాతే ఈ విషయంలో స్పష్టత వచ్చే సూచనలు కనిపిస్తున్నాయిః

# టీజేపీకి లైన్ క్లియర్



**హైదరాబాద్, మార్చి 21 :** తెలంగాణ రాజకీయాల్లో గత దశాబ్ద కాలంగా కీలక పాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఇప్పుడు సరికొత్త అధ్యాయానికి తెరలేపారు. 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో ఆమె కొత్త రాజకీయ పార్టీని స్థాపించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ మేరకు పార్టీ నమోదు ప్రక్రియను కవిత ప్రారంభించారు. సాధారణంగా రాజకీయ పార్టీల నమోదు ప్రక్రియ కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలో సాగుతుంది. అయితే, తన దరఖాస్తుపై ఈసీఐ వేగంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతూ కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది. జనవరి 23న 'తెలంగాణ ప్రజా జాగృతి' పార్టీ నమోదు కోసం ఈసీఐకి దరఖాస్తు చేశారు కవిత. ఫిబ్రవరి 23న దరఖాస్తులో సాంకేతిక లోపాలు ఉన్నాయంటూ ఈసీఐ తిరుగు టపా పంపింది. మార్చి 19న ఢిల్లీ హైకోర్టులో ఈ పిటిషన్‌పై కీలక విచారణ జరగనుంది. ఈ న్యాయపోరాటం ద్వారా పార్టీని సాధ్యమైనంత త్వరగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కవిత భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది. గతంలో 'తెలంగాణ జాగృతి' అనే సాంస్కృతిక సంస్థ ద్వారా బతుకమ్మ పండుగను విశ్వవ్యాప్తం చేయడంలో కవిత విజయవంతమయ్యారు. ఇప్పుడు దాదాపు అదే పేరును రాజకీయ పార్టీగా మార్చడం వెనుక సెంటిమెంట్, బ్రాండ్ వాల్యూ రెండూ ఉన్నాయి. తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి ప్రాతిపదికన తన రాజకీయ భవిష్యత్తును పునర్నిర్మించుకోవాలనేది ఆమె ఆలోచనగా కనిపిస్తోంది. పార్టీ నమోదు విషయంలో ఈసీఐ లేవనెత్తిన లోపాలు ఇప్పుడు ప్రధాన అడ్డంకిగా మారాయి. రాజకీయ పార్టీ నమోదుకు ఉండాల్సిన నిబంధనలు చాలా కఠినంగా ఉంటాయి. నిధుల సమీకరణ, పార్టీ రాజ్యాంగం, సభ్యత్వ వివరాల్లో స్పష్టత ఉండాలి. హైకోర్టు ఈ విషయంలో ఈసీఐకి ఎలాంటి దిశానిర్దేశం చేస్తుందనేది పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. బీఆర్ఎస్ పార్టీలో కేసీఆర్, కేటీఆర్ నీడలో కాకుండా, తనకంటూ ఒక ప్రత్యేక రాజకీయ వేదిక ఉండాలని ఆమె ఆశిస్తున్నారు. మహిళా సాధికారత, తెలంగాణ హక్కులే ప్రధాన ఎజెండాగా ఈ పార్టీ పనిచేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆమె ఎదుర్కొంటున్న లిక్కర్ స్కామ్ కేసుల నేపథ్యంలో, రాజకీయంగా యాక్టివ్‌గా ఉండటం ద్వారా ఆ ఆరోపణలను ఎదుర్కోవాలని ఆమె యోచిస్తున్నారు. జాగృతి సంస్థకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నెట్‌వర్క్‌ను నేరుగా రాజకీయ శక్తిగా మార్చడం ఈ పార్టీ ఉద్దేశ్యం'తెలంగాణ ప్రజా జాగృతి' ఆవిర్భావం తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీయవచ్చు. యితే సాంకేతిక లోపాలను సవరించుకోకుండా.. కవిత కోర్టుకు వెళ్లడం ఏమిటన్న విస్మయం వ్యక్తమవుతోంది. ఆ సాంకేతిక లోపాలు పరిష్కరించలేనివి అయితే తప్ప ఇలా చేయరని.. భావిస్తున్నారు. కవిత ఇప్పుడు ఆ సాంకేతిక సమస్యలను పరిష్కరించుకుంటే తప్ప.. రిజిస్ట్రేషన్ పూర్తి కాదు. ఎలాగోలా నెల రోజుల్లో పూర్తి చేసి తన పార్టీని ప్రకటించాలని కవిత ప్రయత్నిస్తున్నారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌కు ఇది అనుబంధ శక్తిగా మారుతుందా లేదా కవిత స్వతంత్ర గళాన్ని వినిపిస్తారా అనేది వేచి చూడాలి. ప్రస్తుతానికి ఢిల్లీ హైకోర్టు ఇచ్చే తీర్పు ఈ కొత్త పార్టీ ప్రస్థానానికి పునాది కానుంది.

# అన్నాఅలా... తమ్ముడు ఇలా...


**నల్గొండ, మార్చి 21 :** కోమటిరెడ్డి బ్రదర్స్. తెలంగాణ పాలిటిక్స్‌లో ఇదో ట్యాగ్ లైన్. అందుకు తగ్గట్లు వారు కూడా ఓ బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారు. కానీ ఆ అన్నదమ్ముళ్ల తీరే సమ్‌థింగ్ డిఫరెంట్. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు. వెంకట్‌రెడ్డి ఆల్రెడీ మంత్రిగా ఉన్నారు. ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ శాఖలు నిర్వహిస్తున్నారు. రాజగోపాల్‌రెడ్డి అమాత్య యోగం దక్కట్లేదన్న అసంతృప్తితో రగిలిపోతున్నారు. సీఎం రేవంత్ టార్గెట్‌గా బాణాలు ఎక్కుపెడుతున్నారు. ఈ క్రమంలో ఆ బ్రదర్స్ రూటు సెపరేటు అయిపోయింది. వెంకట్‌రెడ్డి సీఎం రేవంత్‌కు పాజిటివ్ వాయిస్ వినిపిస్తూనే అప్పుడప్పుడు ట్విస్టులు ఇస్తున్నారు. ఇక రాజగోపాల్‌రెడ్డి మాత్రం మంత్రి పదవి దక్కే వరకు తగ్గేదేలే అన్నట్లుగా అసంతృప్తి సెగ రాజేస్తున్నారు. దీంతో ఈ ఇద్దరు బ్రదర్స్ తీరు కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. సీఎం రేవంత్‌కు కంట్లో నలుసులా..కొరకరాని కొయ్యలా తయారైందట. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా ఉండి..సినిమా అవార్డుల ప్రదానోత్సవానికి డుమ్మా కొట్టడం హాట్ టాపిక్‌గా మారింది. గద్దర్ అవార్డ్స్ ఫంక్షన్‌లో కోమటిరెడ్డి కనిపించకపోవడం చర్చనీయాంశం అవుతోంది. కోమటిరెడ్డి తన శాఖను గాలికి వదిలేసి..లేనిపోని ఇష్యూల జోలికి వెళ్తున్నారన్న గాసిప్స్ చక్కర్లు కొడుతున్నాయి. అసలు తన శాఖలో జరిగే వ్యవహారాలు తనకు తెలియదన్నట్లుగా అప్పుడప్పుడు స్టేట్‌మెంట్లు ఇస్తూ చర్చకు దారి తీస్తున్నారాయన. సినిమా టికెట్ల రేట్ల పెంపుతో తనకు సంబంధం లేదని ఓసారి..ఇక నుంచి ఏ సినిమాకు టికెట్ల రేట్ల పెంపు ఉండదని మరోసారి పొంతన లేని వ్యాఖ్యలు చేసిన ఆయన ఇప్పుడు ఇంకో ట్విస్ట్ ఇచ్చారు. సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా ఉండి..ఏకంగా గద్దర్ అవార్డుల ప్రదానోత్సవానికి హాజరు కాలేదు. అయితే బిజీగా ఉండటం వల్లే రాలేదా? లేక వెంకట్‌రెడ్డి అసంతృప్తిగా ఉన్నారా? అనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఇంతకంటే రెండ్రోజుల ముందే జగ్గారెడ్డిని పీసీసీ చీఫ్‌గా చేయాలని ఓ గత్తర లేపారు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. జగ్గారెడ్డి మరో పీజేఆర్ అని..ఆయన లాంటి మాస్ లీడర్‌ను టీపీసీసీ చీఫ్‌గా నియమిస్తే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 100 సీట్లు వస్తాయంటూ చర్చకు తెరలేపారు. దీంతో వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్‌లోని బీసీ నేతల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోందట. ఇక ఇప్పటికే మంత్రి పదవి విషయంలో అన్నదమ్ముళ్ల మధ్య కోల్డ్ వార్ నడుస్తుందని అంటుంటారు. వెంకట్‌రెడ్డిని తప్పిస్తే తప్ప రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చే అవకాశం లేదన్న అభిప్రాయంలో అధిష్టానం ఉందంటున్నారు. అయితే వెంకట్‌రెడ్డే మంత్రిగా కొనసాగాలని కోరుకుంటున్నారట రేవంత్. రాజగోపాల్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకునేందుకు ఆసక్తి చూపట్లేదట. ఇదే రాజగోపాల్‌రెడ్డి ఫ్రస్ట్రేషన్‌కు కారణమంటున్నారు. ఈ క్రమంలోనే అన్నదో దారి అయితే..తమ్ముడిది మరో దారి అన్నట్లుగా మారిపోయిందని అంటున్నారు. ట్రిపుల్ ఆర్ రోడ్డు విషయంలో నిర్వాసితుల పక్షాన రాజగోపాల్‌రెడ్డి వాయిస్ వినిపిస్తే..రీజనల్ రింగ్ రోడ్డు పూర్తి చేయడం తన టార్గెట్ అంటూ చెప్పుకుంటూ వస్తున్నారు వెంకట్‌రెడ్డి. ట్రిపుల్ ఆర్ కోసం భూసేకరణ త్వరగా పూర్తి చేయాలంటూ అధికారులను ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నారాయన. ఇక నల్గొండ డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత నియామకంపై వెంకట్‌రెడ్డి సుర్రుబుర్రులాడితే..రాజగోపాల్‌రెడ్డి కైలాష్ నేతకు పగ్గాలు అప్పజెప్పడాన్ని స్వాగతించారు. ఇక సీఎం రేవంతే ఇంకో పదేళ్లు సీఎంగా ఉండాలని ఆకాంక్షిస్తూ..దేవుడ్ని కోరుకున్నాని వెంకట్‌రెడ్డి చెప్తే..తానే సీఎం అని రేవంత్ ఎలా చెప్పుకుంటారంటూ అటాక్ చేశారు రాజగోపాల్‌రెడ్డి. తనకు మంత్రి పదవి ఇవ్వట్లేదన్న అసంతృప్తితో పలువురు ఎమ్మెల్యేలతో రాజగోపాల్‌రెడ్డి డిన్నర్ మీటింగ్ నిర్వహించారన్న టాక్ కూడా అధికార పార్టీని కలవరపెడుతోంది. ఇలా ఇష్యూ ఏదైనా..టాపిక్ మరేదైనా.. చెరో తీరు స్పందిస్తూ అన్నదమ్ముళు సీఎం రేవంత్‌కు కొరకరాని కొయ్యలా మారారాన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కరువమంటే కప్పుకు కోపం.. విడవమంటే పాముకు కోపం అన్నట్లుగా..కోమటిరెడ్డి బ్రదర్స్ ఎవరి మాట వినే పరిస్థితి లేదట. పైగా తీరు మార్చుకోమని చెప్పే సాహసం కూడా ఎవరూ చేయట్లేదట. దీంతో వాళ్లిద్దరి తీరుతో సీఎం రేవంత్ విసిగిపోయారని ఇన్ సైడ్ టాక్. వెంకట్‌రెడ్డి వ్యవహార శైలి మారేదెప్పుడో? రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తి చల్లారేదెప్పుడో చూడాలి.

# టిక్కెట్ లేని ప్రయాణికుల నుంచి రూ.223 కోట్ల వసూళ్లు

**హైదరాబాద్, మార్చి :** దక్షిణ మధ్య రైల్వే ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో టికెట్ తనిఖీ ప్రక్రియలో రూ. 223.60 కోట్ల రికార్డు ఆదాయాన్ని రాబట్టినట్లు రైల్వే అధికారులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రైల్వే బోర్డు నిర్దేశించిన రూ . 221.08 కోట్ల లక్ష్యాన్ని, సంవత్సరం ముగియడానికి 14 రోజుల ముందే ఈ జోన్ అధిగమించింది. ఏ ఆర్థిక సంవత్సరంలోనైనా టికెట్ తనిఖీ ద్వారా వచ్చిన అత్యధిక ఆదాయం ఇదే కావడం విశేషం. ఇంతకు ముందు 2023-24 సంవత్సరం లో రూ . 220.81 కోట్ల ఆదాయం వచ్చింది. టికెట్ లేని ప్రయాణం, ముందుగా బుక్ చేయని లగేజీ మొదలైన వాటిపై నమోదైన కేసుల ద్వారా ఈ ఆదాయం ఆర్జించినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ జోన్ ప్రస్తుత సంవత్సరంలో, 2025 అక్టోబర్ 18 న ఒకే రోజులో టికెట్ తనిఖీ ద్వారా రూ . 1.85 కోట్ల రికార్డు ఆదాయాన్ని ఆర్జించింది. రైల్వేలలో టిక్కెట్ల తనిఖీ అనేది, టిక్కెట్టు లేని, సరైన ఆధారాలు లేకుండా చేసే ప్రయాణాలను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది అలవాటుగా ప్రతినిత్యం టిక్కెట్లు లేకుండా ప్రయాణం చేసేవారిని నిరోదిస్తూ, బుకింగ్ విండోల ద్వారా టిక్కెట్ల అమ్మకాలు పెరగడానికి దోహదపడుతుంది. రైలు ప్రయాణంలో అధీకృత టిక్కెట్ లేదా ప్రయాణ పత్రం కలిగి ఉండటం ప్రాముఖ్యత గురించి సాధారణ ప్రజలలో అవగాహన కల్పించడానికి కూడా ఇది సహాయపడుతుందని రైల్వే అధికారులు తెలిపారు. అంతేకాకుండా టిక్కెట్ల తనిఖీ చెల్లుబాటు అయ్యే టిక్కెట్లతో ప్రయాణించడంలో ఉండే సౌకర్యం గురించి ప్రయాణికులకు మార్గనిర్దేశం చేయడానికి తోడ్పడుతుంది. ప్రయాణీకుల సౌకర్యాన్ని మెరుగుపరచడానికి, టిక్కెట్ల అమ్మకాలను పెంచడానికి, బుకింగ్ విండోతో పాటు, టిక్కెట్ల జారీ కోసం టిక్కెటింగ్ వ్యవస్థలో అనేక డిజిటల్ కార్యక్రమాలు ప్రవేశపెట్టినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ డిజిటల్ కార్యక్రమాలలో రైల్ వన్ యాప్, బుకింగ్ కౌంటర్ల దగ్గర ఏటీవీఎంలు, స్టేషన్లలో క్యూఆర్ కోడ్‌ల టిక్కెట్ కొనుగోలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పేర్కొన్నారు.

# హైదరాబాద్ లో గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు

హైదరాబాద్,: దేశంలోని మెట్రో నగరాలు ఒక్కో రంగంలో కీలక హబ్‌లుగా ఉన్నాయి. బెంగళూరు ఐటీ, పరిశోధనాభివృద్ధికి, ముంబై బీఎఫ్ఎస్ఐకి, హైదరాబాద్ ఫార్మా, ఐటీ, కృత్రిమ మేధస్సుకు, పుణె ఇంజనీరింగ్‌కు, ఢిల్లీ, ఎన్‌సీఆర్ ఈ కామర్స్, చెన్నై తయారీ రంగాలకు కేంద్రాలుగా ఉన్నాయి. ఖర్చును ఆదా చేసే కేంద్రాల నుంచి ఆవిష్కరణ, విలువ ఆధారిత సేవలకు వ్యూహాత్మక కేంద్రాలుగా అవి రూపాంతరం చెందుతున్నాయి. జీసీసీలు అనేవి బహుళ జాతి సంస్థల ఆఫ్‌షోర్ యూనిట్లు. ఇవి ప్రతిభ, సాంకేతికత, ఆవిష్కరణలను ఏకీకృతం చేసే కేంద్రాలు. దేశంలో కృత్రిమ మేధస్సు(ఏఐ), మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలలో వృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయి. భారత్‌లో జీసీసీల ఏర్పాటుకు అమెరికాకు చెందిన కంపెనీలే ఎక్కువ ఆసక్తిని కనబరుస్తున్నాయి. 2021 నుంచి ఇండియాలో జరిగిన జీసీసీ లీజులలో యూఎస్ కంపెనీల వాటా ఏకంగా 70 శాతంగా ఉందంటే డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. ఫార్చ్యూన్ 500 కంపెనీలు, గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజాలు ఈ ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాయి. ఇతర దేశాల్లోని ప్రతిభావంతుల సేవలను, కార్యనిర్వహణ సామర్థ్యాన్ని తక్కువ ఖర్చుతో ఉపయోగించుకోవడానికి ఎంఎన్‌సీ కంపెనీలు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేస్తాయి. వాటినే గ్లో బల్ కేపబులిటీ సెంటర్లు (జీసీసీ)గా పిలుస్తారు. ఆ కంపెనీలు తమ వ్యాపార వృద్ధికి ఈ కేంద్రాలలోని మానవ, సాంకేతిక వనరులను వినియోగించుకొంటాయి. హైదరాబాద్ కేంద్రం గా నడిచే జీసీసీలు దేశవ్యాప్తంగా స్టార్టప్ కల్చర్‌కు దశ, దిశను చూపుతున్నట్టు నిపుణులు చెప్తున్నారు. దేశంలో జీసీసీల లిస్టులో చూస్తే బెంగళూరు అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, హైదరాబాద్ నగరం రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత మూడో స్థానంలో ఉన్న చెన్నై కూడా కీలక పాత్ర పోషిస్తోంది. ఫార్మా, బయోటెక్ రంగాల్లో కార్యకలాపాలు సాగించే కంపెనీలకు హైదరాబాద్ మొదటి ఎంపికగా నిలుస్తుందని రిపోర్టుల్లో తెలిసింది.ప్రపంచ దిగ్గజ కంపెనీలు తమ గ్లోబల్ కేపబులిటీ సెంటర్లను (ఉఅఅ) హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడానికి క్యూకట్టాయి. జీసీసీలను ఆకర్షించడంలో 'సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా'గా పిలిచే బెంగళూరును తోసిరాజని హైదరాబాద్ ముందువరుసలో నిలిచిందంటే కేసీఆర్ ప్రభుత్వం వేసిన అప్పటి 'ఐటీ' పునాదులేనని చెప్పకతప్పదు. గ్లోబల్ టెక్ కంపెనీలను ఏర్పాటు చేయడమే కాదు సుశిక్షితులైన ఉద్యోగులను కూడా అందిస్తూ మల్టీనేషనల్ కంపెనీలను ఆకర్షించడంలో హైదరాబాద్ దేశానికే దిక్సూచీగా నిలిచింది. అందుకే గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల(జీసీసీ)కు కేంద్ర బిందువుగా హైదరాబాద్ మారింది. దేశవ్యాప్తంగా రెండు వేల జీసీసీ ఎకో సిస్టమ్‌లుండగా.. హైదరాబాద్‌లోనే 355 జీసీసీలున్నాయి. దేశంలో కొత్తగా ప్రారంభించే ప్రతీ 100 జీసీసీల్లో 18 సెంటర్లు హైదరాబాద్‌లోనే కొలువుదీరుతున్నాయి. తద్వారా దేశంలో అత్యధికంగా జీసీసీ సెంటర్లు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందు వరుసలో నిలిచింది. హైదరాబాద్‌లోని మొత్తం జీసీసీల్లో 3 లక్షల మంది ఉద్యోగాలు చేస్తున్నారు. వచ్చే




ఐదు నుంచి ఏడేండ్ల కాలంలో 35-40 శాతం కొత్త జీసీసీలు మన దేశంలో ప్రారంభం కానున్నట్టు నివేదికలు చెప్తున్నాయి. వాటన్నింటికీ గమ్యస్థానం హైదరాబాద్ కాబోతున్నట్టు పారిశ్రామిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఐటీ, రీసెర్చ్, ఫైనాన్స్, కస్టమర్ సేవల కోసం ఎంఎన్‌సీలు హైదరాబాద్‌లో ఇప్పటికే వందలాది జీసీసీలను ఏర్పాటు చేశాయి.టెక్ కంపెనీలు కూడా తమ వ్యాపార విస్తరణకోసం జీసీసీ (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)లు ఏర్పాటు చేస్తున్నాయి.

ప్రతి సంవత్సరం 100 మిలియన్ డాలర్ల నుంచి 1 బిలియన్ డాలర్లు అంటే భారత దేశ కరెన్సీలో సుమారు రూ.860 కోట్ల నుంచి రూ.8600 కోట్ల వరకు టర్నోవర్ ఉన్న మధ్య స్థాయి టెక్ కంపెనీలు ఏర్పాటు చేస్తోన్న జీసీసీ కేంద్రాలను మధ్య స్థాయి మార్కెట్ జీసీసీలుగా చెబుతారు. ఈ జీజీసీలు టెక్నాలజీ పరిశ్రమ విస్తరణలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నట్లు నాస్కామ్- జిన్నోవా రిపోర్ట్ తెలిపింది. అందులో చాలా కంపెనీలు హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని జిసిసి సెంటర్లను ప్రారంభించాయి. మధ్య స్థాయి టెక్ కంపెనీల జీసీసీల్లో హైదరాబాద్ నగరం జోరు కనబరుస్తోంది. భాగ్యనగరంతో పాటు బెంగళూరు, ఢల్లీ? ఎన్‌సీఆర్, చెన్నై నగరాల్లో జీసీసీ కేంద్రాలు అధికంగా ఏర్పాటవుతున్నాయి. కొత్తగా ఏర్పాటు చేస్తున్న జీసీసీల్లో 74 శాతం మేర ఈ నగరాలకే వస్తున్నాయని ఓ నివేదిక తెలిపింది. బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో టెక్నాలజీ నిపుణుల లభ్యత అధికంగా ఉంటుంది. టాలెంట్ హాట్‌స్పాట్లుగా ఈ రెండు నగరాలు మారుతున్నాయి.

ఈ క్రమంలో కొత్త జీసీసీ కేంద్రాలను ఈ రెండు నగరాలు ఎక్కువగా ఆకర్షించగలగుతున్నట్లు రిపోర్ట్ తెలిపింది. టెక్నికల్ నాలెడ్జ్ గల మానవ వనరుల లభ్యత అధికంగా ఉండడం, బలమైన అంకుర సంస్థల వ్యవస్థ, అందుకు ప్రభుత్వ మద్దతు.. భారత్ వైపు ఆ సంస్థలు చూసేందుకు కీలకమైన అంశాలుగా తెలుస్తోంది.

ఇన్ని సౌలభ్యాలు ఉన్నందునే బహుళ జాతి కంపెనీలు కొత్త జీసీసీలను భారత్‌లో అధికంగా స్థాపిస్తున్నాయని అంటున్నారు.జీసీసీలకు ఉన్న ప్రాముఖ్యతను గుర్తించి ఇటీవల హైదరాబాద్ కేంద్రం గా నాసామ్ జీసీసీ కాన్‌క్లేవ్-2022ను సైతం నిర్వహించింది. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ చాలా అనుకూలంగా ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం విశేషం. ఇతర నగరాలతో పోల్చితే ఇక్కడున్న మౌలిక సదుపాయాలు అసమానమైనవిగా పేర్కొన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం నుంచైనా, నగరంలోని ఏదైనా ప్రధాన ప్రాంతాల నుంచైనా.. ఐటీ కారిడార్‌లోని గమ్యస్థానానికి గంటలోపు చేరుకో వచ్చు. దీనికితోడు నగరంలో 69 కిలోమీటర్ల మెట్రో రైలు కనెక్టివిటీ ఉన్నది. ఫ్లై ఓవర్ల నిర్మాణాల వల్ల ట్రాఫిక్ కు పెద్దగా ఇబ్బంది లేదు. ఇవన్నీ గమనించే పెద్ద పెద్ద సంస్థలు తమ జీసీసి ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంచుకుంటున్నాయి. ఇక భద్రతపరంగా నగరంలో సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ కూడా ఉన్నది. ఇది ఐటీ కారిడార్‌లలో కంపెనీలకు భద్రత, ప్రత్యేకంగా మహిళల రక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ కోసం పనిచేస్తున్నది. పోలీసు శాఖ-ఐటీ పరిశ్రమల మధ్య దీన్ని ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులే జాతీయ, అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షిస్తున్నాయిఅమెరికాకు చెందిన మెక్‌డొనాల్డ్స్ సంస్థ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ కేంద్రం (జీసీసీ) ఏర్పాటు ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో పెట్టుబడుల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. జీసీసీ విభాగం చైర్మన్, సీఈవో క్రిస్ కెంప్కెజెస్కితోపాటు గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు స్కై ఆండర్సన్, చీఫ్ గ్లోబల్ ఇంపాక్ట్ ఆఫీసర్ జాన్ బ్యానర్, గ్లోబల్ ఇండియా హెడ్ దేశాంత కైలా ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. 2000 మంది ఉద్యోగులతో మెక్‌డొనాల్డ్స్ ఇండియా సంస్థ గ్లోబల్ ఆఫీసును నెలకొల్పనుంది. ఈ కేంద్రాన్ని తమతమ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని పలు రాష్ట్రాలు పోటీపడినప్పటికీ. మెక్‌డొనాల్డ్ సంస్థ తెలంగాణను తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎంచుకోవటం గర్వంగా ఉందని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొంటూ, ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సంస్థకు అవసరమైన శిక్షణ నైపుణ్యమున్న ఉద్యోగులను నియమించుకు నేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. వర్సిటీని స్కిల్ జోన్‌గా ఉపయోగించుకొని, ఇక్కడ శిక్షణ పొందిన వారికి గ్లోబల్ ఆఫీస్‌లోనే కాకుండా, దేశ విదేశాల్లో తమ ఆఫీసులు, అవుట్‌లెట్లలో ఉద్యోగాలు కల్పించాలని కోరారు.అమెరికాకు చెందిన ప్రముఖ ఆరోగ్య సంరక్షణ సంస్థ హెచ్‌సిఎ హెల్త్‌కేర్.. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఒక భారీ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ ను ప్రారంభించింది. సత్వా నాలెడ్జ్ పార్క్‌లో 4,00,000 చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు తీసుకున్న ఈ సంస్థ 2026 నాటికి 3,000 మంది ఉద్యోగులను నియమించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భారీ విస్తరణ హైదరాబాద్‌ను ప్రపంచ ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్ జిసిసిలకు ఒక ముఖ్య కేంద్రంగా నిలబెడుతోంది. ఇప్పటికే యునైటెడ్ హెల్త్ గ్రూప్,నోవార్టిస్ వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలకు హైదరాబాద్ ఆతిథ్యం ఇస్తోంది. హెచ్ సి ఎ హెల్త్‌కేర్ రాకతో నగరం మరింత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. హైదరాబాద్ జీవశాస్త్ర రంగంలో తన ప్రాధాన్యతను మరింత బలపరుచుకుంటోందని తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. దేశంలోని తొలి హెల్త్‌కేర్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ హెచ్‌సిఎ హెల్త్ కేర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే హైదరాబాద్ ఐటీ, ఫార్మా రంగాల కేంద్రంగా గుర్తింపు పొందిందని, ఇప్పుడు ఆరోగ్యరంగంలో కూడా ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుంటోందని అన్నారు. హాస్పిటాలిటీ రంగంలో ప్రారంభించిన జీసీసీ తరువాత.. హెల్త్‌కేర్‌లో ఇలాంటిది మొదటిసారిగా హైదరాబాద్‌లో ఏర్పడటం గర్వకారణమని పేర్కొన్నారు.

# పడక గదిలో సీసీ కెమెరాలు..

తిరుపతి, : ఒక మనిషిని గెలవాలంటే నేరుగా తలపడాలి. యుద్ధక్షేత్రంలో ప్రత్యర్థిని ఓడించాలంటే ముందుగా మన సత్తా ఏమిటో చూపించాలి. అలాకాకుండా వెన్నుపోటు పొడిచి.. దొడ్డి దారి ప్రణాళికలు రూపొందిస్తే దానిని యుద్ధ రీతి అనరు. ఇటువంటి విధానాన్ని అమలు చేసిన ఓ రాజకీయ నాయకుడు ఇప్పుడు తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నాడు. విపరీతమైన విమర్శలను చవిచూస్తున్నాడు. తట్టుకోలేక రాష్ట్రానికి దూరంగా ఉంటున్నాడు.ఆ రాజకీయ నాయకుడికి బలమైన నేపథ్యం ఉంది. ఆయన తండ్రి మంత్రిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆ నాయకుడు ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారు.. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ అధికారంలో ఉంది. ఆ నియోజకవర్గ ప్రజలు దీవించారు కాబట్టి ఆయన ఎమ్మెల్యే అయ్యారు. మరోసారి ఆయన గెలవాలంటే గొప్ప పనులు చేయాలి. ప్రజల మనసులో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకోవాలి. అవసరమైతే తనకు శత్రుత్వం అనేది లేకుండా.. ప్రత్యర్థి అనే వ్యక్తి ఉండకుండా చూసుకోవాలి. ఇవన్నీ జరగాలంటే ముందుగా ఆ రాజకీయ నాయకుడిలో మంచితనం ఉండాలి. కానీ ఎమ్మెల్యే గా గెలిచిన ఆ నాయకుడిలో మంచితనం అనేది లేకుండా పోయింది. ముంచేతనం అనేది పెరిగిపోయింది. అన్నిటికంటే ముఖ్యంగా తనకు ప్రత్యర్థిగా ఉన్న ఒక మహిళపై పైశాచికత్వాన్ని ప్రదర్శించిన తీరు ఇప్పుడు ఆ రాష్ట్ర రాజకీయాల్లోనే సంచలనంగా మారింది.ఆమె ఉన్నత విద్యావంతురాలు. తన నియోజకవర్గానికి సేవ చేయడానికి రాజకీయాలలోకి వచ్చారు. అంతేకాదు సేవా కార్యక్రమాలు కూడా విస్తృతంగా చేశారు. డబ్బు కూడా భారీగా ఖర్చు పెట్టారు. ఆమె భర్త కూడా ఇందుకు సహకరించారు. అయితే ఆమెకే టికెట్ అనుకుంటున్న క్రమంలో.. ఊహించిన విధంగా పొత్తు ఏర్పడింది.. దీంతో ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ పొత్తు ధర్మంలో భాగంగా భాగస్వామ్య పార్టీకి సపోర్టు ఇవ్వాల్సి వచ్చింది. దీంతో ఆమెకు ఎమ్మెల్యే యోగ్యం దక్కలేదు. సరే తమతో పొత్తు కుదుర్చుకున్న పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలిచారని.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామని ఆమె గొప్పగా చెప్పుకుంది. అంతేకాదు అధికారంలోకి తమ పార్టీ భాగస్వామిగా ఉన్న సమూహం రావడంతో ఆనందపడింది. కానీ ఇక్కడే ఆమె ఆనందం ఆవిరైంది. దానికి ప్రధాన కారణం ఆ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే నే.ఎమ్మెల్యే గెలిచిన తర్వాత ఆ నాయకుడి ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. వచ్చే ఎన్నికల నాటికి తనకు రాజకీయ శత్రుత్వం ఉండకూడదని ఆయన భావించాడు. అందువల్లే తమ సమూహంలో ఉన్న పార్టీకి సంబంధించిన నాయకురాలికి అసలు రాజకీయ జీవితంలో లేకుండా చేయాలని అనుకున్నాడు. ఆమె దగ్గర పని చేస్తున్న ఒక వ్యక్తిని దగ్గరికి తీసుకున్నాడు. డబ్బు ఆశ చూపించాడు. అయితే ఆ నాయకురాలికి మరొక వ్యక్తితో సంబంధం ఉండేది. ఇదే అదునుగా భావించిన ఆ ఎమ్మెల్యే ఆ నాయకురాలి వద్ద పనిచేస్తున్న వ్యక్తితో చేయకూడని కార్యక్రమాలు చేయించాడు. ఆ నాయకురాలు పడకగదిలో సీసీ కెమెరాలు పెట్టించాడు.. దీంతో ఆ నాయకురాలు తన ప్రియుడితో సాగించే సరసాలు అందులో రికార్డ్ అయ్యాయి. ఈ వీడియోలు మొత్తం కూడా ఆ వ్యక్తి సదరు ఎమ్మెల్యేకు పంపించాడు. ఆ వీడియోలను అడ్డం పెట్టుకొని సదరు నాయకురాలిని బెదిరించేందుకు ఆ ఎమ్మెల్యే ప్రయత్నాలు మొదలు పెట్టాడు. కానీ ఇంతలోనే ఆ నాయకురాలు తన వద్ద పనిచేసే వ్యక్తి వీడియోలు పంపిస్తుండగా చూసింది.. ఆ తర్వాత ఈ విషయాన్ని తన భర్తకు వేరే విధంగా చెప్పింది. దీంతో ఆమె భర్త.. తన అనుచరులతో కలిసిఓ ప్రణాళిక రూపొందించాడు. అంతేకాదు తమ వద్ద పనిచేస్తున్న ఆవ్యక్తిని అంతం చేశాడు. ఈ వ్యవహారంలో అతడు ప్రస్తుతం జైల్లో ఉంటున్నాడు. ఆవుల మంద పోట్లాడుకుంటే దూడల కాళ్ళు విరిగినట్టు.. ఎమ్మెల్యే, ఓ నాయకురాలు మధ్య ఏర్పడిన వివాదం చివరికి ఒక మనిషి ప్రాణం పోవడానికి కారణమైంది. అతని కుటుంబాన్ని దిక్కులేని వాళ్ళను చేసింది. అందుకే సాధ్యమైనంతవరకు పెద్దల వ్యవహారాలలో వేలు పెట్టకపోవడమే మంచిది.

### జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్:స్థానిక కరీంనగర్ లోని మంకమ్మతోట దగ్గర్వాడి ప్రభుత్వ పాఠశాలలో జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలను ఈ నెల 22 న వెయిట్ లిఫ్టింగ్ అసోసియోషన్ వారు నిర్వహించడం జరిగింది. ఇట్టి పోటీలలో సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 94 కేజీల విభాగంలో ఎమ్.డి. అయాన్ 60 కేజీల విభాగంలో ఎమ్.డి. సులేమాన్ గోల్డ్ మెడల్ సాధించారు. నవంబర్లో హన్మకొండలో

7,8,9వ తేదీలలో జరగబో యే రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కరబరిచి స్వర్ణపతకాలు సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి అభినందిస్తూ,

పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకొనిరావాలని రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని విద్యార్థులనుద్దేశించి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి డైరెక్టర్ స్వప్న శ్రీపాల్ రెడ్డి ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# పవన్ వర్సెస్ ఆర్ ఆర్ ఆర్




భీమవరం, : ఏపీలోఒక అంశం హాట్ టాపిక్ అవుతోంది. నిన్న రోజంతా భీమవరం డిఎస్పి జయ సూర్య వార్తల్లో నిలిచారు. ఆయన విషయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించడం ఈ ప్రచారానికి కారణం. కూటమినేతల పేర్లు చెప్పుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారంటూ డీఎస్పీ జయ సూర్య పై అనేక రకాల ఫిర్యాదులు వచ్చాయి. భీమవరం పరిధిలో పేకాట శిబిరాలకు అండగా నిలుస్తున్నారని.. సివిల్ కేసుల్లో తల దూర్చుతున్నారని ఆయనపై వచ్చిన ఆరోపణలపై నివేదిక ఇవ్వాలని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ ని ఆదేశించారు డిప్యూటీ సీఎం. ఇదే విషయాన్ని హోం శాఖ మంత్రితో పాటు బిజెపి కార్యాలయానికి సైతం సమాచారం అందించాలని పవన్ డిప్యూటీ కార్యాలయ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. అప్పటినుంచి ఇది హాట్ టాపిక్ గా మారింది. అయితే తాజాగా ఈ అంశంపై మాట్లాడారు ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణం రాజు.గన్నవరం డిఎస్పీగా ఉండేవారు జయసూర్య. అప్పట్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల విధేయత ప్రదర్శించే వారని ఆయన పై ఆరోపణలు ఉన్నాయి. ఓ కూటమి ఎమ్మెల్యే మద్దతుతో ఆయన భీమవరం లో పోస్టింగ్ ఇప్పించుకున్నారని కూడా టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం ఆ డీఎస్పీని ఓ కూటమి ఎమ్మెల్యే అండదండగా నిలుస్తున్నారని ఒక టాక్ అయితే ఉంది. సరిగ్గా ఇదే సమయంలో రఘురామకృష్ణంరాజు స్పందించడం గమనార్హం. మరోవైపు పవన్ కళ్యాణ్ ఫిర్యాదుతో సీఎం చంద్రబాబు సైతం ఈ విషయాన్ని సీరియస్గా తీసుకున్నారు. దీనిపై నివేదిక ఇవ్వాలని డిజిపి హరీష్ కుమార్ గుప్తాను ఆదేశించారు. మరోవైపు హోం మంత్రిత్వ శాఖ విషయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జోక్యం ఏమిటి అన్న ప్రశ్న వస్తోంది. ఆయన కేవలం హోదా ప్రకారమే డిప్యూటీ సీఎం కానీ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాలు ఫైనల్ అని.. మరి పవన్ కళ్యాణ్ ఎలా స్పందిస్తున్నారని విలేకరులు హోంమ ంత్రి వంగలపూడి అనితను ప్రశ్నించారు. దీనిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మాది ఎన్డీఏ ప్రభుత్వమని..

అంతా సమాచారం తమ వద్ద ఉందని.. శాఖల మధ్య సమన్వయం కొనసాగుతోందని చెప్పారు.తాజాగా దీనిపై స్పందించారు ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు. భీమవరం డిఎస్పీకి మంచి ట్రాక్ రికార్డు ఉందన్నారు. తనకున్న సమాచారం ప్రకారం జిల్లాలో పేకాట పై ఆయన నిఘా పుట్టారని.. అందుకే ఆయనపై అభియోగాలు వస్తున్నాయని అనుకుంటున్నాట్లు తెలిపారు. తన నియోజకవర్గం నుండి పరిధిలో ఎలాంటి పేకాట స్థావరాలు లేవని.. జూదం పై కూటమి ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతోందని తెలిపారు. తద్వారా రఘురామకృష్ణం రాజు భీమవరం డిఎస్పి కి క్లీన్ చీట్ ఇచ్చినట్లు అయింది. ఈ పరిణామం ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుందో చూడాలి

# ఆస్ట్రేలియాకు ఆక్వా ప్రొడక్ట్స్

విజయవాడ,: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరు చెబితేనే ఇప్పుడు ప్రపంచ దేశాలు ఆగ్రహంతో ఊగిపోతున్నాయి. పన్నులు పెంచి ప్రపంచ దేశాలను కోలుకోలేని దెబ్బతీశారు. ఆ దేశానికి ఉత్పత్తి అయ్యే అన్ని రకాల వస్తువుల పై భారీగా సుంకం పెంచి ప్రపంచంలో చాలా దేశాలను ఇబ్బంది పెట్టారు. అందులో బాధిత దేశంగా ఇండియా ప్రథమ స్థానంలో ఉంది. అక్కడ పెంచిన సుంకాలతో మన దేశంపై పెద్ద ప్రభావమే పడుతోంది. ముఖ్యంగా ఆక్వారంగం కష్టాల్లో పడింది. రొయ్యల ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళనతో ఉన్నారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే ఏపీ మంత్రి నారా లోకేష్ చతురతతో వ్యవహరించారు. అమెరికా ద్వారా జరిగిన నష్టాన్ని ఆస్ట్రేలియాతో బత్తి చేయడంలో లోకేష్ సక్సెస్ అయ్యారు. ఇది నిజంగా ఏపీలోని ఆక్వారంగానికి ఉపశమనం కలిగించే విషయమే.అగ్రరాజ్యం అమెరికాకు ఏపీ నుంచి ఆక్వా ఉత్పత్తులుఎక్కువగా ఎగుమతి అవుతుంటాయి. మొత్తం 100% ఉత్పత్తుల్లో 90 శాతం అమెరికాకే తరలిస్తుంటారు. అయితే ఆక్వాపై అమెరికాలో సుంకాలు పెంచడంతో.. ఏపీలో వాటికి సంబంధించిన ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ఆక్వాతో పాటు పదిరకాల అనుబంధ రంగాలపై కూడా ఇది ప్రభావం చూపింది. ఒక్కసారిగా రొయ్యల ధరలు సైతం పతనం అయ్యాయి. వాస్తవానికి మన రొయ్యలు జపాన్, చైనా తదితర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అయితే అమెరికాకు ఎగుమతి అవుతున్న ఉత్పత్తులపై సుంకం విధించడంతో అక్కడ డోర్ క్లోజ్ చేసినట్లు అయింది. దీంతో దేశీయ మార్కెట్ రంగంపై ఏపీ ఆక్వా ఆధారపడాల్సి వచ్చింది. మరోవైపు జపాన్ తో పాటు చైనాకు పరిమిత స్థాయిలోనే ఎగుమతులు అవుతున్నాయి. ఇటువంటి సమ యంలో ఆస్ట్రేలియా ఏపీ ఆక్వా ఉత్పత్తులను ఎగుమతి చేసుకునేందుకు ముందుకురావడం శుభ పరిణామం. దీనివెనుక మంత్రి నారా లోకేష్ కృషి ఉంది. ఆస్ట్రేలియా ఆక్వారంగా అధికారులు, ప్రతినిధులు తో సమావేశం అయినలోకేష్ వారినిఒప్పించగలిగారు.ఆస్ట్రేలియా గతం లో భారత్ నుంచి రొయ్యలను దిగుమతి చేసుకునేది. అయితే వైట్ స్పాట్ వైరస్ రొయ్యలు కావడంతోభారత్ నుంచిదిగుమతులను రద్దు చేసుకుంది. అప్పటినుంచి మన రొయ్యలపై ఆస్ట్రేలియాలో నిషేధం కొనసాగుతోంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా సముద్ర ఉత్పత్తుల పరిశ్రమ ప్రతినిధులతో లోకేష్ సమావేశం అయ్యారు. ఏపీ ఆస్ట్రేలియా మధ్య ఆక్వా ఎగుమత్తుల అంశంపై వారితో చర్చించా రు. ఏపీలో ఈ రంగం అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారు. 2027 అక్టోబర్ 20 వరకు భారతీయ రొయ్యలను ఆస్ట్రేలియా దిగుమతి చేసుకునేందుకు అంగీకరించింది. ఈ మేరకు అక్కడి ప్రతినిధులు ఆమోదం తెలిపిన డాక్యుమెంట్లను జతచేస్తూ నారా లోకేష్ ట్వీట్ చేశారు. ఏ ఏ రకాల రొయ్యలు? ఎంత ధరకు దిగుమతి చేసుకుంటారు? అన్న వివరాలను ఆ పత్రాలలో ప్రస్తావించారు.నారా




లోకేష్ ట్వీట్ ఇప్పుడు వైరల్ అవుతోంది.' భారతదేశ నుంచి ఆస్ట్రేలియాకు రొయ్యల ఎగుమతుల్లో ఒక పెద్ద అడ్డంకి తొలగిపోయింది. గతంలో తెల్ల మచ్చ వైరస్ ఉన్న రొయ్యలను తొక్క తీయకుండా ఆస్ట్రేలియా దిగుమతి చేసుకోలేదు. కానీ ఇప్పుడు భారత్ నుంచి వచ్చే ఆ రొయ్యల దిగుమతికి ఆస్ట్రేలియా అనుమతి ఇచ్చింది. ఈ విజయం వెనుక భారత్, ఆస్ట్రేలియా ప్రభుత్వా ల కృషి ఎంతో ఉంది. వారికి నా కృతజ్ఞతలు. ఒకే మార్కెట్ పై ఆధారప డకుండా.. కొత్త మార్కెట్లను ఓపెన్ చేయడం చాలా ముఖ్యం ' అన్నారు మంత్రి నారా లోకేష్. వాస్తవానికి ఆస్ట్రేలియాతో పాటు సౌదీ అరేబియాలో మన రొయ్యలకు గిరాకీ ఉంది. అయితే తాజాగా ఆస్ట్రేలియా ప్రభుత్వం అంగీకారం తెలపడంతో సుమారు 8వేల కంటైనర్ల రొయ్యలను ఎగుమతి చేసే అవకాశం ఉంది. అమెరికాతో సమానమైన ధర లభిస్తుందని తెలుస్తోంది. మొత్తానికైతే ట్రంప్ కొట్టిన దెబ్బను ఆస్ట్రేలియాతో భర్తీ చేశారు మంత్రి నారా లోకేష్.

# వడివడిగా రైల్వే జోన్ అడుగులు



**విశాఖపట్టణం, మార్చి 21 :** ఆంధ్రప్రదేశ్ ప్రజల దశాబ్దాల కల అయిన విశాఖపట్నం రైల్వే జోన్ సౌత్ కోస్ట్ రైల్వే - ౹ాఅనీఖీ కార్యకలాపాలు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర విభజన హామీల్లో ప్రధానమైన ఈ జోన్ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే అన్ని అడ్డంకులు తొలిగిపోయాయని, విశాఖలోని ముడసర్లోవ వద్ద రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 52.2 ఎకరాల భూమిని రైల్వే శాఖ స్వాధీనం చేసుకుందని ఆయన వెల్లడించారురైల్వే జోన్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 106.89 కోట్లు మంజూరు చేయగా, ఇప్పటికే పునాది పనులు పూర్తయ్యాయి. 2025 జనవరిలోనే ఈ ప్రాజెక్టుకు అధికారికంగా శంకుస్థాపన జరిగింది. అయితే, భవన నిర్మాణం పూర్తయ్యే వరకు వేచి చూడకుండా, తక్షణమే పాలన సాగించేందుకు వీలుగా విశాఖలోనిభవనం ది డెక్ ను సిద్ధం చేశారు. త్వరలోనే ఇక్కడి నుండే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి జనరల్ మేనేజర్ ,ఇతర ఉన్నతాధికారుల నియామక ప్రక్రియ కూడా పూర్తయినట్లు మంత్రి స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే కేటాయింపుల విషయంలో కేంద్రం రికార్డు స్థాయి నిధులు కేటాయిస్తోంది. 2009-14 మధ్య కాలంలో ఏటా సగటున రూ. 886 కోట్లు మాత్రమే ఉండగా, 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఏపీకి ఏకంగా రూ. 9,417 కోట్లు కేటాయించడం విశేషం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 70,232 కోట్ల విలువైన 39 రైల్వే ప్రాజెక్టులు కొత్త లైన్లు , డబ్లింగ్ పనులతో కలిపి వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. గతంతో పోలిస్తే ట్రాక్ నిర్మాణ వేగం రెట్టింపైందని, ఏటా సగటున 143 కి.మీల మేర కొత్త ట్రాక్ పనులు జరుగుతున్నాయని మంత్రి వివరించారు. కొత్త ప్రాజెక్టుల విషయానికి వస్తే, అమరావతి రాజధాని ప్రాంతాన్ని అనుసంధానిస్తూ ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు మధ్య 57 కి.మీల కొత్త రైల్వే లైన్ కోసం రూ. 2047 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. దీనికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. అలాగే విజయవాడ-గూడూరు మూడవ లైన్, గుంతకల్-గుంటూరు డబ్లింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఇవి పూర్తయితే ఏపీలో రైలు ప్రయాణం మరింత వేగవంతం కావడమే కాకుండా రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందని పేర్కొన్నారు.మొత్తానికి, విశాఖ రైల్వే జోన్ కార్యరూపం దాల్చడం మరియు భారీ స్థాయిలో నిధుల కేటాయింపులు జరగడం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేయనుంది. ఉత్తరాంధ్ర ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ రైల్వే శాఖ చేపట్టిన ఈ చర్యలు రాష్ట్ర రవాణా ముఖచిత్రాన్ని మార్చనున్నాయి. త్వరలోనే విశాఖ నుంచి జోన్ పాలన ప్రారంభం కానుండటం గమనార్హం.

# ఏపీలో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు




**నెల్లూరురు మార్చి 12 :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే రోజుల్లో పౌర సేవల్ని త్వరగా అందించేందుకు, సంక్షేమ పథకాల అమలుకు ఫ్యామిలీ కార్డు (ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) విధానం అమలు చేయనున్నారు. అమరావతిలో నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సులో త్వరలోనే ఫ్యామిలీ కార్డు (స్మార్ట్ కార్డ్) విధానం తీసుకొస్తున్నామన్నారు ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్. ఈ కార్డుతో సంక్షేమ పథకాలను అనుసంధానం చేస్తారని.. ఈ మేరకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ కార్డుతో సూపర్ సిక్స్ పథకాలను కనెక్ట్ చేస్తామంటున్నారు. అలాగే రాష్ట్రంలో 20 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శకులకు అనుసంధానం చేశామన్నారు పీయూష్ కుమార్.ఏపీ ప్రభుత్వం ప్రతి కుటుంబం ఒక యూనిట్‌గా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎఫ్‌బీఎంఎస్)ను తీసుకొస్తోంది.. ఫ్యామిలీ స్మార్ట్ కార్డును జారీ చేయాలని నిర్ణయించింది. ఈ కార్డులో 26 అంశాలతో (ఫ్యామిలీ ఐడీ, ఆధార్ నెంబర్, రైస్ కార్డ్ ఐడీ, విద్యార్హతలు, వృత్తి, మొబైల్ నంబర్, చిరునామా, వ్యవసాయ భూమి, అర్బన్-రూరల్ ప్రాపర్టీ వంటి వివరాలు) డేటాబేస్ రూపొందించనున్నారు. ఇప్పటికే 82 శాతం సమాచారం ఉండగా.. ఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటా బేస్ సిద్ధం చేస్తామంటున్నారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ఫ్యామిలీ కార్డు అందించేలా ప్లాన్ చేశారు అధికారులు. ఈ ఫ్యామిలీ కార్డును క్యూఆర్ కోడ్‌తో రూపొందించనున్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన ఆ కుటుంబానికి సంబంధించిన సమాచారం తెలుస్తుంది.. కుటుంబానికి సంబంధించిన పత్రాలను తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు అంటున్నారు.ఏపీ ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలనలో భాగంగా ఈ ఫ్యామిలీ కార్డు ద్వారా అర్హులైన వారందరికీ పథకాలు అందించేందుకు, పౌర సేవలు కూడా సులభతరం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొన్ని పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ఎదురవుతున్న ఇబ్బందులు కూడా ఈ విధానం ద్వారా పరిష్కారం అవుతాయి అంటున్నారు. అంతేకాదు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర విజన్ యూనిట్ ద్వారా కుటుంబ వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యేలా ప్లాన్ చేస్తారు. ఈ ఒక్క కార్డు ద్వారానే అన్ని వివరాలూ తెలిసేలా ప్రభుత్వం రూపొందించింది.

# పాలిటిక్స్ లోకి నారా రోహిత్...



**తిరుపతి,మార్చి 21 :** తెలుగుదేశం పార్టీ అంటే ముందుగా గుర్తొచ్చే పేర్లు నందమూరి, నారా కుటుంబాల వారివి. తెలుగుదేశం పార్టీని స్థాపించి 9 నెలల కాలంలోనే అధికారంలోకి తీసుకు రాగలిగారు నందమూరి తారక రామారావు. అయితే చంద్రబాబు ఆ పార్టీకి సుదీర్ఘకాలం అధ్యక్షుడిగాను వ్యవహరించారు. నాలుగు దశాబ్దాల పాటు ఆ పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో చంద్రబాబు పాత్ర మరువరానిది. అయితే ఇప్పుడు ఆ పార్టీకి భవిష్యత్తు నాయకుడు లోకేష్ అనడంలో సందేహం లేదు. తనను తాను ప్రూవ్ చేసుకొని ముందుకు సాగుతున్నారు లోకేష్. తెలుగుదేశం పార్టీని అనధికారిక అధ్యక్షుడిగా కొనసాగుతూ.. పార్టీని సమన్వయం చేసుకోవడమే కాదు బలోపేతం చేయడంలో లోకేష్ ముందుంటున్నారు. అదే సమయంలో నందమూరి కుటుంబం నుంచి బాలకృష్ణ తెలుగుదేశం పార్టీలో యాక్టివ్ గా ఉన్నారు. అయితే ఇప్పుడు నారా కుటుంబం నుంచి మరో యువ నేత రంగంలోకి వస్తారని ప్రచారం నడుస్తోంది. సినీ నటుడు నారా రోహిత్ పొలిటికల్ ఎంట్రీ ఉంటుందని ప్రచారం జోరుగా సాగుతోంది. అందుకు బలం చేకూరుస్తూ ఆయన సైతం ఫుల్ క్లారిటీ ఇచ్చారు.చంద్రబాబు నాయుడుసోదరుడిగా రామ్మూర్తి నాయుడు ఉండేవారు. ఆయన ఒకసారి చంద్రగిరి నుంచి ఎమ్మెల్యేగా కూడా గెలిచారు. చాలా రోజులపాటు అనారోగ్యంతో బాధపడుతూ గత ఏడాది చనిపోయారు రామ్మూర్తి నాయుడు. ఆయన కుమారుడే నారా రోహిత్. తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సాధించుకున్నారు. అయితే ఇంతవరకు ఆయనకు సినిమా రంగంలో సరైన బ్రేక్ తగలలేదు. మొన్ననే వివాహం చేసుకొని ఒక ఇంటి వాడు అయ్యాడు. అయితే తనకు రాజకీయ ఆసక్తి ఉందని తాజాగా వెల్లడించాడు. నారా రామ్మూర్తి నాయుడు జయంతి వేడుకలు ఆయన సొంత గ్రామం నారావారి పల్లెలో జరిగాయి. తండ్రికి నివాళులు అర్పించేందుకు నారా రోహిత్ వెళ్లారు. పొలిటికల్ ఎంట్రీ ఎప్పుడు ఉంటుందా అని మీడియా ప్రతినిధులు అడిగితే.. కచ్చితంగా ఉంటుందని ఆయన చెప్పారు. తనకు రాజకీయాలు అంటే ఇష్టంగా పేర్కొన్నారు. సరైన సమయంలో పొలిటికల్ ఎంట్రీ ఇస్తానని కూడా చెప్పుకొచ్చారు.నారా రామ్మూర్తి నాయుడు అనారోగ్యానికి గురికావడంతో నారా రోహిత్ బాధ్యతలను ఎక్కువగా చంద్రబాబు చూసుకున్నారు. ఆయన పొలిటికల్ గా బిజీగా ఉండడంతో పెద్దమ్మ భువనేశ్వరి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మొన్న రోహిత్ వివాహంలో కూడా భువనేశ్వరి అన్ని తానై వ్యవహరించారు. పెదనాన్న చంద్రబాబు, సోదరుడు లోకేష్ తో రోహిత్ కు మంచి సంబంధాలు ఉన్నాయి. 2024 ఎన్నికల్లో టిడిపి కూటమికి మద్దతుగా రోహిత్ ప్రచారం కూడా చేశారు. లోకేష్ తెలుగుదేశం పార్టీ నాయకత్వ బాధ్యతలు తీసుకుంటే కుటుంబ పరంగా ఆయనకు మద్దతు అవసరం. అందుకే నారా రోహిత్ పొలిటికల్ ఎంట్రీ కి సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఆయన చంద్రగిరి నుంచి బరిలో దిగుతారని నారా అభిమానులు భావిస్తున్నారు. అయితే ప్రత్యక్ష ఎన్నికల్లోనే కాకుండా పార్టీ పరంగా కూడా నారా రోహిత్ సేవలను టిడిపి నాయకత్వం తీసుకునే ఛాన్స్ కనిపిస్తోంది. పెదనాన్న చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన మరుక్షణం టిడిపిలో యాక్టివ్ అయ్యేందుకు నారా రోహిత్ సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# వైసీపీలో కొత్త నియామకాలు

**కడప, మార్చి 5 :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో బలపడేందుకు చేయని ప్రయత్నం అంటూ లేదు. జగన్మోహన్ రెడ్డి సర్వ శక్తులు ఒడ్డుతున్నారు. అన్ని సామాజిక వర్గాల నేతలు మొహరిస్తున్నారు. గత కొద్దిరోజులుగా కాపు సామాజిక వర్గం చుట్టూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు తిరుగుతున్నాయి. మరోవైపు ఎస్సీ సామాజిక వర్గం నేతలతో కూడా జగన్మోహన్ రెడ్డి గట్టిగానే మాట్లాడిస్తున్నారు. ఒకవైపు రాజకీయం చేస్తూనే మరోవైపు రాజకీయంగా బలపడాలని భావిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. అందులో భాగంగా ప్రాంతాలవారీగా పార్టీని బలోపేతం చేసే పనిలో పడ్డారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రతో పాటు గోదావరి జిల్లాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. అందులో భాగంగా పార్టీలో సీనియర్లకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. తాజాగా రీజినల్ కోఆర్డినేటర్లను నియమించారు.గతంలో ఉత్తరాంధ్రను ఒక రీజియన్ గా చూసి నియామకాలు చేపట్టేవారు. ఉత్తరాంధ్రలోని ఉమ్మడి మూడు జిల్లాలకు కలిపి ఒక ప్రాంతీయ సమన్వయకర్తను నియమించిన సందర్భాలు ఉన్నాయి. గతంలో ఉత్తరాంధ్ర పార్టీ సమన్వయకర్తగా విజయసాయిరెడ్డి, వై వి సుబ్బారెడ్డి లాంటివారు వ్యవహరించిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈసారి ఉత్తరాంధ్రను విడగొట్టారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం ఒక రీజియన్ గా చూపి కోఆర్డినేటర్ గా మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడును నియమించారు. మరోవైపు విశాఖ, విజయనగరం రీజియన్ కోఆర్డినేటర్ గా మాజీమంత్రి కురసాల కన్నబాబును, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను ఒక రీజియన్ గా చేసి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను, ఉమ్మడి పశ్చిమగోదావరి రీజియన్కు మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ ను సమన్వయకర్తగా నియమించారు జగన్మోహన్ రెడ్డి. తద్వారా కీలక నేతలందరికీ బాధ్యతలు అప్పగించినట్టు అవుతుంది.గతంలో రాష్ట్రవ్యాప్తంగా ఐదు రీజియన్లను విభజించి కోఆర్డినేటర్లను నియమించేవారు. ఈ నేపథ్యంలో రకరకాల సమస్యలు వచ్చేవి. ఈసారి అన్ని ప్రాంతాలను కవర్ చేస్తూ.. అందరి నేతలకు బాధ్యతలు అప్పగించాలన్న ఆలోచన లోకి వచ్చారు జగన్మోహన్ రెడ్డి. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో కూడా కోఆర్డినేటర్లను నియమిస్తారని తెలుస్తోంది. త్వరలో జగన్మోహన్ రెడ్డి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు. అంతకంటే ముందే రీజనల్ కోఆర్డినేటర్ల నియామకం పూర్తి చేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఆయన అదే పని మీద ఉన్నారు. మరోవైపు రాష్ట్ర కోఆర్డినేటర్ గా ప్రస్తుతం సజ్జల రామకృష్ణారెడ్డి ఉన్నారు. ఆయన స్థానంలో సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు నియమిస్తారని ప్రచారం నడుస్తోంది. అయితే ముమ్ముందు పార్టీ నియామకాల విషయంలో జగన్మోహన్ రెడ్డి కఠిన నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తారని ప్రచారం నడుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో

# ప్రకాశంలో ఫ్యాన్ కు రెక్కలు కరువు

**ఒంగోలు, మార్చి5 :** ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒకప్పుడు వైసీపీ కి బలమైన కోటగా గుర్తింపు పొందింది. వరుస ఎన్నికల్లో పార్టీకి గట్టి మద్దతు ఇచ్చిన ఈ జిల్లా 2024 ఎన్నికలలో మాత్రం భిన్నమైన తీర్పు ఇచ్చింది. దీనికి ప్రతిపక్ష ప్రభావం కంటే, పార్టీ అంతర్గత సమస్యలే ప్రధాన కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రేటర్ రాయలసీమ లో హార్డ్ కోర్ ప్రాంతంగా చెప్పుకునే ప్రకాశం జిల్లా ఇప్పుడు వైసీపీకి ఆత్మపరిశీలన అవసరాన్ని గుర్తు చేస్తోంది.2014 ఎన్నికలలో టీడీపీ , బీజేపీ జనసేన కూటమి బలంగా ఉన్నప్పటికీ, వైసీపీ ఐదు అసెంబ్లీ స్థానాలు గెలుచుకుని తన స్థిరతను చాటుకుంది. 2019లో పరిస్థితి మరింత అనుకూలంగా మారి ఎనిమిది స్థానాలు దక్కించుకుంది. అయితే 2024లో పార్టీ కేవలం రెండు సీట్లకే పరిమితమైంది. అంతేకాకుండా ఒంగోలు లోక్‌సభ స్థానాన్ని కూడా కోల్పోయింది. ఈ పరిణామం జిల్లా రాజకీయాల్లో పెద్ద మార్పుకు సంకేతంగా భావిస్తున్నారు.జిల్లాలో బలమైన నాయకత్వం తగ్గిపోవడం కూడా పార్టీకి ప్రతికూలంగా మారిందని అంటున్నారు. ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి టీడీపీలో చేరి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అలాగే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ( జనసేనలోకి మారడం పార్టీకి పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. ఎన్నికల ముందు పలువురు నేతలు పార్టీని వీడడం వల్ల కేడర్‌లో గందరగోళం ఏర్పడింది.ప్రస్తుతం జిల్లాలో టీడీపీ?జనసేన కూటమి బలంగా ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పది అసెంబ్లీ స్థానాలు ,ఒక ఎంపీ సీటుతో కూటమి ఆధిపత్యం చూపుతోంది. ఈ నేపథ్యంలో వైసీపీకి పునర్వ్యవస్థీకరణ అత్యవసరంగా మారింది. ఓటమి తర్వాత జిల్లా బాధ్యతలను దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి కి అప్పగించినప్పటికీ, పార్టీని మళ్లీ ఉత్సాహపరిచే స్థాయిలో చైతన్యం రాలేదని కేడర్ అభిప్రాయపడుతోంది.ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్అప్పుడప్పుడు మీడియా సమావేశాలు నిర్వహించినా, కేడర్‌తో ప్రత్యక్ష సంబంధం పెంచే చర్యలు కనిపించడం లేదని అంటున్నారు. జిల్లాలో సీనియర్ నాయకుడిగా ఉన్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి కూడా చురుకుదనం చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా పార్టీ కార్యకర్తలు నాయకత్వంపై స్పష్టమైన దిశానిర్దేశం కోరుతున్నారు.ఓటమి జరిగి ఇరవై నెలలు గడుస్తున్నప్పటికీ, జిల్లా స్థాయిలో నిరాశ వాతావరణం కొనసాగుతోందని చెబుతున్నారు. పార్టీని మళ్లీ బలోపేతం చేయాలంటే సమన్వయం, చురుకైన నాయకత్వం , కేడర్‌కు ధైర్యం చెప్పే కార్యక్రమాలు అవసరమని భావిస్తున్నారు. అధినాయకత్వం ప్రకాశం జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టకపోతే భవిష్యత్తులో మరింత ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు సూచిస్తున్నాయి.

# ఏపీలో కొత్త రాజకీయ పార్టీ



**విజయవాడ, మార్చి 21 :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో రెడ్డి సామాజిక వర్గం కొత్త రాజకీయ వేదిక కోసం ఆలోచిస్తున్నదా అనే ప్రశ్న తాజాగా చర్చకు వస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి తమకు ప్రత్యేక రాజకీయ పార్టీ అవసరమనే భావన కొంతమంది నేతల్లో బలపడుతున్నట్టు సమాచారం. ఈ దిశగా రాష్ట్రంలోని సీమ ప్రాంతంతో పాటు నెల్లూరు ప్రాంతానికి చెందిన నాయకులు చర్చలు జరుపుతున్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రెడ్డి వర్గం పెద్దఎత్తున మద్దతు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే తరువాతి కాలంలో తమకు తగిన ప్రాధాన్యం దక్కలేదనే భావన ఆ వర్గంలో పెరిగిందని అంటున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో రెడ్లకు ఇవ్వాల్సిన అవకాశాలు ఇతర వర్గాలకు కేటాయించారనే అసంతృప్తి వ్యక్తమైంది. అలాగే పరిశ్రమలు, వ్యాపార రంగాల్లో ఉన్న ప్రముఖులను కూడా ప్రభుత్వం ప్రోత్సహించలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.2024 ఎన్నికల ఫలితాల తర్వాత పరిస్థితి మరింత మారిందని విశ్లేషకులు అంటున్నారు. పార్టీ ఓటమి అనంతరం రెడ్డి వర్గంతో ప్రత్యేక సమావేశాలు జరగకపోవడం, వారి సమస్యలపై చర్చలు లేకపోవడం అసంతృప్తికి దారితీసిందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తమకు సొంత రాజకీయ వేదిక ఉండాలనే ఆలోచన కొంతమంది నాయకుల్లో బలపడుతోంది.మరోవైపు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిల వైపు కూడా కొంత ఆశతో చూసినప్పటికీ, ఆమె రాజకీయ వ్యూహాలు భిన్నంగా ఉండటంతో పెద్దగా ఆకర్షణ కలగలేదని అంటున్నారు. తెలుగుదేశం పార్టీలో కూడా రెడ్డి వర్గానికి ప్రాధాన్యం ఉందని చెప్పినా, క్షేత్రస్థాయిలో ఆశించినంత స్థాయి లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారతీయ జనతా పార్టీ పై హిందుత్వ ముద్ర ఉండటంతో అందరూ ఆ దిశగా వెళ్లడం లేదని చెబుతున్నారు. జనసేన పార్టీ విషయంలో కూడా పెద్ద ఎత్తున మద్దతు కనిపించడం లేదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.ఈ పరిణామాల మధ్య తెలంగాణ లో నివసిస్తున్న ఏపీకి చెందిన రెడ్డి నాయకులతో కూడా సంప్రదింపులు జరుగుతున్నట్టు సమాచారం. త్వరలో హైదరాబాద్ లో విస్తృత స్థాయి చర్చలు నిర్వహించే ఆలోచన ఉందని చెబుతున్నారు. ఒకవేళ కొత్త పార్టీ ఆవిర్భవిస్తే రాష్ట్ర రాజకీయ సమీకరణాలు మారే అవకాశముందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.అయితే ఈ అంశంపై అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదు.కాంగ్రెస్ పార్టీ అంటేనే రెడ్డి సామాజిక వర్గం. అంతలా ఉండేది ఆ పార్టీలో సామాజిక వర్గ ప్రభావం. అటువంటి కాంగ్రెస్ పార్టీ ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న తరుణంలో.. వైయస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ బాధ్యతలు తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు సుదీర్ఘ పాదయాత్ర చేశారు. రాజశేఖర్ రెడ్డి నాయకత్వం కింద రెడ్డి సామాజిక వర్గమంతా పనిచేసింది. దీంతో 2004లో తొలిసారిగా అధికారంలోకి వచ్చింది. 2009లో సైతం రెండోసారి అధికారం చేపట్టింది కాంగ్రెస్ పార్టీ. దానికి ముమ్మాటికి కారణం రెడ్డి సామాజిక వర్గం మద్దతు. రాజశేఖర్ రెడ్డి మరణంతో రెడ్డి సామాజిక వర్గమంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గూటికి చేరింది. ఆ సామాజిక వర్గమంతా జగన్మోహన్ రెడ్డిని ఓన్ చేసుకున్నారు. కానీ ఆయన అనుకున్న స్థాయిలో రెడ్డి సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. రెడ్డి సామాజిక వర్గం నియోజకవర్గాల్లో సైతం ఇతరులకు అవకాశాలు కల్పించారు జగన్మోహన్ రెడ్డి. తన ఐదేళ్ల పాలనలో రెడ్డి సామాజిక వర్గానికి ప్రత్యేకంగా ఒనగూరే ప్రయోజనాలు లేకుండా పోయాయి. దీంతో ఆ సామాజిక వర్గం మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సహాయ నిరాకరణ చేసింది.అయితే ఓటమి తర్వాత కూడా జగన్మోహన్ రెడ్డి వైఖరిలో మార్పు రావడం లేదు. రెడ్డి సామాజిక వర్గం విషయంలో ప్రత్యేక ఆలోచనలు చేయడం లేదు. ఈ పరిస్థితుల్లో తమకోసం ఒక ప్రత్యేక రాజకీయ పార్టీ ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి రెడ్డి సామాజిక వర్గం ప్రముఖులు వచ్చినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ వేదికగా ఇందుకు సంబంధించి సన్నాహక సమావేశాలు నిర్వహించేందుకు రెడ్డి సామాజిక వర్గం ప్రముఖులు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఒక ప్రత్యేక అజెండాతో ముందుకు సాగుతూ.. ఎన్నికల సమయానికి కలిసివచ్చే రాజకీయ పార్టీలతో ముందడుగు వేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# రికార్డులు బ్రేక్..

# అత్యధిక గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదు

**హైదరాబాద్, మార్చి 2 :** తెలంగాణలో విద్యుత్ వినియోగం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇవాళ 6,267 మెగావాట్లకు చేరుకుంది. దీనికి కారణంగా ఎండల తీవ్రత పెరగటమేనని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వెల్లడించారు. రానున్న రోజుల్లో మరింత విద్యుత్ వినియోగం ఉంటుందని అందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. ఈసారి ఫిబ్రవరి రెండో వారం నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఉదయం 8 తర్వాత నుంచే ఎండలు భగ భగ మండుతున్నాయి. మధ్యాహ్నం సమయానికి కాలు బయట పెట్టలేని పరిస్థితి. ఇక రాత్రి సమయాల్లో తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. విద్యుత్ వినియోగంలో సరికొత్త రికార్డులు నమోదవుతున్నాయి. టీజీఎన్‌పీడీసీఎల్ చరిత్రలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా ఫిబ్రవరి చివరి వారంలో శనివారం గరిష్ట విద్యుత్ డిమాండ్ 6,057 మెగావాట్లు నమోదు అయింది.తాజాగా ఆ రికార్డు సైతం చెరిగిపోయింది. ఇవాళ చరిత్రలోనే అత్యధిక గరిష్ట విద్యుత్ డిమాండ్ 6,267 మెగావాట్లు నమోదైనట్లు టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడించారు. శనివారం నమోదైన హై పీక్ డిమాండ్ కొన్ని గంటల వ్యవధిలోనే అధిగమించిపోయిందని చెప్పారు. టీజీఎన్‌పీడీసీఎల్ చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలిచిందని ఆయన స్పష్టం చేశారు. రోజురోజుకు ఎండలు మండిపోతుండటంతో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరుగుతోందని వెల్లడించారు. అయినా సరే ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు తాము ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.డిమాండ్ ఎంత పెరిగినా విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా విద్యుత్ అందించేందుకు సంస్థ పూర్తిగా సమాయత్తమై ఉందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఉన్నతాధికారుల పర్యవేక్షణ, దిశానిర్దేశంతో తెలంగాణ విద్యుత్ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే తమ లక్ష్యమని అన్నారు. రానున్న రోజుల్లో డిమాండ్ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అందుకు సంస్థ పూర్తిగా సిద్ధంగా ఉందని.. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా చర్యలు తీసుకుంటున్నామని సీఎండీ వివరించారు.కాగా, ఈ ఏడాది వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఇప్పటికే ఐఎండీ స్పష్టం చేసింది. మార్చి చివరి వారం నుంచి మే వరకు వడగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెప్పారు.


చాకిరేవు
తెలుగు దినపత్రిక
Chakirevu Telugu Daily
సినిమా
CINEMA

# పవన్ మూవీ.. సురేందర్ రెడ్డి అలా చేయకపోతే..



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో దర్శకుడు సురేందర్ రెడ్డి చేయనున్న ప్రాజెక్ట్ టాలీవుడ్ లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు స్టైలిష్ కమర్షియల్ ఎంటర్టైనర్లతో టాప్ డైరెక్టర్లలో స్థానం సంపాదించిన సురేందర్ రెడ్డి.. గత కొన్నేళ్లుగా మాత్రం వరుస ఫ్లాప్స్ తో వెనుకబడ్డారు. కిక్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన, అదే సినిమాకు సీక్వెల్ గా వచ్చిన కిక్-2తో భారీ డిజాస్టర్ ఎదుర్కొన్నారు. ఆ తర్వాత కొంత గ్యాప్ తీసుకున్న సురేందర్ రెడ్డి, రామ్ చరణ్ తో ధృవ సినిమాను తెరకెక్కించి హిట్ అందుకున్నారు. అయితే అది తమిళ రీమేక్ కావడంతో పూర్తి స్థాయి ఒరిజినల్ క్రెడిట్ ఆయనకు దక్కలేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. తర్వాత మెగాస్టార్ చిరంజీవి తో రూపొందించిన సైరా నరసింహ రెడ్డి భారీ అంచనాలతో విడుదలైంది. విమర్శకుల ప్రశంసలు అందుకున్నప్పటికీ, పాన్ ఇండియా స్థాయిలో ఆశించిన వసూళ్లు రాబట్టలేకపోయింది. ఇక ఇటీవల అఖిల్ అక్కినేని హీరోగా తెరకెక్కిన ఏజెంట్ సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. ఆ చిత్రం అతిపెద్ద డిజాస్టర్లలో ఒకటిగా నిలవడంతో సురేందర్ రెడ్డి కెరీర్ పై ప్రశ్నలు తలెత్తాయి. అలాంటి పరిస్థితుల్లోనే ఇప్పుడు పవన్ కళ్యాణ్‌తో ఆయన చేయబోతున్న కొత్త సినిమా కీలకంగా మారింది. స్టార్ హీరో పవన్ కళ్యాణ్ తో మూవీ అనగానే అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో ఆ ప్రాజెక్ట్ సురేందర్ రెడ్డికి కమ్ బ్యాక్ మూవీగా నిలుస్తుందా అన్న చర్చ ఇండస్ట్రీలో సాగుతోంది. అయితే పవన్ కళ్యాణ్ మాస్ ఇమేజ్, సురేందర్ రెడ్డి స్టైలిష్ టేకింగ్ కలిస్తే ఒక పవర్ ఫుల్ కమర్షియల్ ఎంటర్టైనర్ రావొచ్చనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. అయితే సురేందర్ రెడ్డి సినిమాల్లో స్టైలిష్ ప్రెజెంటేషన్, హీరో ఎలివేషన్స్ ప్రధానంగా ఉంటాయి. కానీ ప్రస్తుత ట్రెండ్ ను పరిశీలిస్తే, కేవలం ఎలివేషన్స్ తో సరిపోదని స్పష్టమవుతోంది. ప్రేక్షకులు ఇప్పుడు స్ట్రాంగ్ స్టోరీ, ఎమోషన్స్, కంటెంట్ కు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇటీవల విజయాలు సాధించిన చిత్రాలు కూడా ఇదే విషయాన్ని రుజువు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్‌తో తెరకెక్కించే కొత్త సినిమా విషయంలో సురేందర్ రెడ్డి మరింత జాగ్రత్తగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. మాస్ అంశాలతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా కథను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ ఇమేజ్ కు సరిపోయే కథతో పాటు భావోద్వేగానికి కూడా ప్రాధాన్యత ఇస్తేనే సినిమా విజయవంతం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. లేకుంటే కష్టమనే చెప్పాలి. అయితే అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో సాగే పక్కా మాస్ ఎంటర్టైనర్ గా సినిమా రూపుదిద్దుకోనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఎస్ఆర్ టీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై నిర్మాత రామ్ తాళ్లూరి ఆ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దాదాపు రూ. 250 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమా తెరకెక్కే అవకాశముందని సమాచారం.

# మల్టీస్టారర్ లో మరో భామగా కయాదు లోహర్!



టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తనదైన మార్క్ ఎంటర్టైన్మెంట్ కోసం మరో భారీ మల్టీస్టారర్ సిద్ధం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో హీరోలుగా విక్టరీ వెంకటేష్..నందమూరి కల్యాణ్ రామ్ నటిస్తున్నారు. ఇద్దరు చేతులు కలపడం ఇదే తొలిసారి కావడంతో? ఆ కాంబినేషన్ లో సినిమా ఎలా ఉ ంటుందని సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా అనీల్ కథతో పాటు ఆ కథలో పాత్ర ధారులపై దృష్టి పెట్టాడు. ఇప్పటికే వెంకటేష్‌కు జోడీగా అభినేత్రి కీర్తి సురేష్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఇద్దరు ఇంత వరకూ జోడీ కట్టలేదు. అనీల్ అందుకు ఛాన్స్ తీసుకున్నాడు. సీనియర్ హీరోలకు కీర్తి ఇప్పుడు పర్ఫెక్ట్ ఛాయిస్ గానూ చెప్పొచ్చు. దీంతో వెంకీ-కీర్తి మధ్య కెమిస్ట్రీ కూడా వర్కౌట్ అవుతుందని భావిస్తున్నారంతా. దీంతో కల్యాణ్ రామ్ సరసన ఛాన్స్ అందుకునే నటి ఎవరు? అన్నది ఆసక్తికరంగా మారిన తరుణంలో ఓ క్రేజీ బ్యూటీ పేరు తెరపైకి వచ్చింది. అనీల్ అనిల్ రావిపూడి హాట్ బ్యూటీ కయాదు లోహర్ పేరును పరిశీలిస్తున్నట్లు తెలిసింది. కయాదు గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. అల్లూరి వంటి చిత్రంతో టాలీవుడ్‌కు పరిచయమైంది. అటుపై డ్రాగన్ తో కుర్రాళ్లలో క్రేజీ బ్యూటీ మారిపోయింది. ఆ విజయం అమ్మడికి మంచి ఫాలోయింగ్ తెచ్చి పెట్టింది.దీంతో ఫంకీ, ది ప్యారడైజ్ లాంటి చిత్రాల్లో ఛాన్సులందుకుంది. ఫంకీ నిరాశపరిచినా ప్యారడైజ్ పై మాత్రం భారీ అంచనాలే ఉన్నాయి. ఇతర భాషల్లోనూ బిజీగా మారింది. అనీల్ ప్రాజెక్ట్ విషయానికి వస్తే సాధారణంగా అనీల్ సినిమాల్లో హీరోయిన్లకు కూడా ప్రాధాన్యత ఉండేలా పాత్రలను డిజైన్ చేస్తాడు. ఈ మల్టీస్టారర్‌లో కయాదు లోహర్ పాత్ర చాలా రిఫ్రెషింగ్‌గా ఉంటుందని తెలుస్తోంది. కళ్యాణ్ రామ్ గంభీరమైన పాత్రకు ఈమె పాత్ర చక్కగా సెట్ అవుతుందని అనీల్ బలంగా నమ్ముతున్నాడుట. ప్రస్తుతం కయాదు లోహర్ పేరు చర్చల దశలోనే ఉంది. కానీ ఖరారు అవ్వడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సోర్సెస్ ద్వారా తెలిసింది. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఈ మల్టీస్టారర్ కూడా ప్రధానంగా కామెడీ , ఫ్యామిలీ ఎమోషన్స్ చుట్టూ తిరుగుతుందని వినిపిస్తోంది.. కళ్యాణ్ రామ్ ఒక కొత్త లుక్‌లో, కాస్త ఫన్ జోనర్‌లో కనిపించబోతున్నారని టాక్. అనీల్ కు బాగా కలిసొచ్చిన జానర్ ఇది. కథ విషయంలో అనీల్ ఎప్పుడూ నేల విడిచి సాము చేయడు. పాత కథనే కొత్త ట్రీట్ మెంట్ తో చెప్పడం అలవాటు. అతడి విజయ రహస్యం కూడా అదే.

# సీనియర్ హీరోల డైలమా పెద్ద ప్రాబ్లమే!



బాలీవుడ్ వెండితెరను దశాబ్దాల పాటు ఏకఛత్రాధిపత్యంగా ఏలిన ఖాన్ త్రయం షారుఖ్, సల్మాన్, అమీర్ ఖాన్.ప్రస్తుతం ఈ ముగ్గురు అత్యంత క్లిష్టమైన దశను ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వీరి పేరు చెబితే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిసేది. కానీ మారుతున్న ప్రేక్షకుల అభిరుచుల దృష్ట్యా ఇప్పుడు సరైన జానర్‌ను ఎంచుకోవడంలో తీవ్రమైన డైలమాలో పడుతున్నారు. వరుస ఫెయిల్యూర్స్ లేదా లాంగ్ బ్రేక్స్ తీసుకోవడం వల్ల బాలీవుడ్‌లో ఖాన్ల శకం ముగిసిందా? అన్న చర్చా లేకపోలేదు. షారుఖ్ ఖాన్ విషయానికొస్తే పఠాన్, జవాన్ వంటి చిత్రాలతో భారీ విజయాలను అందుకున్నప్పటికీ, ఆ తర్వాత మళ్లీ తనదైన మార్క్ కథలను ఎంచుకోవడంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. మరోవైపు అమీర్ ఖాన్ లాల్ సింగ్ చడ్డా పరాజయం తర్వాత సుదీర్ఘ విరామం తీసుకున్నారు. కంటెంట్ విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండే అమీర్ సైతం ఇప్పుడున్న ట్రెండ్‌కు తగ్గట్టుగా ఏ కథతో రావాలో? తెలియక సతమతమవుతున్నట్లు కనిపిస్తోంది. వీరిద్దరి పరిస్థితి ఇలా ఉంటే సల్మాన్ ఖాన్ తన రెగ్యులర్ మాస్ ఫార్ములా చిత్రాలతో ఆశించిన ఫలితాలను అందుకోలేకపోతున్నారు.ప్రస్తుతం ప్రేక్షకులు కేవలం స్టార్ ఇమేజ్‌ను చూసి థియేటర్లకు రావడం లేదు. సౌత్ ఇండియా నుంచి రిలీజ్ అయిన పుష్ప, ఆర్ఆర్ఆర్, కేజీఎఫ్ వంటి చిత్రాలు బాలీవుడ్ మార్కెట్‌ను శాషించడంతో ఖాన్ హీరోలకు గట్టి పోటీ ఎదురవుతోంది. పాన్-ఇండియా స్థాయిలో భారీ యాక్షన్ డ్రామాలు లేదా వెరైటీ కాన్సెప్ట్‌లు ఉంటేనే జనాలు ఆదరిస్తున్నారు. ఈ క్రమంలో పాతకాలపు రొమాంటిక్ , రొటీన్ మాస్ కథలనే నమ్ముకోవడం వల్ల వీరి మార్కెట్ దెబ్బతింటోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వరుసగా ఎదురవుతోన్న పరాజయాలు , సినిమాల మధ్య పెరిగిన గ్యాప్ కారణంగా బాలీవుడ్ జనాలు కొత్త తరం హీరోల వైపు మొగ్గు చూపుతున్నారు. రణబీర్ కపూర్, రణవీర్ సింగ్ వంటి యువ హీరోలు వైవిధ్యమైన పాత్రలతో దూసుకుపోతుండటంతో సీనియర్ల హవా తగ్గుతోందనేది వాస్తవం. 50 ఏళ్లు పైబడిన ఈ హీరోలు ఇంకా యువకుల్లాగే రొమాంటిక్ పాత్రలు చేయడం కంటే? తమ వయసుకు తగ్గట్టుగా అమితాబ్ బచ్చన్ తరహాలో పవర్‌ఫుల్ క్యారెక్టర్ రోల్స్ లేదా సీరియస్ డ్రామాల వైపు వెళ్లాలని సోషల్ మీడియాలో కామెంట్స్ లేకపోలేదు. అయితే వీరి శకం ముగిసిందని ఇప్పుడే చెప్పడం తొందరపాటే అవుతుంది. ఎందుకంటే ఖాన్ హీరోలకు ఉన్న ఫ్యాన్ బేస్ అంతర్జాతీయ స్థాయిలో ఉంది. ఒక్క సరైన హిట్ పడితే మళ్లీ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయగల సత్తా వీరికి ఉ ంది. ప్రస్తుతం వీరు ఎదుర్కొంటున్న ఈ డైలమా కేవలం తాత్కాలికమే. సరైన దర్శకుడు బలమైన కథ దొరికితే మళ్లీ విశ్వరూపం చూపిస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఖాన్ త్రయం తమ ఇమేజ్‌ను కాపాడుకోవాలంటే ప్రస్తుత పాన్-ఇండియా ట్రెండ్‌ను అర్థం చేసుకుని ముందుకు సాగాలి. కంటెంట్ పరంగా రాజీ పడకుండా, కొత్త దర్శకులతో ప్రయోగాలు చేస్తేనే వారు మళ్లీ ఫామ్‌లోకి వచ్చే అవకాశం ఉంది. బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద మళ్లీ ఖాన్ల గర్జన వినిపించాలంటే? వారు తమ పాత ఫార్ములాలను వీడి కొత్త బాట పట్టక తప్పదు. మరి రాబోయే రోజుల్లో వీరు ఏ విధమైన నిర్ణయాలు తీసుకుంటారో చూడాలి.




మెగా డాటర్ నిహారిక కొణిదెల ఇప్పుడు ఒకవైపు సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్‌గా, మరోవైపు సోషల్ మీడియా క్వీన్‌గా దూసుకుపోతున్నారు. తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, సహజమైన అందంతో నిత్యం వార్తల్లో నిలిచే నిహారిక, తాజాగా బ్లాక్ డ్రెస్‌లో మెరిసిపోతూ అభిమానుల మతి పోగొట్టారు. “ఈ డ్రెస్ నన్ను చాలా హ్యాపీగా ఉంచింది” అంటూ ఆమె షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. కేవలం గ్లామర్ మాత్రమే కాదు, తన కొత్త సినిమా ‘రాకాస’ ప్రమోషన్లతో కూడా ఆమె రచ్చ చేస్తున్నారు. ఆ విశేషాలు చూద్దాం.. నిహారిక కొణిదెల స్టైల్ ఎప్పుడూ డిఫరెంట్‌గా ఉంటుంది. తాజాగా ఆమె ఫుల్ లెన్త్ బ్లాక్ ఫ్రాక్‌లో అద్భుతమైన ఫోటో షూట్ చేశారు. ఆ డ్రెస్‌లో ఆమె చూపిస్తున్న చిరునవ్వు, ఆత్మవిశ్వాసం కుర్రకారును ఫిదా చేస్తున్నాయి. “ఝుఅ ఎశీబ్ వశ్రీశ్రీ ష్ఘ్ష్ ష్త్రఅం ఎతీవంం ఝుఎవ ఎవ తీఝుశ్రీశ్రీఎ ష్ఘుజూజూఎ?” అంటూ ఆమె అడిగిన ప్రశ్నకు నెటిజన్లు “మీ స్మైల్ ఇంకా బాగుంది” అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. నిర్మాతగా బిజీగా ఉన్నా, తన గ్లామర్ టచ్‌తో ఫ్యాన్స్‌ను అలరించడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య అని మరోసారి నిరూపించుకున్నారు.

# అత్త మనసు గెలిచిన ముద్దుల కోడలు!



విజయ్ దేవరకొండ- రష్మిక మందన్నల బంధం వెండితెరపై మొదలై నేడు అందమైన వైవాహిక జీవితం వరకు చేరుకుంది. ఉ దయ్‌పూర్‌లో వీరి వివాహం అత్యంత అట్టహాసంగా జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఈ బంధంలో అత్యంత ఆసక్తికరమైన హృదయాన్ని హత్తు కునే అంశం ఏంటంటే? అత్త మాధవి దేవరకొండ - కోడలు రష్మిక మధ్య ఉన్న అద్భుతమైన అనుబంధం. కోడలిగా కంటే ఒక కూతురిలా రష్మికకు మాధవి ఇస్తోన్న గౌరవం, చూపిస్తున్న ప్రేమ చూసి అభిమానులు మురిసిపోతున్నారు. ఇటీవల జరిగిన -తెలంగాణ గద్దర్ మూవీ అవార్డ్స్- వేదికపై ఈ బంధం మరోసారి అందరికీ స్పష్టమైంది. -ది గర్ల్ ఫ్రెండ్ సినిమాకు గాను ఉత్తమ నటిగా అవార్డు అందుకున్న రష్మిక వేదికపై మాట్లాడుతూ తన అత్తగారి గురించి ఎంతో భావోద్వేగంగా స్పందించింది. -నేను కోడలు కాకముందు నుంచే మీరు నన్ను కూతురిలా ప్రేమించారు. ఈ రోజు అధికారికంగా కోడలిగా మీ ముందు నిలబడటం నాకు ఎంతో గర్వంగా ఉంది- అని రష్మిక పేర్కొనడం అందరినీ కదిలించింది. రష్మిక మాటలకు అత్త మాధవి ఆనందంతో కన్నీళ్లు పెట్టుకోవడం అక్కడున్న వారందరినీ ఎంతగానో అలరించింది. విజయ్ తల్లి మాధవి కూడా గతంలోనే తమ కోడలు ఎలా ఉండాలో తన మనసులో మాటను బయటపెట్టారు. -నా కొడుకును కంటికి రెప్పలా చూసుకునే కోడలు వస్తే చాలు. నా కొడుకును బేషరతుగా ప్రేమించే వ్యక్తి కావాలి- అని ఆమె కోరుకున్నారు. రష్మికలో తాను కోరుకున్న ఆ లక్షణాలన్నీ కనిపించాయి. ఇప్పుడు మాధవి కోడలు ఒక స్టార్ హీరోయిన్ మాత్రమే కాదు. తన కుటుంబంలో ఒక భాగమని మాధవి గర్వంగా భావిస్తున్నారు. అందుకే రష్మిక గెలిచిన ప్రతి విజయంలోనూ అత్తమ్మను భాగస్వామిని చేస్తోంది. వీరి మధ్య ఉన్న అనుబంధం కేవలం మాటలకే పరిమితం కాలేదు. బయట తిరిగేటప్పుడు కూడా రష్మిక తన అత్తగారితో కలిసి ఉండటానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుంది. ఆ అవార్డు ఫంక్షన్‌కు కూడా మాధవి గారితోనే కలిసి వెళ్లడం చూడొచ్చు. స్టేజ్ మీద ఆమెను ఉద్దేశించి -పాపలు (అత్తమ్మ) నేను సాధించాను.. ఇక ఇంటికి వెళ్లి పార్టీ చేసుకుందాం- అని రష్మిక సరదాగా అనడం వారి మధ్య ఉన్న స్వేచ్ఛను , స్నేహాన్ని తెలియజేస్తుంది. ఇలాంటి బాధ్యతాయుతమైన కోడలు, ప్రేమిస్తున్న అత్తగారి కాంబినేషన్ చూడటం నిజంగా అరుదని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. వీరి మధ్య ఉన్న ఈ సాన్నిహిత్యం ఇతర సెలబ్రిటీలకు అంతే అవసరం. ముఖ్యంగా కొత్తగా పెళ్లైన జంటలకు ఒక మంచి ఉదాహరణగా నిలుస్తోంది. విజయ్ - రష్మిక తమ వృత్తిపరమైన విజయాలను కుటుంబంతో ఎలా పంచుకుంటున్నారో? రష్మిక తన అత్తగారితో ఏర్పరచుకున్న ఈ అనుబంధం కూడా అంతే అందంగా ఉంది. రష్మిక కుటుంబం పట్ల చూపిస్తున్న ఆప్యాయత, విజయ్ దేవరకొండ ఇంట్లో ఆమెను ఒక కోడలిగా కాకుండా, ఆ ఇంటికి వచ్చిన మహాలక్ష్మిలా, సొంత కూతురిలా చూసుకుంటున్నారని స్పష్టమవుతోంది. మొత్తానికి వెండితెరపై విజయ్-రష్మికలు ఎంతటి క్రేజీ జోడీనో? నిజ జీవితంలో అత్తా-కోడళ్లుగా మాధవి-రష్మికలు కూడా అంతటి క్రేజీ జంటగా మారిపోయారు. రష్మిక సక్సెస్‌ను చూసి అత్తగారు మురిసిపోతుంటే అత్తగారి ప్రేమను చూసి రష్మిక గర్వపడుతుంది. ఈ అందమైన కుటుంబ బంధం అందరికీ స్ఫూర్తినిస్తోంది. వీరిద్దరి మధ్య ఉ న్న ఈ బంధం రాబోయే రోజుల్లో మరిన్ని మధురమైన జ్ఞాపకాలను మిగిల్చుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.

# గిగ్ కార్మికుల సంక్షేమం, న్యాయవాదుల రక్షణ.. పలు కీలక బిల్లులను ఆమోదించిన క్యాబినెట్..!



చాకిరేవు ప్రతినిధి : అసెంబ్లీ సమావేశాల్లో పలు కీలక బిల్లులకు ప్రభ్వుత్వం అమోదం తెలిపింది. విద్వేష పూరిత ప్రసంగాల నిరోధక బిల్లు, గిగ్ కార్మికుల సంక్షేమం బిల్లుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. అలానే.. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించేందుకు ప్రభుత్వం ఒకే చెప్పింది. తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లు, కుల గణనపై స్వతంత్ర నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను కేబినెట్ ఆమోదించింది. విద్యాలయాల్లో కుల వివక్షను నియంత్రించేందుకు రోహిత్ వేముల చట్టం విధివిధానాల రూపకల్పన కోసం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 1. విద్వేషపూరిత ప్రసంగాలు.. విద్వేష పూరిత నేరాల నిరోధక బిల్లు (తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్ ప్రివెన్షన్ బిల్లు 2026) ను మంత్రివర్గం ఆమోదించింది. మత సామరస్యాన్ని భంగం కలిగించే పోస్టులు, అల్లర్లు ఘర్షణలు ప్రేరేపించే ప్రసంగాలను కట్టడి చేసేందుకు ఈ బిల్లును రూపొందించారు. 2. గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల సంక్షేమం.. భద్రత కోసం రూపొందించిన "తెలంగాణ ప్లాట్ ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్, సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్) యాక్ట్ , 2026" బిల్లును ఆమోదించిన కేబినెట్. రాష్ట్రంలో దాదాపు 4.2 లక్షల మంది గిగ్ వర్కర్స్, ప్లాట్ ఫారం బేస్డ్ వర్కర్స్ ఉన్నారు. కొత్త బిల్లు ప్రకారం వర్కర్స్ రిజిస్ట్రేషన్ తో పాటు వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు, సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తారు. ఈ బిల్లు ప్రకారం.. గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపు, సామాజిక భద్రత లభించడంతో పాటు వారి సంక్షేమానికి బోర్డు ఏర్పాటు చేయడంతో వారి హక్కులకు రక్షణ లభిస్తుంది. గతంలో మంత్రివర్గం ఆమోదించిన బిల్లును ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన సోషల్ సెక్యూరిటీ కోడ్‌కు అనుగుణంగా స్వల్ప మార్పులతో కేబినెట్ ఆమోదించింది. 3. హైదరాబాద్‌లో ప్రస్తుతం 69 కిలోమీటర్ల విస్తరించిన మెట్రో వ్యవస్థను ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి స్వాధీనం చేసుకునే చర్యలు వేగవంతం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రుణభారం సహా మొత్తం రూ.15 వేల కోట్లను ఎల్ అండ్ టీకి చెల్లించి ఫేజ్ 1 ప్రాజెక్టు స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందని ఇప్పటికే సబ్ కమిటీ నివేదికను సమర్పించింది. ప్రభుత్వం తరపున ఈ నిధుల చెల్లింపులు, లావాదేవీల బాధ్యతను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ కు అప్పగించింది. HMRL ను నోడల్ ఏజెన్సీ గా నియమించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 4. తెలంగాణ అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. న్యాయవాదుల పై జరుగుతున్న దాడుల ఘటనలను కట్టడి చేసేందుకు, న్యాయవాదులకు రక్షణ కల్పించేందుకు ఈ బిల్లు రూపొందించారు. గతంలో జరిగిన అడ్వకేట్ దంపతులు వామనరావు, హత్యల నేపథ్యంలో న్యాయవాదులకు రక్షణ, తగిన భద్రత కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించింది. 5. రాష్ట్రంలో చేపట్టిన కులగణనను అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ నివేదికను కేబినెట్ ఆమోదించింది. ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ వర్కింగ్ గ్రూప్ చైర్మన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి అధ్వర్యంలోని నిపుణుల కమిటీ ఈ నివేదిక తయారు చేశారు. నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికలోని అంశాలను కేబినెట్ చర్చించింది. సామాజిక న్యాయం, అన్ని వర్గాల సాధికారత లక్ష్యంగా దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, కుల సర్వేను నిర్వహించింది. 2024 నవంబర్ 6వ తేదీ నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకు 50 రోజుల పాటు రాష్ట్రమంతటా సర్వే నిర్వహించింది. నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించే బాధ్యతను కేబినెట్ సబ్ కమిటీకి అప్పగించింది. 6. విద్యాలయాల్లో కుల వివక్షను నియంత్రించేందుకు ఉద్దేశించిన రోహిత్ వేముల చట్టం విధివిధానాల రూపకల్పనకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం. మంత్రివర్గం ఉప సంఘం సభ్యులుగా దామోదర రాజనరసింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఎంపికయ్యారు. 7. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఆదరించని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల వేతనాల నుంచి 15 శాతం లేదా రూ.10 వేలు ఏది తక్కువైతే ఆ మొత్తం వేతనాల నుంచి పరిహరించి తల్లిదండ్రులకు అందజేసే తల్లిదండ్రుల మద్దతు బిల్లును ఆమోదించిన క్యాబినెట్.

# ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి:

## - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

నిర్మల్ మార్చి 23 (చాకిరేవు జిల్లా ప్రతినిధి) ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆమె స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి



దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ వసతి గృహాలు తనిఖీ చేస్తూ ఉండాలని తెలిపారు. వేసవికాలం దృష్ట్యా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాసర ట్రిపుల్ ఐటీలో తాజా పరిస్థితిపై మంత్రి జూపల్లి సమీక్ష


నిర్మల్ మార్చి 23 (చాకిరేవు జిల్లా ప్రతినిధి) బాసర ట్రిపుల్ ఐటీ (ఆర్జీయూకేటీ)లో నెలకొన్న పరిస్థితులు, విద్యార్థుల నిరసనలు, తదనంతరం సెలవులు ప్రకటించడం, తదితర అంశాలపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. క్యాంపస్‌లో ప్రస్తుత స్థితిగతులను, విద్యార్థుల ఆందోళనల వెనుక ఉన్న కారణాలను బాసర ట్రిపుల్ ఐటీ



వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ మురళీ దర్శన్ మంత్రికి వివరించారు. క్యాంపస్‌లో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా, ముందస్తు జాగ్రత్తగా సెలవులు ప్రకటించాల్సి వచ్చిందని వీసీ గోవర్ధన్ మంత్రికి తెలిపారు. విద్యార్థుల ప్రధాన డిమాండ్లు, సెలవుల ప్రకటనకు దారితీసిన పరిణామాలను ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంతో ప్రతిభావంతులని, కేవలం ఆవేశంతో ఆందోళనలు చేస్తూ తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని హితవు పలికారు. సమస్యలు ఏవైనా ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. క్యాంపస్‌లో మౌలిక వసతులు, విద్యా ప్రమాణాల మెరుగుదల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన అధికారులకు తేల్చి చెప్పారు. త్వరలోనే క్యాంపస్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని వీసీని మంత్రి ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత ట్రిపుల్ ఐటిని సందర్శించి, విద్యార్థులతో చర్చిస్తానని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి

చాకిరేవు ప్రతినిధి : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (53) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి జిల్లా కలెక్టర్



సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత తో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (53) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ శాఖ --10, ఇతర శాఖలకు --43, మొత్తం 53 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహాశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి ఐటిఐలో ఘనంగా షహీద్ దివస్ మై భారత్ అధ్వర్యంలో 'పాదయాత్ర' సేవా కార్యక్రమాలు..






పెద్దపల్లి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటిఐ) పెద్దపల్లిలో 'మై భారత్' ఆధ్వర్యంలో షహీద్ దివస్ (అమరవీరుల సంస్మరణ దినోత్సవం) వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల త్యాగాలను స్మరిస్తూ విద్యార్థులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలోపాల్గొన్నారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ వెంకట్ రెడ్డి, ట్రైనింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు.

యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముందుగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు,విద్యార్థులకు దేశభక్తి అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.కళాశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి శ్రమదానం నిర్వహించారు. మొక్కల సంరక్షణ మరియు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.చైతన్య ర్యాలీ "మేరా యువ భారత్ - పెద్దపల్లి" జాతీయ జెండాలతో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని ఈ సందర్భంగా నినాదాలు చేశారు. కళాశాల అధ్యాపక బృందం, యువజన సంఘాల నాయకులు శ్రీనివాస్, రాకేష్, మహేష్ , పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత : చైర్మన్ బిరుదు రాధాకృష్ణ

పట్టణ పరిశుభ్రతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరు బాధ్యతగా గుర్తించాలని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ అన్నారు, సోమవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా (99 రోజుల యాక్షన్ ప్లాన్) 4వ వార్డులో పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొని పరిసరాలను శుభ్రపరిచారు.



Edited, Printed, Published and Owned by B. ALIVELU, H.No. 2-10-18, Mukurampura, Karimnagar-505001. Printed at Rimsha Printers, Algunur(V),Timmapoor(M), Karimnagar District, Published at : H.No. 2-10-18, Mukurampura, Karimnagar-505001. Editor: B.ALIVELU. RNI No. APTEL/2008/26046. Cell: 9700207214